సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 134
శుక్రవారం 4-8-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



క్యాబ్‌లో ఏం మాట్లాడుతున్నారు?

క్యాబ్‌లో ఎక్కాక చేతులు ఊరికే ఉండవు. ఫోన్ తీసి కబుర్లు చెప్పమంటాయి. కాని కబుర్లు మరీ పర్సనల్ అయినప్పుడు, అవి విన్న డ్రైవర్‌కు దుర్బుద్ధి పుడితే నరకం అనుభవించాల్సి ఉంటుంది. బెంగళూరులో క్యాబ్ ఎక్కిన మహిళ ఫోన్‌లో చేసిన పర్సనల్ టాక్‌ను విన్న డ్రైవర్ ఆమెను ఏడు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి 40 లక్షలు గుంజాడు. అనుకోకుండా దొరికాడు. ఇలాంటి ఘటనలు ఎన్ని జరుగుతున్నాయో! ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫ్యాషన్









యునిక్ యూత్

డ్రెస్సింగ్‌లో ఎప్పడూ యునిక్‌గా ఉండాలనే ఆలోచన నేటి యూత్‌ది. వారి అభిరుచికి తగినట్టుగా అందుబాటులోకి వచ్చింది వన్‌సైడ్ లాంగ్ స్టయిల్. టాప్ లేదా కుర్తీ ఒక వైపు పొడవుగా, మరోవైపు పొట్టిగా ఉండటం ఈ స్టయిల్ ప్రత్యేకత.

రెండు రంగులు భిన్నం కావచ్చు. రెండు ఫ్యాబ్రిక్స్ కూడా వేర్వేరువి అయి ఉండవచ్చు. కుర్తా లేదా టాప్ డిజైన్‌లో ప్రత్యేకత కనిపించాలంటే ఓ చిన్న మార్పు తీసుకురావాలి. డిజైనర్స్ చేసిన ఓ చిన్న ఆలోచన యూత్‌ని మరింతగా ఆకట్టుకుంటుంది. వెస్టన్ నుంచి ఇండియన్ వేర్‌లోకి ఈ డిజైన్ కొత్తగా ఆకట్టుకుంటోంది. వెస్టన్ పార్టీలో ప్రత్యేకతను చాటడమే కాదు, స్ట్రీట్ స్టయిల్‌గానూ మార్కులు కొట్టేస్తోంది ఈ డిజైన్.

టిప్స్



ఒక గుడ్డు తెల్ల సొనలో స్పూను తేనె వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముక్కుమీద, చుట్టూ పూతలా వేసి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరాక గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల బ్లాక్ హెడ్స్ సమస్య తగ్గుముఖం పడుతుంది.



బ్రెడ్ ప్యాకెట్‌లో కొన్ని స్లైసులను మాత్రం వాడి మిగిలిన వాటిని ప్యాకెట్‌లో అలానే ఉంచేస్తుంటాం. అయితే అవి కొన్నిసార్లు రాయిలా గట్టిగా మారతాయి. ఇటువంటప్పుడు బ్రష్‌ను నీటిలో ముంచి స్లైసులపైన రాయాలి. తరువాత కొద్దిగా నీటిని చల్లి, స్లైసులను పదిహేను సెకన్ల పాటు అవెన్‌లో ఉంచితే మెత్తగా తాజాగా మారిపోతాయి.



వర్షంలోనూ క్లియర్ వ్యూ మిర్రర్

వర్షాకాలంలో కారు అద్దాలు తడిసి ఎదురుగా వస్తోన్న వాహనాలు సరిగా కనపడవు. వైప్స్, గుడ్డతో తుడిచినప్పటికీ ఇంకా మసకమసకగానే కనిపిస్తుంది. ఇలా కాకుండా అద్దం క్లియర్‌గా కనిపించాలంటే.. బంగాళ దుంపను రెండు చెక్కలు చేయాలి. ఒక చెక్కను తడిసిన అద్దంపై రుద్దాలి. అద్దం మీద ఉన్న తడి పోయి క్లియర్‌గా ఉంటుంది. మరోసారి వర్షం నీళ్లు పడినా సులభంగా జారిపోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



డ్రైఫ్రూట్స్‌ని మార్కెట్ నుంచి తెచ్చిన తరువాత కొద్దిగా ఉప్పు వేసి దోరగా వేయించి, గాలిచొరబడని డబ్బాలో నిల్వ చేస్తే వర్షాకాలంలోనూ మెత్తబడకుండా, పాడవకుండా కరకరలాడతాయి.

ఒంటరి మహిళ

క్యాబ్‌లో ఏం మాట్లాడుతున్నారు?

క్యాబ్‌లో ఎక్కాక
చేతులు ఊరికే ఉండవు.
ఫోన్ తీసి కబుర్లు చెప్పమంటాయి.
కాని కబుర్లు మరీ పర్సనల్
అయినప్పుడు,
అవి విన్న డ్రైవర్‌కు దుర్బుద్ధి పుడితే
నరకం అనుభవించాల్సి ఉంటుంది.
బెంగళూరులో క్యాబ్ ఎక్కిన మహిళ
ఫోన్‌లో చేసిన
పర్సనల్ టాక్‌ను విన్న డ్రైవర్ ఆమెను
ఏడు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి
40 లక్షలు గుంజాడు.
అనుకోకుండా దొరికాడు.
ఇలాంటి ఘటనలు
ఎన్ని జరుగుతున్నాయో!
ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?



స్త్రీలు విధులు, ఉపాధికి బయటకు వెళ్లక తప్పదు. ఇప్పుడున్న ప్రయివేటు రవాణా యాప్‌లను నమ్ముకోకా తప్పదు. ఇలాంటి యాప్‌లలో పని చేసే డ్రయివర్లు నూటికి తొంభై తొమ్మిది మంది తమ బతుకు తెరువు కోసం పని చేస్తున్నా ఒకరిద్దరు ప్రమాదకరంగా మారుతున్నారు. ఇటీవల బెంగళూరులో ఒక మహిళ టూ వీలర్ బుక్ చేసుకుంటే ఆమెను వెనుక కూచోబెట్టుకున్న డ్రైవర్ ఆమె చూసేలా తన శరీరాన్ని తాను తాకుతూ అసభ్యంగా ప్రవర్తిస్తుంటే ఆమె మధ్యలో బైక్ మీద నుంచి దూకేయాల్సి వచ్చింది. ఇప్పుడు వెలికి వచ్చిన మరో ఘటన ఒంటరి స్త్రీలు ఎంత జాగ్రత్తగా క్యాబ్ లేదా టూ వీలర్ వ్యవస్థను ఉపయోగించుకోవాలో తెలుపుతోంది.

అసలేం జరిగింది?

ఇది నవంబర్ 2022లో జరిగింది. బెంగళూరులో ఒక వివాహిత క్యాబ్ మాట్లాడుకుని ఇంటి నుంచి బయలుదేరింది. క్యాబ్‌లో వెనుక సీట్‌లో కూచుని ఫోన్ తీసి మిత్రుడితో మాట్లాడసాగింది. అప్పటికే డిప్రెషన్‌లో ఉన్న ఆమె తన మిత్రుడితో ఇంటి సమస్యలు చెప్పుకుని, త్వరలో విడాకులు తీసుకుందామనుకుంటున్న ఆలోచన చెప్పి, మిత్రునితో సాన్నిహిత్యపు మాటలు మాట్లాడింది. తను క్యాబ్‌లో ఉన్నానని ఇంకో వ్యక్తి ఆ మాటలు వింటున్నాడని మర్చిపోవడం ఆమె తప్పు. ఈ మాటలన్నీ విన్న క్యాబ్ డ్రైవర్ ఆమెను గమ్యంలో దింపి సోషల్ మీడియా ద్వారా ఆమెనూ ఆమె భర్తనూ గుర్తించాడు. తర్వాత ఆమెకు కాల్ చేసి ఆ రోజు తాను విన్న సంగతంతా భర్తకు చెప్పేస్తానని, మరో పురుషుడితో సన్నిహితంగా వ్యవహరిస్తున్నావని చెప్పేస్తానని బెదిరించాడు. ఆ వివాహిత హడలిపోయింది. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలియక భయపడిపోయింది. దాంతో క్యాబ్ డ్రైవర్ ఆమె నుంచి గత ఏడు నెలలుగా డబ్బు గుంజడం మొదలెట్టాడు. ఆమె తన దగ్గరున్న 20 లక్షల రూపాయలు అతనికి సమర్పించింది. అయినప్పటికీ ఆశ చావక వేధిస్తుండటంతో తల్లిగారి ఇంటికి వెళ్లి తల్లికి చెందిన 20 లక్షల విలువైన నగలు తెచ్చి ఇచ్చింది. పరువు మర్యాదలు ఎలా కాపాడుకోవాలో తెలియక, మరోవైపు ఈ క్యాబ్ డ్రైవర్ పెడుతున్న నరకం నుంచి ఎలా బయటకు రావాలో అర్థం కాక సతమతమైంది. ఇంత జరుగుతున్నా ఆమె ఈ విషయాన్ని భర్తకు కాని, పోలీసులకు కాని తెలిపే ధైర్యం చేయలేదు. అయినప్పటికీ దుర్మార్గుడు దొరికాడు.

ఎలా దొరికాడు?

జూలై 24న బెంగళూరులోని రామ్మూర్తి నగర్‌లో ఒక క్యాబ్ ఆగి అందులో కొందరు పార్టీ చేసుకుంటున్నారని పోలీసులు గమనించారు. రాత్రిపూట అలా క్యాబ్‌లో పార్టీ చేసుకోవడం సరికాదని హెచ్చరించి వెళ్లిపోయారు. అయితే వెళుతూ ఉండగా ఎస్.ఐకి అనుమానం వచ్చింది. క్యాబ్‌లో ఉన్నది డ్రైవర్ స్థాయి మనుషులు. వారు తాగుతున్నది గ్లెన్లివట్ విస్కీ. ఆ బాటిల్ ధర బెంగళూరులో 9,900. అంత ఖరీదైన బాటిల్ ఎక్కడిదని డ్రైవర్‌ని పేరడిగితే 'ప్రవీణ్' అని చెప్పాడు. ఐడి కార్డులో కిరణ్ అని ఉంది. దాంతో పోలీసులకు పూర్తిగా అనుమానం వచ్చింది. ఆ క్యాబ్‌కు డ్రైవర్ అతడే. మిగిలిన వారు స్నేహితులు. కిరణ్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి తగు మర్యాదలు చేశాక మొత్తం కక్కాడు. పోలీసులు అవాక్కయ్యి ఆ వివాహితను, ఆమె భర్తను కలిసి విషయం చెప్పారు. అయినప్పటికీ వారు కేసు పెట్టడానికి సంశయిస్తే బాధితుల పేర్లు బయటకు రాకుండా చూస్తామని హామీ ఇచ్చి కేసు పెట్టించారు. వెంటనే కిరణ్‌ని అరెస్ట్ చేశారు. కుదువ పెట్టిన నగలన్నీ బయటకు తెచ్చారు. డబ్బు మాత్రం అతడు బెట్టింగ్‌లో ఖర్చు పెట్టేశాడు.



● పోలీసులకు పట్టుబడ్డ క్యాబ్ డ్రైవర్ కిరణ్

జాగ్రత్త... మాటలు వింటారు

మీ మాటలు, చాటింగ్ ప్రతిదీ అపరిచితుల కంట పడకుండా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం స్త్రీలకు ఉంది. అపరిచితుల ఎదుట ఫోన్లలో పర్సనల్ విషయాలు మాట్లాడకపోవడం, ఇంట్లో ఒంటరిగా ఉంటుంటే గనక అలాంటి వివరాలు చెప్పకపోవడం, ఏ సమయంలో ఎక్కడ ఉండేది చెప్పకపోవడం చాలా ముఖ్యం. అలాగే ఫోన్ క్యాబ్‌లో వదిలి ఏదైనా కొనడానికి కిందకు దిగకూడదు. పిల్లల స్కూల్ టైమింగ్స్, డ్రాపింగ్ పికప్ వంటి విషయాలు ఫోన్‌లో డ్రైవర్ వినేలా చెప్పకూడదు. డబ్బు విషయాలు కూడా. అలాగే డ్రైవర్‌తో కాలక్షేపం కబుర్లు కూడా మంచివి కావు. ఏ క్యాబ్ డ్రైవర్ అయినా ఏ కొంచెం ఇబ్బంది పెట్టినా వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలి. ఎందుకంటే మన వ్యక్తిగత సమస్యలను కుటుంబం అర్థం చేసుకుంటుంది. వాటిని అడ్డు పెట్టి ఎవరూ బ్లాక్‌మెయిల్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిదీ... ముఖ్యంగా స్త్రీలది. తస్మాత్ జాగ్రత్త!

వంటిల్లు

చిరుజల్లుల్లో... క్రిస్పీ సిప్స్

చల్లని సాయంకాలం ఓ మాదిరిగా పడుతోన్న వర్షం చినుకులు చూస్తు టీ తాగితే ఆ అనుభూతే వేరు. పొగలు గక్కే టీని సిప్ చేస్తూ క్రిస్పీగా, కారకారంగా ఉండే వేడివేడి స్నాక్స్ మరింత ఆనందాన్ని ఇస్తాయి. పకోడీ, బజ్జీ, సమోసాలు ఎప్పుడూ తినేవే కాబట్టి ఈసారి వంటిల్లు చెబుతోన్న స్నాక్స్‌తో టీని సిప్ చేసి చూడండి.



క్రిస్పీ మసాలా మత్రీ

కావలసినవి: గోధుమ పిండి – రెండు కప్పులు; వాము – అరటీస్పూను; కసూరీ మేథి – రెండు టేబుల్ స్పూన్లు; కారం – అరటేబుల్ స్పూను; గరం మసాలా – అరటేబుల్ స్పూను; కార్న్ స్టార్చ్ – టేబుల్ స్పూను ; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● గోధుమ పిండిలో వాము, కసూరీ మేథి, కారం, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● దీనిలో టేబుల్ స్పూను నెయ్యివేసి మరోసారి కలపాలి ● ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ ముద్దలాగ కలపాలి ● మిగిలిన టేబుల్ స్పూను నెయ్యిని కార్న్‌స్టార్చ్‌లో వేసి పేస్టులా కలపాలి ● పిండి ముద్దను మందపాటి గుండ్రని చెక్కల్లా వత్తుకోవాలి. ఈ చెక్కలపైన కార్న్ పేస్టు రాయాలి ● చెక్కలను మీడియం మంటమీద క్రిస్పీగా మారేంత వరకు డీప్‌ఫ్రై చేసుకుంటే మసాలా మత్రీ రెడీ.



సూజీ టోస్ట్

కావలసినవి: బ్రెడ్ స్లైస్‌లు – ఆరు, సూజీ రవ్వ – అరకప్పు; పెరుగు – పావు కప్పు; క్యారట్ తురుము – టేబుల్ స్పూను; ఉల్లిపాయ ముక్కలు – రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో తరుగు – టేబుల్ స్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; కారం – టీస్పూను; బటర్ – టోస్టు వేయించడానికి సరిపడా; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బ్రెడ్ స్లైలు తప్పించి మిగతా పదార్థాలన్నింటిని గిన్నెలో వేసి కలపాలి ● రుచికి సరిపడా ఉప్పు, కొద్ది కొద్దిగా నీళ్లుపోసుకుంటూ చిక్కగా కలపాలి ●కలిపిన మిశ్రమాన్ని బ్రెడ్ స్లైస్‌మీద మందంగా పరుచుకోవాలి ● ఇలా స్లైసులన్నింటికీ రాశాక, నాన్‌స్టిక్ పాన్‌పై బటర్ వేసి రెండు వైపులా చక్కగా కాల్చాలి ● టోస్టు బంగారు వర్ణంలో, క్రిస్పీగా మారేంత వరకు కాల్చి తీసేయాలి.





స్టఫ్డ్ బ్రెడ్ పకోడి

కావలసినవి: వైట్ బ్రెడ్‌స్లైసులు – నాలుగు; పన్నీర్ – రెండు స్లైసులు; పుదీనా, కొత్తిమీర చట్నీ – నాలుగు టీస్పూన్లు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా. **స్టఫింగ్ :** ఉడికించి చిదుముకున్న బంగాళ దుంప – కప్పు ; ఉల్లిపాయ – ఒకటి ; పచ్చిమిర్చి – రెండు; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; జీలకర్ర పొడి – టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – అరటీస్పూను ; ఆమ్‌చూర్ పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా –అరటీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు.

బ్యాటర్: శనగపిండి – ఒకటిన్నర కప్పులు; బియ్యప్పిండి – మూడు టేబుల్ స్పూన్లు; వాము – అరటీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా; కారం – అరటీస్పూను ; వంటసోడా – పావు టీస్పూను.

తయారీ: ● ఉల్లిపాయ, పచ్చిమిర్చిని సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నెతీసుకుని స్టఫింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నీ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● మరో గిన్నెలో బ్యాటర్ కోసం తీసుకున్న పదార్థాలు, తగినన్ని నీళ్లుపోసి పకోడి పిండిలా కలిపి పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు బ్రెడ్ అంచులను తీసేసి పుదీనా కొత్తిమీర చట్నీని రాయాలి ● దీనిపైన బంగాళ దుంపల స్టఫింగ్ మిశ్రమాన్ని పెట్టాలి ● చివరిగా పన్నీర్ స్లైస్‌ను పెట్టి మరో బ్రెడ్‌స్లైస్‌తో కప్పేసి రెండు ముక్కలుగా కట్ చేయాలి ● ఇప్పుడు బ్యాటర్‌లో బేకింగ్ సోడా వేసి కలపాలి ● శాండ్‌విచ్‌లా స్టఫ్ చేసిన బ్రెడ్ స్లైసులను బ్యాటర్‌లో ముంచి... సలసల మరుగుతోన్న నూనెలో డీప్‌ఫ్రై చేయాలి ● గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారాక తీసేసి చాట్ మసాలా చల్లుకుని సర్వ్ చేసుకోవాలి.



చీజ్ కార్న్ రోల్స్

కావలసినవి: బంగాళ దుంపలు – మూడు; కార్న్ గింజలు – అరకప్పు; చీజ్ – అరకప్పు; వెల్లుల్లి తురుము – టీస్పూను; కార్న్ స్టార్చ్ – టేబుల్ స్పూను; బ్రెడ్ స్లైసులు – నాలుగు; కారం – అరటీస్పూను; గరం మసాలా – పావు టీస్పూను; ఛాట్ మసాలా – అరటీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● బంగాళ దుంపలు, కార్న్ గింజలను విడివిడిగా ఉడికించాలి ● బంగాళ దుంపల తొక్క తీసి చిదుముకోవాలి ● దీనిలో కార్న్ గింజలు, వెల్లుల్లి తురుము, కార్న్‌స్టార్చ్, కారం, గరం మసాలా, మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన బ్రెడ్‌స్లైసులను వేసి అన్నీ కలిసిపోయేలా కలిపి, చిన్నచిన్న ఉండలు చేసుకోవాలి ●ఈ ఉండలకు వేలితో రంధ్రం చేసి చీజ్‌ను సన్నగా తురిమి పెట్టాలి ●తరువాత రంధ్రాలని మూసేసి రోల్స్ ఆకారంలో వత్తుకోవాలి ● ఇలా అన్ని ఉండలను రోల్స్ చేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి, సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.

జపనీస్ ఫ్లఫీ పాన్‌కేక్

కావలసినవి: గుడ్లు – రెండు; పాలు – రెండు టేబుల్ స్పూన్లు; వెనీలా ఎసెన్స్ – పావు టీస్పూను; గోధుమ పిండి – పావు కప్పు; వంటసోడా – టీస్పూను; చక్కెర – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు.

తయారీ: ● గుడ్లలోని పచ్చసొనను ఒక గిన్నెలోకి తీసుకుని పాలు, వెనీలా ఎసెన్స్ వేసి ఐదు నిమిషాల పాటు నురగవచ్చేంత వరకు చక్కగా కలపాలి ● ఇప్పుడు దీనిలో గోధుమ పిండి వేసి పేస్టులా కలిపి పక్కన పెట్టాలి ● గుడ్ల తెల్ల సొనలో చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. ఒక్కో స్పూను చక్కెర వేస్తూ నురగ వచ్చేంత వరకు కలపాలి ● నురగ వచ్చిన మిశ్రమాన్ని గుడ్ల పచ్చసొన మిశ్రమంలో వేసి కలపాలి ● వేడెక్కిన నాన్‌స్టిక్ పాన్ పై కొద్దిగా నెయ్యిరాసి కేక్‌లా పోసుకోవాలి ● ఈ కేక్ చుట్టూ రెండు మూడు స్పూన్ల నీళ్లుపోసి మూత పెట్టి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు రెండువైపులా చక్కగా ఉడికిస్తే జపనీస్ ఫ్లఫీ పాన్‌కేక్ రెడీ ● వేడిగా ఉన్నప్పుడే బటర్, మేపిల్ సిరప్‌తో సర్వ్‌చేసుకోవాలి.




'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 134

శుక్రవారం 4-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కంప్యూటర్ల దిగుమతిపై నియంత్రణ

దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా కేంద్రం నిర్ణయం - 13లో



తొలి టి20 చేజారె...


వెస్టిండీస్ చేతిలో నాలుగు పరుగుల తేడాతో ఓడిపోయిన భారత్. - 13లో



అదే ప్రతిష్టంభన!

పార్లమెంటులో మణిపూర్ ప్రతిష్టంభన వీడకపోగా గురువారం పీటముడి మరింతగా బిగుసుకుంది.

- వివరాలు 6లో



జ్ఞానవాపిలో సర్వేకు ఓకే

వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో సర్వే జరపాలంటూ ఏఎస్ఐకు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు సమర్థించింది.

- వివరాలు 6లో



హరియాణాలో మళ్లీ ఉద్రిక్తత

ఇప్పటికే మత ఘర్షణలతో అట్టుడికిన హరియాణాలోని నూహ్ జిల్లాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

- వివరాలు 6లో



కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య


రాజస్తాన్ కోటా పట్టణంలో వైద్య విద్య ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

- వివరాలు 6లో

కోకాపేట 'కనకమే'

ఎకరం రూ.100 కోట్లు

- హెచ్ఎండీఏ ఆన్‌లైన్ వేలంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక ధర
- కనిష్టంగా ఎకరా రూ.67.25 కోట్లు.. సగటున రూ.73.23 కోట్లు పలికిన భూములు
- ఏడు ప్లాట్లలో 45.33 ఎకరాల విక్రయం.. హెచ్ఎండీఏకు రూ.3,319.60 కోట్ల ఆదాయం
- ఓఆర్ఆర్ పక్కన, ఐటీ కారిడార్‌కు అతి సమీపంలో ఉండటంతో డిమాండ్
- ఎగబడిన దిగ్గజ వ్యాపార సంస్థలు



హైదరాబాద్‌లోని నియోపోలిస్ లేఅవుట్‌లో ఎకరానికి **100.75** కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు ఎకరం భూమి అంటే వేలల్లో.. ఆనక లక్షకో, రెండు లక్షలకో వచ్చేది. ఇప్పుడు రాష్ట్రంలో మారుమూల కూడా ఇరవై, ముప్పై లక్షలు లేకుంటే భూమివైపు చూసే పరిస్థితి లేదు. హైదరాబాద్‌లో, చుట్టుపక్కల అయితే కోట్లు పెట్టినా స్థలం దొరకడం కష్టమే. ఇప్పుడు కోకాపేటలో భూముల ధరలు అలాంటి రికార్డులన్నింటినీ బద్దలు కొట్టేశాయి. నియోపోలిస్ లేఅవుట్‌లో ఎకరానికి ఏకంగా రూ.100.75 కోట్ల ధర పలికి రికార్డు సృష్టించింది. హెచ్ఎండీఏ ఇదే లేఅవుట్‌లో ఇంతకుముందు నిర్వహించిన వేలంలో ఎకరానికి గరిష్టంగా రూ.60 కోట్ల రేటు పలకగా.. గురువారం నాటి రెండోదశ దాన్ని మించిపోయింది. రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థల నుంచి అనూహ్య పోటీ కనిపించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలో ఇదే అత్యధికమని ఆ రంగానికి చెందిన నిపుణులు చెప్తున్నారు. ఎకరానికి రూ.వంద కోట్లకుపైగా ధర పలకడంతో అంతర్జాతీయ స్థాయిలో కూడా హైదరాబాద్ చర్చనీయాంశమైందని అంటున్నారు.

రెండు విడతలుగా బిడ్డింగ్..

నియోపోలిస్‌లో 7 ప్లాట్లలోని భూములకు గురువారం ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించారు. హెచ్ఎండీఏ అన్ని ప్లాట్లలో భూములకు ఎకరానికి రూ.35 కోట్ల కనీస ధరను నిర్ణయించింది. ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో తొలి నుంచీ ఉత్కంఠభరిత పోటీ కనిపించింది. కనిష్టంగా ఎకరానికి రూ.67.25 కోట్ల నుంచి గరిష్టంగా రూ.100.75 కోట్ల వరకు ధర మిగతా 2వ పేజీలో ▶

భూం.. బూమ్ సర్కార్ ఖజానాకు హెచ్ఎండీఏ నజరానా 7లో

అసెంబ్లీ 3 రోజులే

ఆదివారం ముగియనున్న సమావేశాలు.. ఉభయ సభల బీఏసీ భేటీల్లో ఎజెండా ఖరారు

నేడు శాసనసభ ముందుకు 10 కీలక బిల్లులు.. శని, ఆదివారాల్లో చర్చ, ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాలు మూడు రోజుల పాటు కొనసాగి ఆదివారం ముగియనున్నాయి. శాసనసభ, శాసనమండలి బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మూడు రోజులకు సంబంధించిన ఎజెండాను కూడా ఖరారు చేశారు. దీని ప్రకారం.. 10 ప్రభుత్వ బిల్లులపై చర్చించి ఆమోదించడంతో పాటు 3 అంశాలకు సంబంధించి స్వల్పకాలిక చర్చ కూడా జరుగుతుంది. శని, ఆదివారాల్లో ప్రభుత్వ బిల్లులపై చర్చించి ఆమోదించిన తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడనుంది.

సాయన్న మృతికి సంతాపం.. వాయిదా

శాసనసభ వర్షాకాల సమావేశాలు గురువారం ఉదయం 11.30కు ప్రారంభమయ్యాయి. దివంగత ఎమ్మెల్యే సాయన్న మృతికి సంతాపం ప్రకటించిన తర్వాత సభ వాయిదా పడింది. అనంతరం స్పీకర్ పోచారం అధ్యక్షతన ఆయన చాంబర్‌లో బీఏసీ భేటీ జరిగింది. డిప్యూటీ స్పీకర్ పద్మా రావుతో పాటు మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్ రావు, నిరంజన్‌రెడ్డి, మిగతా 11వ పేజీలో ▶


అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే ఈటలను ఆలింగనం చేసుకున్న మంత్రి కేటీఆర్

జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం

- దీనిపై కేంద్రం నిర్ణయానికి వస్తుండటం మంచి పరిణామం
- దీని కోసం దివంగత ఎమ్మెల్యే సాయన్న చాలా తపించారు: కేసీఆర్

- వివరాలు 11లో

దమ్ముంటే 20 రోజులు అసెంబ్లీ నడపాలి..

కాంగ్రెస్‌ను ఎదుర్కోలేకనే ఆర్నెల్లుగా సభ పెట్టలేదు: భట్టి

నాలుగేళ్లుగా చేయనిది.. ఈ 2 నెలల్లో చేస్తారా?: ఈటల

11లో

న్యూస్‌రీల్

త్వరలో పీఆర్సీ, ఐఆర్‌పై స్పష్టత



రెండో పీఆర్సీ ఏర్పాటుతో పాటు జూలై 1 నుంచి ఐఆర్‌ను ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సీఎం కేసీఆర్‌ను కోరింది. 2,3 రోజుల్లో సమావేశం నిర్వహిస్తామని సీఎం హామీ ఇచ్చారని రాజేందర్ చెప్పారు.

- వివరాలు 2లో

రైతు రుణమాఫీ ప్రక్రియ షురూ



రాష్ట్రంలో రైతు రుణమాఫీ ప్రక్రియ గురువారం పునఃప్రారంభమైంది. సీఎం కేసీఆర్ ఆదేశం ప్రకారం ఆర్థికశాఖ రూ. 167.59 కోట్లు విడుదల చేసిందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 3లో

పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్!



ఫ్యాటీ లివర్..చిన్నారుల్లో సైతం ప్రబలుతున్న ఓ వ్యాధి. పిల్లల కాలేయాలను కమ్ముకుంటున్న ఫ్యాటీ లివర్ వ్యాధిపై నిర్లక్ష్యం వహిస్తే వారి భవిష్యత్తును చేజేతులా రోగాలకు అప్పగించినట్లు అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 14లో

ఎఫ్ఆర్ఓ హత్యకేసులో ఇద్దరికి జీవితఖైదు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంచలనం సృష్టించిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు హత్య కేసులో నిందితులు మడకం తుల, పొడియం నాగకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



లొల్లి నడుమ 'ఢిల్లీ' బిల్లుకు ఆమోదం



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్‌షా

- దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(సవరణ) బిల్లు–2023'పై గురువారం లోక్‌సభలో ఆమోద ముద్రపడింది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళన మధ్యే మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు ఈ బిల్లుపై సుదీర్ఘంగా జరిగిన చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేవలం అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే ఢిల్లీలోని అధికార ఆప్ ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేంద్రం ఢిల్లీ బిల్లును ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. ఢిల్లీ ప్రజలను బానిసలుగా మార్చడానికే ఈ బిల్లు తెచ్చారని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. - 6లో


లోక్‌సభలో మాట్లాడుతున్న అధిర్

అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగింది?

- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారిక వెబ్‌సైట్‌లో గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థుల సంఖ్యను జూన్ 11న 2,33,248గా, తర్వాత 2,33,506గా పేర్కొనడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అభ్యర్థుల సంఖ్య అలా ఎలా పెరిగిందని, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంతకాల్లో భారీగా మార్పు ఉన్నా ఇన్విజిలేటర్ ఎందుకు అభ్యంతరం తెలపలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. - 14లో



కేసీఆర్‌ది దింపుడు కల్లం ఆశ

- బీసీ బంధు, రైతు రుణమాఫీ పేరిట చివరి ప్రయత్నాలు: రేవంత్‌రెడ్డి
- ఆర్టీసీ కార్మికుల్లో వ్యతిరేకతను తగ్గించేందుకే తెరపైకి 'విలీనం'
- కేసీఆర్ బహురూపుల వేషాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- ఈసారి ఆయన మాటలను ఎవరూ నమ్మరు
- తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించేది కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్య
- ఢిల్లీలో ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి జూపల్లి

2లో


జూపల్లికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఖర్గే. చిత్రంలో రేవంత్, వేణుగోపాల్, మాణిక్‌రావ్ ఠాక్రే


ఢిల్లీలో ప్రధాని మోదీని కలసిన బండి సంజయ్

శభాష్ సంజయ్.. బాగా కష్టపడ్డారు..

బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌ను అభినందించిన ప్రధాని

- వివరాలు 2లో



'ధ్రువీకరణ' వరదపాలు

వరదల్లో కొట్టుకుపోయిన పత్రాలు, కార్డులు

➤ ఈమె పేరు గుమ్మడి కల్యాణి. ఈమెది ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి. ఇటీవలి వరదలకు కల్యాణి ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. ప్రాణభయంతో అన్నీ ఇంట్లోనే వదిలేసి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. వరద తగ్గాక వచ్చి చూడగా ఇల్లంతా బురదతో నిండిపోవడంతోపాటు విలువైన పత్రాలు, పిల్లల సర్టిఫికెట్లు అన్నీ తడిసి పాడైపోయాయి. ఒక్కో పత్రాన్ని ఇలా వేరు చేసి ఆరబెట్టింది. ఇందులో సంతకాలు అన్నీ పోయాయి. ఒకవేళ ఆరినా ఇవి పనికి వస్తాయో రావో తెలియని పరిస్థితి. - 2లో

క్లుప్తంగా...

రాష్ట్ర అధికారాలపై కేంద్ర పెత్తనం ఎందుకు?

ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై చర్చలో బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అధికారాలపై కేంద్రం పెత్తనం చెలాయించేలా ఢిల్లీ పౌరసేవల సవరణ బిల్లు ఉందని బీఆర్ఎస్ విమర్శించింది. ఢిల్లీ రవాణా, పర్యాటక, జలమండలి వంటి 50 శాఖల అధికారాలను కేంద్రం నియంత్రిస్తే ఇక ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. గురువారం ఈ బిల్లుపై చర్చలో బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడారు. బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఢిల్లీ అధికార యంత్రాంగం ఎన్నిక కాని లెఫ్టినెంట్ గవర్నర్‌కా లేక ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికా అనే అంశాన్ని సభ నిర్ణయించాలన్నారు. దీనిపై ప్రధాని ఉద్దేశం ఏమిటో తెలియాలన్నారు.

మరో నాలుగు శనివారాలు పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుదారులు స్లాట్ల కోసం సుదీర్ఘకాలం వేచి చూడకుండా ఉండేందుకు మరో నాలుగు శనివారాలు ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్ నిర్వహించనున్నామని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 19, 26వ తేదీలతో పాటు సెప్టెంబర్ 9వ తేదీన ఈ స్పెషల్ డ్రైవ్‌లు ఉంటాయని తెలిపారు. ఈ నెల 4వ తేదీన నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌కు స్లాట్లు గతంలోనే విడుదల చేశామని, 12వ తేదీ స్పెషల్ డ్రైవ్‌కు 4వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు స్లాట్లు విడుదల చేస్తామని తెలిపారు. పాస్‌పోర్టు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఎంపాస్‌పోర్టు సేవా యాప్‌లో స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించండి

కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రికి ఎంపీ ఉత్తమ్ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మైదాన ప్రాంతాల్లో బీసీలుగా ఉన్న వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి నాయకులతో కలిసి కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌లు కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ని కోరారు. గురువారం కేంద్రమంత్రిని కలిసి వాల్మీకుల తరఫున వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వాల్మీకి నాయకులు కేంద్ర మంత్రితో మాట్లాడుతూ, దేశంలో ఉన్న వాల్మీకిలు పలురాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని, కానీ తెలంగాణ, ఏపీలో మాత్రం కేవలం ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలుగా ఉన్నారని, మైదాన ప్రాంతంలో ఉన్నవారు బీసీలుగా ఉన్నారని పేర్కొన్నారు. దీనివల్ల విద్యా, ఉద్యోగ అవకాశాల్లో తమకు అన్యాయం జరుగుతోందని కేంద్ర మంత్రికి వారు విన్నవించారు.

జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది

పీఆర్ ముఖ్యకార్యదర్శికి జేఏసీ వినతిపత్రం.. లభించని స్పష్టమైన హామీ

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను ఉధృతం చేయాలని నిర్ణయించినట్టు తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో జరిపిన చర్చల్లో స్పష్టమైన హామీ లభించలేదు. దీంతో తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొంది. గురువారం సాయంత్రం సచివాలయంలో సుల్తానియాను జేఏసీ బృందం కలిసి వినతిపత్రం సమర్పించినట్టు జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్, యజ్ఞనారాయణ్, బి.వెంకటరాజం, పి. అరుణ్‌కుమార్, పి.శివబాబు, ఎస్.దాసు ఒక ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలోని అంశాలను పరిశీలిస్తామని, ఆయా డిమాండ్లను సీఎం కేసీఆర్, పీఆర్ శాఖ మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని సుల్తానియా హామీ ఇచ్చారన్నారు.

ఎన్నికల ముందే హామీలు యాదికొస్తాయ్

సీఎం కేసీఆర్‌పై షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: దేశంలో ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం తర్వాత హామీలు నెరవేరిస్తే, దొరగారికి మాత్రం ఎన్నికల ముందే హామీలు యాదికొస్తాయని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా గడీల్లో కుంభకర్ణుడిలా మొద్దు నిద్రపోయిన సీఎం కేసీఆర్ ఓట్ల కోసం అటక మీద దాచిన మేనిఫెస్టో తిరగేస్తున్నారని అన్నారు. ఈ మేరకు గురువారం షర్మిల ట్వీట్ చేశారు. రైతులను ఓట్లు అడిగేందుకు మొహం చెల్లక రుణమాఫీ చేస్తానంటూ.. నవంబర్‌లో నిర్వహించాల్సిన మద్యం టెండర్లను మూణ్నెల్ల ముందే ముంగటేసుకున్నారని దుయ్యబట్టారు. కరోనా సమయంలోనూ రాష్ట్రం ఆర్థికంగా దూసుకెళ్లిందని, నిధుల కొరత లేదని ఇన్నాళ్లు గప్పాలుకొట్టిన దొర ఎన్నికలకోసం డబ్బును పోగు చేసుకుంటున్నారని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డును రూ.7 వేల కోట్లకే లీజుకిచ్చారని, ప్రభుత్వ భూములను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

'ధ్రువీకరణ' వరదపాలు

ఈ ఫొటో వరంగల్ నగరంలోని బీఆర్‌నగర్. వరద బాధితులు ఇలా ఇంట్లో తడిసిన అన్ని పత్రాలను మంచంపై పరిచి ఆరబెట్టారు. ఇటీవల వరదలకు ఈ కాలనీ పూర్తిగా మునిగిపోవడంతో కాలనీవాసులు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. వరద తగ్గాక ఇంటికి చేరుకున్న వారికి ఏ వస్తువు చూసినా బురదతో నిండి ఉంది. ఇంట్లోని ధ్రువీకరణ పత్రాలు, చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, ఇంటిపత్రాలు అన్నీ తడిసిపోయాయి.



సర్వే చేస్తున్నాం

మోరంచపల్లి గ్రామంలో వరదలో కొట్టుకుపోయిన ప్రతి ఇంటికీ వెళ్లి అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారు. సర్వే ఆధారంగా పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులు వచ్చేలా కృషి చేస్తాం. తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని గ్రామంలో ఏర్పాటు చేస్తాం.



భవేష్‌మిశ్రా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్

వరదల్లో కొట్టుకు పోయిన పత్రాలు, పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు

- స్టడీ సర్టిఫికెట్లను కోల్పోయిన విద్యార్థులు
- ఏ ఒక్క గుర్తింపు లేకుండా పోయిన వైనం
- మళ్లీ ఒరిజినల్ సర్టిఫికెట్లు జారీ చేయాలని వేడుకుంటున్న బాధితులు

వరంగల్ డెస్క్: ఇటీవల కురిసిన కుంభవృష్టికి ఊళ్లకు ఊళ్లు మునిగిపోయాయి. కాలనీలు చెరువులు, కుంటలను తలపించగా, వీధులు వాగులుగా మారాయి. ఇలాంటి పరిస్థితి ఎదుర్కొన్న ములుగు జిల్లా కొండాయి, దొడ్ల, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, వరంగల్ నగరంలోని ముంపుకాలనీల వాసులకు ఇప్పుడు కొత్త సమస్య వచ్చింది. వరద ఉధృతికి ఇంట్లోని భూమి పట్టాదార్‌పాస్‌పుస్తకాలు, పిల్లల విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లు ఇలా అన్ని రకాల విలువైన పత్రాలు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల తడిసి పనికి రాకుండాపోయాయి. ఈ క్రమంలో తమకు కనీసం ధ్రువీకరణపత్రం కూడా లేకుండా పోయిందని పలువురు వరద బాధితులు అంటుండగా, పై చదువులకు ఎలా వెళ్లేది అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

కొండాయి, మోరంచపల్లి, వరంగల్‌లో..

గత 27వ తేదీన వరద బీభత్సానికి కొండాయి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి ప్రజలు వణికిపోయారు. ఇళ్లను వదిలి ప్రాణాలను కాపాడుకునేందుకు కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఇళ్లల్లో దాచుకున్న ధ్రువీకరణపత్రాలు, చెక్‌బుక్‌లు, పాస్‌బుక్‌లు, ఇంటిపత్రాలు.. ఇలా అన్ని రకాల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయి. ఇక వరంగల్ నగర పరిధిలో వరద ముంపునకు గురైన బీఆర్‌నగర్, ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, గోపాల్‌పూర్, నయీంనగర్ ప్రాంతాల్లోని వారిదీ ఇదే పరిస్థితి.



ప్రవీణ్‌కుమార్, దొడ్ల, ములుగు జిల్లా

అన్ని సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి

ట్రంకు బాక్సులో పెట్టుకున్న పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లన్నీ కొట్టుకుపోయాయి. నా పై చదువుల పరిస్థితి ఏమిటీ? ఇంటి పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా కొట్టుకుపోయాయి. నా సర్టిఫికెట్లు ఇప్పించి ఆదుకోవాలి.

కోకాపేట 'కనకమే'

▶ మొదటి పేజీ తరువాయి

పలికింది. సగటున ఎకరానికి రూ.73.23 కోట్ల చొప్పున లభించినట్టు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రకటించారు. గురువారం మొత్తం 45.33 ఎకరాల భూములకు వేలం నిర్వహించగా రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించినట్టు తెలిపారు. హెచ్‌ఎండీఏ ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలంపై వచ్చిన ఆదాయం కంటే ఇదే ఎక్కువని వివరించారు.

ప్రత్యేక అనుమతులతో డిమాండ్

హైదరాబాద్ నగరానికి పడమటి వైపు ఉన్న కోకాపేట్ అంతర్జాతీయ హంగులతో దేశవిదేశాలకు చెందిన వ్యాపార సంస్థలను ఆకట్టుకుంటోంది. ఇక్కడ భవన నిర్మాణాలకు సంబంధించి అంతస్తులపై పరిమితి లేదు. అపరిమితంగా అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఉండటం.. గృహ, వాణిజ్యం, వ్యాపారం వంటి అన్నిరకాల వినియోగానికి అనుమతి ఉండటం.. రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు కోకాపేట్‌పై దృష్టి సారించడానికి కారణమైంది. ఒకవైపు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరోవైపు రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు నిర్మించ తలపెట్టిన మెట్రో రైల్‌కు నియోపోలిస్ లేఅవుట్ అందుబాటులో ఉండటం మరింత డిమాండ్ పెంచింది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్ సొసైటీతోపాటు అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ఫార్చ్యూన్ 500 కంపెనీలు కూడా ఈ లేఅవుట్‌కు చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి.

భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలతో..

హెచ్‌ఎండీఏ నియోపోలిస్ లేఅవుట్‌ను సుమారు రూ.300 కోట్లతో భారీ స్థాయిలో, ఉత్తమ మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసింది. విశాలమైన రహదారులు, డ్రైనేజీలు, మంచినీటి సదుపాయాలను కల్పించింది. ఇక్కడ తొలిదశలో ఒకటి నుంచి ఐదో ప్లాట్ వరకు మొత్తంగా 64 ఎకరాలను విక్రయించారు. ప్రస్తుతం 6, 7, 8, 9, 10, 11, 14వ నంబర్ ప్లాట్లలోని 45.33 ఎకరాలను వేలం వేశారు. ఈ ప్లాట్లు కనిష్టంగా 3.60 ఎకరాల నుంచి గరిష్టంగా 9.71 ఎకరాల వరకు ఉన్నాయి.

నియోపోలిస్ లేఅవుట్ విశేషాలివీ..

- ఈ లేఅవుట్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం హెచ్‌ఎండీఏ రూ.300 కోట్లు ఖర్చు చేసింది. 40 ఎకరాల భూమిని అన్నిరకాల మౌలిక సదుపాయాల ఏర్పాటుకోసమే వినియోగించడం గమనార్హం.
- సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు, ఇతర సదుపాయాలతో 45 మీటర్లు, 36 మీటర్ల వెడల్పున్న అంతర్గత రోడ్లను నిర్మించారు. భూగర్భ డ్రైనేజీ, విద్యుత్తు, ఇతర సదుపాయాలను సమకూర్చారు. ఇక్కడ కమర్షియల్, రెసిడెన్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర అన్నిరకాల వినియోగానికి ముందస్తు అనుమతులు ఇచ్చారు.
- ఎన్ని అంతస్తుల వరకైనా హైరైజ్ బిల్డింగ్‌లను నిర్మించేందుకు అనుమతి ఉంటుంది.
- ఔటర్ రింగ్‌రోడ్డుకు కేవలం 2 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు 5 నిమిషాలు, ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాలు, హైటెక్‌సిటీకి 20 నిమిషాల వ్యవధిలో చేరుకొనేలా రోడ్డు నెట్‌వర్క్ అందుబాటులో ఉంది.



ప్లాట్ నంబర్–10కు ఎందుకంత క్రేజ్

హెచ్‌ఎండీఏ గురువారం మొత్తం ఏడు ప్లాట్లను వేలం వేసినా.. అందులో 10వ నంబర్ ప్లాట్‌కు మాత్రం బాగా డిమాండ్ వచ్చింది. 3.60 ఎకరాల విస్తీర్ణమున్న ఈ ప్లాట్‌ను హ్యాపీ హైట్స్ నియోపొలిస్, రాజపుష్ప ప్రాపర్టీస్ సంస్థలు కలసి ఏకంగా ఎకరానికి రూ.100.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాయి. ఈ ప్లాట్ మిగతా ప్లాట్ల కంటే ఎత్తులో ఉంటుంది. దీనికి వెనక వైపు నుంచి గండిపేట చెరువు, ముందు నుంచి హైదరాబాద్ నగరం వ్యూ స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్లే ఈ ప్లాట్‌కు పోటాపోటీ వేలం జరిగిందని ఓ నిర్మాణ సంస్థ ప్రతినిధి 'సాక్షి'కి తెలిపారు. ఈ ప్లాట్‌ను ఆనుకొని ఉన్న 11వ నంబర్ ప్లాట్‌లో 7.53 ఎకరాల స్థలం ఉంది. దీన్ని ఎకరం రూ.67.25 కోట్ల ధరతో ఏపీఆర్ గ్రూప్ సొంతం చేసుకుంది. పక్కపక్కనే ఉన్న రెండు ప్లాట్ల మధ్య ఎకరానికి రూ.33.5 కోట్ల తేడా ఉండటం గమనార్హం. ప్లాట్–10 స్థలంలో రెండు హైరైజ్ టవర్లను నిర్మించేందుకు రాజపుష్ప ప్రాపర్టీస్ సంస్థ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

తెలంగాణ పరపతికి నిదర్శనం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో భూముల ధర ఎకరాకు రూ.100 కోట్లకుపైగా పలకడం తెలంగాణ పరపతికి నిదర్శమని, రాష్ట్రం సాధిస్తున్న ప్రగతికి అద్దం పడుతోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలు పోటీపడి, ఇంత ధర చెల్లించి మరీ తెలంగాణ భూములు కొనడాన్ని ఆర్థిక కోణంలో మాత్రమే కాకుండా తెలంగాణ సాధించిన ప్రగతి కోణంలో విశ్లేషించాలని ప్రకటించారు. ''తెలంగాణ వస్తే హైదరాబాద్ ఆగమవుతుందని, భూముల రేట్లు పడిపోతాయని భయభ్రాంతులకు గురిచేసి.. హైదరాబాద్ ఆత్మ గౌరవాన్ని కించపర్చిన వారి చెంప చెళ్లుమనిపించే చర్యగా ఈ భూముల ధరల వ్యవహారాన్ని అర్థం చేసుకోవాలి. ఎవరెంత నష్టం చేయాలని చూసినా దృఢ చిత్తంతో పల్లెలను, పట్టణాలను ప్రగతి పథంలో నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పట్టుదలకు, కృషికి దక్కిన ఫలితమిది..'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ ఉన్నతాధికారులను సీఎం అభినందించారు.

నియోపోలిస్ రెండో విడత బిడ్డింగ్‌లో భూములకు పలికిన ధర, ఆదాయం వివరాలివీ..

ప్లాట్ నం.	విస్తీర్ణం	బిడ్ ధర	వచ్చిన ఆదాయం	బిడ్డర్
6	7 ఎకరాలు	రూ.73 కోట్లు	రూ.511.00 కోట్లు	ఎంఎస్ఎన్ ఫార్మాకెమ్ ప్రైవేట్ లిమిటెడ్
7	6.55 ఎకరాలు	రూ.75.50 కోట్లు	రూ.494.53 కోట్లు	నవట్రిస్ ఇన్వెస్ట్‌మెంట్స్, రాజపుష్ప ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్
8	9.71 ఎకరాలు	రూ.68 కోట్లు	రూ.660.28 కోట్లు	బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్
9	3.60 ఎకరాలు	రూ.75.25 కోట్లు	రూ.270.90 కోట్లు	డిబ్లూక్ అండ్ పి.మంగత్రామ్ ప్రాపర్టీస్ లిమిటెడ్
10	3.60 ఎకరాలు	రూ.100.75 కోట్లు	రూ.362.70 కోట్లు	హ్యాపీ హైట్స్ నియోపోలిస్, రాజపుష్ప ప్రాపర్టీస్
11	7.53 ఎకరాలు	రూ.67.25 కోట్లు	రూ.506.39 కోట్లు	ఏపీఆర్ గ్రూప్
14	7.34 ఎకరాలు	రూ.70.00 కోట్లు	రూ.513.80 కోట్లు	లక్ష్మీనారాయణ గుమ్మడి, వంగల శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు వెంట్రాప్రగడ, మాడుగుల కార్తీక్‌రెడ్డి

మొత్తం 45.33 ఎకరాలు - రూ.3,319.60 కోట్లు

కేసీఆర్‌ది దింపుడు కల్లం ఆశ

- బీసీ బంధు, రైతు రుణమాఫీ పేరిట చివరి ప్రయత్నాలు: రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి జూపల్లి



ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి కృష్ణారావు. చిత్రంలో మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను, కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధమయ్యారని అర్థమై దింపుడు కల్లం ఆశతో బీసీ బంధు, రైతు రుణమాఫీ అంటూ కేసీఆర్ చివరి ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్ ఎన్ని ప్రయోగాలు, ప్రయత్నాలు చేసినా... ఇంటింటికీ తిరిగి ప్రజల కాళ్లు పట్టుకున్నా తెలంగాణ సమాజం, కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌ను వదిలిపెట్టబోదని రేవంత్ హెచ్చరించారు. గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రేవంత్, మాణిక్‌రావ్ ఠాక్రే, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, మాజీ పోలీసు అధికారి నాగరాజు, కూచికుళ్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి సహా పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని తెలిపారు. 4 కోట్ల మంది ప్రజల సంక్షేమం కోసం పనిచేయకుండా తన నలుగురు కుటుంబ సభ్యుల సంక్షేమం, పదవులు, పైసలు, ఫాంహౌస్‌లు, కాంట్రాక్టుల కోసం రాష్ట్రాన్ని పణంగా పెట్టారని దుయ్యబట్టారు. కేసీఆర్‌కు ఢిల్లీలో దందా చేయాలన్నా, తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా లిక్కర్ ఆదాయ వనరుగా మారిందని విమర్శించారు. ప్రస్తుతం కేసీఆర్ లిక్కర్ కింగ్‌లా మారిపోయారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కేసీఆర్ ప్రైవేట్ సైన్యంపై ఈసీకి ఫిర్యాదు

ఆర్టీసీ కార్మికుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకోవడానికే ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి కేసీఆర్ తెరలేపారని రేవంత్ ఆరోపించారు. మరోసారి మోసగించేందుకు కేసీఆర్ వేస్తున్న బైరూపుల వేషాన్ని తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని... ఈసారి ఆయన మాటలను ఎవరూ నమ్మరని రేవంత్ చెప్పారు. అందుకే కేసీఆర్ పార్టీ ఫిరాయింపులు, డబ్బు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే పోలీసుల బదిలీలను సీఎం చేపడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో నెగ్గడానికి రిటైరైన అధికారులను ప్రైవేట్ సైన్యంగా తయారుచేసి కేసీఆర్ కుట్ర చేస్తున్నారని, ఆ వివరాలన్నింటినీ సేకరించి త్వరలో ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేస్తుందని వివరించారు.

కేసీఆర్ నియంత: జూపల్లి

మాజీ మంత్రి జూపల్లి మాట్లాడుతూ కేసీఆర్ తొమ్మిదేళ్లుగా నియంతలా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి మరిచిపోవడం ఆయనకే చెల్లుతుందన్నారు. దేశ చరిత్రలో కేసీఆర్‌ను మించిన అవినీతి ముఖ్యమంత్రి ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. రాజకీయ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించారని... ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖర్చు పెడుతున్న రూ. వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో కేసీఆర్ చెప్పాలని జూపల్లి డిమాండ్ చేశారు.

కేసీఆర్.. చార్లెస్ శోభరాజ్ శిష్యుడు

తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించేది కాంగ్రెస్ పార్టీనేనని, బీజేపీ ఏమాత్రం నమ్మదగిన పార్టీ కాదని రేవంత్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఇప్పటికైనా ఈ విషయం గుర్తించి కాంగ్రెస్‌లో చేరాలని రేవంత్ ఆహ్వానించారు. తనను చంద్రబాబు శిష్యుడు అని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని... అయితే కేసీఆర్ మాత్రం అంతర్జాతీయ నేరగాడు చార్లెస్ శోభరాజ్ శిష్యుడని... ఇప్పటివరకు రూ. లక్ష కోట్లు అక్రమంగా ఆర్జించారని ఆరోపించారు.



బండి సంజయ్ కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

శభాష్ సంజయ్.. బాగా కష్టపడ్డారు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను అభినందించిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: 'శభాష్ సంజయ్.. బాగా కష్టపడ్డారు. తెలంగాణలో పార్టీని గెలిపించడానికి ఇదేవిధంగా దూకుడు కొనసాగించండి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై మరింత దృష్టి పెట్టండి' అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన సంజయ్ ప్రధాని మోదీని గురువారం పార్లమెంట్‌లో కలిశారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తరువాత తొలిసారి ప్రధానిని కలిసిన సంజయ్ 20 నిమిషాల పాటు ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో బీజేపీ బలోపేతానికి ఎంతగానో కష్టపడ్డారని సంజయ్‌ను మోదీ అభినందించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు మరింత కష్టపడాలని సూచించారు. ఈ సందర్భంగా సంజయ్ కుటుంబసభ్యులతో ఫొటోలు దిగడంతోపాటు వారి యోగ క్షేమాలను మోదీ అడిగి తెలుసుకున్నారు.

ప్రధానితో ఆర్.కృష్ణయ్య, బీసీ నేతల భేటీ

- కేంద్రంలో బీసీల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని వినతి
- బీసీల సమస్యలపై ప్రధానికి వినతి పత్రం అందించిన బీసీ నేతలు



ప్రధానమంత్రి మోదీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లారు. బీసీలకు న్యాయం చేసేందుకు ప్రధానమంత్రి హోదాలో జోక్యం చేసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, డా.మారేష్, డా.పద్మలత, రమేశ్ ప్రధానమంత్రితో కలిసి చర్చలు జరిపారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో బీసీలకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రధానికి వివరించి ఒక వినతిపత్రాన్ని అందించారు. జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ కులవృత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. బీసీలకు ఏ రంగంలో కూడా ఇంతవరకు జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదని, విద్యా,ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదని ప్రధానికి వివరించారు. అందుకోసం బీసీలకు రావాల్సిన వాటా కోసం మరోసారి అధ్యయనం జరగాలని ఆర్.కృష్ణయ్య కోరారు. అదేవిధంగా జనాభా గణనలో కులాల వారీగా బీసీ జనాభా గణన చేయాలని బీసీ నేతల బృందం ప్రధానిని కోరింది. బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని ప్రధానమంత్రి చెప్పారని సమావేశం అనంతరం ఆర్.కృష్ణయ్య తెలిపారు.

త్వరలో పీఆర్సీ, ఐఆర్‌పై స్పష్టత

- సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల జేఏసీ
- ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నేతల ప్రకటన
- త్వరలో ఉద్యోగ సంఘాలతో భేటీ

సాక్షి, హైదరాబాద్: రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి మధ్యంతర భృతిని ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి వి.మమత తదితరులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో కేసీఆర్‌ను కలిశారు. పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటన ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా న్యాయం జరిగేలా చూడాలని ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ఉద్యోగుల చందాతో కూడిన ట్రస్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తాము సమర్పించిన వినతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారని, రెండు మూడు రోజుల్లో ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని మామిళ్ల రాజేందర్ 'సాక్షి'కి వెల్లడించారు. సీఎంను కలిసిన వారిలో టీజీఓల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, టీఎన్‌జీఓల యూనియన్ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

ప్రజలకు 'విజయ' మరింత చేరువ కావాలి

మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి



రాజేంద్రనగర్ (హైదరాబాద్): నాణ్యతా ప్రమాణాలతో కూడిన విజయ వంటనూనెలను ప్రజలకు మరింత చేరువ చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్మించనున్న విజయ వంటనూనెల మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్ కర్మాగారం నిర్మాణానికి మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం శివరాంపల్లిలోని ప్యాకింగ్ కేంద్రం మూడు షిఫ్ట్‌లలో నడుస్తోందన్నారు. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన 3.8 ఎకరాల భూమిని ఆయిల్ ఫెడ్ సంస్థకు కేటాయించామన్నారు. రాబోయే రోజుల్లో ఆధునాతన యంత్రాలతో పూర్తి మైగ్రేడ్ పద్ధతిలో ప్యాకింగ్ స్టేషన్‌ను నిర్మించి ప్రజలకు నాణ్యమైన వంట నూనెలను అందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫెడ్ సంస్థకు స్థలాన్ని కేటాయించినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రూ.25 కోట్ల రూపాయలతో అత్యంత అధునాతనమైన విజయ హైదరాబాద్ మెగా ప్యాకింగ్ కేంద్రం, కీసర తాగునీరు కర్మాగారాలను జనవరి 2024లోపు పూర్తి చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఎండీ, డైరెక్టర్ సురేందర్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ పాల్గొన్నారు.

పీఆర్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పంచాయతీరాజ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ (జీవో 84 సవరణ) సవరిస్తూ జీవో 26ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. దీనికి అనుగుణంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) గ్రేడ్–4లో నియామకానికి వీలు ఏర్పడుతుంది. ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తిచేసుకున్న జేపీఎస్‌ల సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియ సాగుతున్న నేపథ్యంలో ఈ సవరణకు ప్రాధాన్యత ఏర్పడింది. దీనితో ఫీడర్ కేటగిరీ ద్వారా జేపీఎస్‌లను గ్రేడ్–4గా బదిలీ చేసేందుకు వీలు ఏర్పడుతుంది. గురువారం ఈ మేరకు పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. జేపీఎస్‌లను గ్రేడ్ ఫోర్‌లో తీసుకోవాలని సవరణ జీవో 26 జారీచేయడాన్ని తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ స్వాగతించారు. అయితే దీనికి అనుగుణంగా 81 జీవోను కూడా సవరిస్తూ రాష్ట్రంలోని 12,770 గ్రామాలను నాలుగు గ్రేడ్లుగా విభజిస్తూ క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధంగా గ్రామాలను గ్రేడింగ్ చేసి జేపీఎస్‌లను గ్రేడ్ ఫోర్‌లో రెగ్యులరైజ్ చేస్తే భవిష్యత్తులో వారికి ప్రమోషన్ ఛానల్ ఉంటుందని, లేదంటే మళ్లీ ఇబ్బందులు ఏర్పడతాయని వారు పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు 23 నెలల బకాయిలు

వచ్చే నెలలో చెల్లించాలని కోలిండియా ఆదేశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు 11వ వేతన సవరణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయితే, ఆ ఒప్పందానికి సంబంధించి 23 నెలల బకాయిలు ఆగస్టు నెల వేతనంతో కలిపి సెప్టెంబర్‌లో చెల్లించనున్నారు. ఈ మేరకు కోలిండియా ఉన్నతాధికారి ఉత్తమ్‌బెనర్జీ సింగరేణి యాజమాన్యానికి గురువారం ఆదేశాలు జారీ చేశారు. 11వ వేతన సవరణ ఒప్పందం మే 19వ తేదీన జరగగా, 19 శాతం మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్, 25 శాతం అలవెన్స్‌లు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. ఈ నేపథ్యంలో ఫస్ట్ కేటగిరీ కార్మికుడికి రూ.12 వేల వరకు వేతనం పెరగనుంది. అయితే ఈ విషయమై సింగరేణి యాజమాన్యం మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఐదు జిల్లాల్లో భారీ నష్టం !

రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి

- వరి, పత్తి పూర్తిగా ధ్వంసం
- జిల్లాల్లో పర్యటన తర్వాత కేంద్ర బృందం వెల్లడి
- సచివాలయంలో సీఎస్‌తో సమావేశం


సచివాలయంలో సీఎస్ శాంతికుమారితో కేంద్ర బృందం

సాక్షి, హైదరాబాద్, బూర్గంపాడు: భారీ వర్షాలకు రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయని జాతీయ విపత్తుల నివారణ సంస్థ(ఎన్‌డీఎంఏ) సలహాదారుడు కునాల్ సత్యార్థి వెల్లడించారు. వరి, పత్తి పంటలు పూర్తిగా ధ్వంసమైనట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. ప్రధానంగా మోరంచపల్లి, కొండాయి గ్రామాలు పూర్తిగా నీటమునగడంతో భారీ ఆస్తి నష్టం కలిగిందన్నారు. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కునాల్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం ఈ నెల 1 నుంచి 3 వరకు వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించింది. అనంతరం గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాతో సమావేశమై తమ పరిశీలనకు వచ్చిన విషయాలను వివరించింది. విపత్తుల నివారణకు కేంద్ర బృందం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని శాంతి కుమారి తెలిపారు.

కేంద్రానికి సమగ్ర నివేదిక అందిస్తాం

గురువారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం మండలాల్లో నష్టపోయిన పంటలను, ముంపు ప్రాంత ప్రజల ఇబ్బందులను కేంద్ర బృందం పరిశీలించింది. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల దెబ్బతిన్న పంటలు, రహదారుల వివరాలను బృందం సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ.. పంట, రహదారుల నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తామని చెప్పారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లనే అన్న బీజేపీ నేతలు

వాతావరణశాఖ నుంచి ముందస్తు హెచ్చరికలు జారీ అయినా కూడా తెలంగాణ ప్రభుత్వం తగిన వేగంతో స్పందించకపోవడంతోనే తీవ్రనష్టం వాటిల్లిందని కేంద్ర వరద పరిశీలక బృందం దృష్టికి బీజేపీ ప్రతినిధి బృందం తీసుకొచ్చింది. భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామం మునిగిపోవడం వెనక రాష్ట్ర ప్రభుత్వ సమన్వయలేమి స్పష్టమైన ఉదాహరణగా కనిపిస్తోందని పేర్కొంది. గురువారం ఈ మేరకు కేంద్ర హోంశాఖ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారు (పీపీ) కునాల్ సత్యార్థికి బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పార్టీనేత అశ్వత్థామరెడ్డి వినతిపత్రం సమర్పించారు. కేంద్రం నుంచి తగిన సహాయం అందేలా చూడాలని కోరారు.

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇస్తాం

డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మంత్రి కేటీఆర్ హామీ


కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు హామీ ఇచ్చారు. ఈ అంశం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనలో ఉందన్నారు. అసెంబ్లీలో గురువారం మంత్రి కేటీఆర్‌ను డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ(డీజేహెచ్ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, డైరెక్టర్లు దేగ కుమార్, ప్రతాప్‌రెడ్డి, దండా రామకృష్ణ, సలహాదారు విక్రమ్‌రెడ్డి, సభ్యులు వేములపల్లి రాజు, పోలంపల్లి ఆంజనేయులు కలిశారు. జర్నలిస్టులకు ఇంటిస్థలాలు కేటాయించాలని మంత్రికి మెమొరాండం అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని డీజేహెచ్ఎస్ ప్రతినిధులు కేటీఆర్‌తో అన్నారు. జర్నలిస్టులకు కూడా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, కోవిడ్ వంటి విపత్కర సమయంలోనూ వారికి అండగా నిలిచి ఆర్థికసాయం అందించిన ప్రభుత్వం తెలంగాణ మినహా దేశంలో మరెక్కడా లేదన్నారు.

రెండు లక్షలకుపైగా కుటుంబాలకు సొంతిళ్లు

గ్రేటర్ నగరంలో ఈ ఏడాది కలిగే ప్రయోజనం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల ద్వారా ఈ ఏడాది గ్రేటర్ హైదరాబాద్ నగరంలో రెండు లక్షలకుపైగా పేద కుటుంబాలు సొంత ఇళ్లను పొందనున్నాయని మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి పథకం, 118, 58, 59 జీవోల ద్వారా భూముల క్రమబద్ధీకరణతో ప్రభుత్వ బహుళ కార్యక్రమాల ద్వారా వారికి శాశ్వత గృహసదుపాయం కలుగుతుందని పేర్కొన్నారు. నగరంలో దాదాపు లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఆగస్టు 15వ తేదీ నుంచి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించి అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 4 వేల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 3 వేల కుటుంబాలకు గృహలక్ష్మి పథకం కింద ప్రయోజనం లభిస్తాయని పేర్కొన్నారు.

'జర్నలిస్ట్స్ భవన్'కు ఉప్పల్ భగాయత్‌లో స్థలం

1,847.82 చ.మీ కేటాయించిన ప్రభుత్వం


కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే) నిర్మించే 'జర్నలిస్ట్స్ భవన్'కోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో 1,847.82 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లోని ఫేజ్ -1లో ప్లాట్ నంబర్ 7ను ఆనుకొని ఉన్న ఈ స్థలాన్ని టీయూడబ్ల్యూజేకు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కోకాపేట లేదా ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని టీయూడబ్ల్యూజే కోరగా, ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో సుమారు అరెకరం స్థలం కేటాయించింది. ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మీడియా అకాడమీ చైర్మన్, యూనియన్ అధ్యక్షుడు అల్లం నారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, అల్లం నారాయణ చిత్రపటాలకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

రైతు రుణమాఫీ ప్రక్రియ షురూ

- రూ. 18,241 కోట్ల విడుదలకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు
- తొలి విడతలో రూ. 237.85 కోట్లు విడుదల
- రూ. 37 వేల నుంచి రూ. 41 వేల మధ్యనున్న రుణాలు మాఫీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతు రుణమాఫీ ప్రక్రియ గురువారం పునఃప్రారంభమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం ప్రకారం ఆర్థికశాఖ పూర్తి రుణమాఫీ కోసం రూ. 18,241 కోట్ల విడుదలకు గురువారం ఉత్తర్వులు (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్) జారీ చేసింది. మొదటి విడతలో భాగంగా రూ. 37 వేల నుంచి రూ. 41 వేల మధ్యన ఉన్న రైతు రుణాలను మాఫీ చేసేందుకు రూ. 237.85 కోట్లు విడుదల చేసింది. దీంతో 62,758 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతు రుణమాఫీలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. అన్నదాతలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రైతు సంక్షేమం కోసం నిరంతరం తపించే సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టారన్నారు. రైతు రుణమాఫీకి ఆదేశించిన సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రైతు బీమా దరఖాస్తులు అప్‌లోడ్ చేయండి...

రైతు బీమా పథకానికి గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే కొత్త దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని అధికారులను మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రైతులు సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులను వాడేలా మరింత ప్రోత్సహించాలన్నారు. నేల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ దిశగా రైతాంగాన్ని చైతన్యపరచాలన్నారు. పంటల సాగు వివరాలు వెంటనే తెలియజేయాలన్నారు.

83 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు..

రాష్ట్రంలో ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు 83 లక్షల ఎకరాలలో వ్యవసాయ పంటలు, 7.50 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలు సాగయ్యాయని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇటీవలి వర్షాలతో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. వరి, కంది, పంటలు ఈ నెలాఖరు వరకు, మిరప సెప్టెంబరు మొదటి వారం వరకు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. ఈ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగును అధికారులు ప్రోత్సహించాలని సూచించారు.

బీఆర్ఎస్ అంటే భారత 'రైతు' సమితి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఆయన సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ఆదాయం తగ్గినా బీజేపీ సర్కారు అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు సృష్టించినా రైతు రుణమాఫీని సంపూర్ణంగా పూర్తిచేయాలని సర్కారు కీలక నిర్ణయం తీసుకుందన్నారు. రైతు సంక్షేమంలో తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రస్థానం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రైతుకు రక్షణ కవచంగా అమలుచేసిన ప్రతి పథకం వ్యవసాయ రంగ చరిత్రపై చెరగని సంతకంగా, బీఆర్ఎస్ అంటే భారత 'రైతు' సమితిగా కేటీఆర్ అభివర్ణించారు. జై కిసాన్ కేవలం తమ నినాదం కాదని, తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. వ్యవసాయమంటే దండుగ కాదు, పండగ అంటూ తెలంగాణ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న నినాదమిదని కేటీఆర్ పేర్కొన్నారు.

మద్యం టెండర్లల్లో ఆంధ్ర లిక్కర్ లాబీని అడ్డుకోవాలి

గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

హైదరాబాద్ (సుందరయ్య విజ్ఞాన కేంద్రం): త్వరలో జరగబోయే మద్యం టెండర్లల్లో ఆంధ్రా లిక్కర్ లాబీని అడ్డుకోవాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, పోతగాని ఐలన్‌గౌడ్‌లు మాట్లాడారు. తెలంగాణలోని 17 డిస్టలరీలు, బాటిలింగ్ ప్లాంట్లు అన్ని ఆంధ్ర పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నాయని వారు వాపోయారు.

పోలవరం ప్రాజెక్టుకు వరద ఎంతొచ్చింది?

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి గోదావరి వరదల సందర్భంగా పోలవరం ప్రాజెక్టుతోపాటు ఎగువ/దిగువ కాఫర్ డ్యామ్‌ల వద్ద గత జూలై 31వ తేదీ నాటి వరకు గంటగంటకూ నమోదైన నీటిమట్టాలు, స్పిల్‌వే ద్వారా కిందికి విడుదల చేసి న నీళ్ల వివరాలను తక్షణమే తమకు అందజేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ని తెలంగాణ కోరింది. పైకి ఎత్తిన గేట్లు/స్లూయిస్‌ల వివరాలను అందజేయాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ బుధవారం పీపీఏ సీఈవోకు లేఖ రాశారు. 2022-23కి సంబంధించిన స్పిల్‌వే చానల్ రూటింగ్, గేట్ల ఆపరేషన్ వివరాలు కూడా అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో, గేట్ల ఆపరేషన్ సమాచారాన్ని తమకు అందజేయడం లేదని పేర్కొంది.

కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి వెబ్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం మొదటి విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం 6 గంటల నుండి 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. మెరిట్ జాబితాతో పాటు కాలేజీల వారిగా సీట్ల వివరాలను వెబ్‌సైట్లో చూసుకోవచ్చు.

మైనారిటీ కాలేజీల్లో సీట్లు కేవలం మైనారిటీ విద్యార్థులకే

మైనారిటీ మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటా సీట్లు కేవలం ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు మాత్రమే కేటాయిస్తారు. ముస్లిం మైనారిటీ అభ్యర్థులు ఇతర మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు కూడా అర్హులు. అభ్యర్థికి సీటు కేటాయించినా కోర్సులో చేరకపోతే, సీట్ బ్లాకింగ్‌ను నివారించడానికి తదుపరి దశల కౌన్సెలింగ్‌లు, వెబ్ ఆప్షన్‌లను ఉపయోగించుకోవడానికి అనుమతించరు.

ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఎత్తిపొడుచుకోకండి. చెడ్డపేర్లతో పిలుచుకోకండి. ఒకనిని చెడ్డపేరుతో పిలవటం ఎంతో నీచమైన విషయం.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 4 ఆగస్టు 2023

వేధిస్తున్న తప్పులు

నాలుగు నెలల్లో మూడోసారి నేరాభియోగాలను ఎదుర్కోవడం... అదీ అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా వ్యవహరించిన వ్యక్తి అంటే అసాధారణమే! అందులోనూ ఏకంగా దేశాన్నే మోసం చేశారంటూ ఆరోపణ రావడం అమెరికా చరిత్రలోనే తొలిసారి. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు అందులోనూ రికార్డు సృష్టించారు. పదవిలో ఉన్నా, లేకున్నా వింత ధోరణి, విచిత్రమైన మాటలతో వార్తల్లో నిలిచిన ట్రంప్‌ను పాత తప్పులు వెంటాడుతున్నాయి. 2020 నాటి అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయినా, ఫలితాన్ని తారుమారు చేసేందుకు శతవిధాల ప్రయత్నించారంటూ 4 అంశాల ప్రాతిపదికన 45 పేజీల్లో మంగళవారం ఆయనపై నమోదైన నేరాభియోగం అందుకు తాజా ఉదాహరణ. ఈ ఏడాది ఇప్పటికే మరో రెండు నేరాభియోగాలు మీదపడ్డ ట్రంప్ మెడకు రోజురోజుకూ చట్టం ఉచ్చు బిగిస్తోంది. మళ్ళీ అమెరికా అధ్యక్ష పోటీలో నిలవాలనుకుంటున్న ఆయన వీటి నుంచి బయటపడగలరా? మరో 15 నెలల్లో జరిగే ఎన్నికలపై వీటి ప్రభావమేంటి?

నేరాభియోగాలు ఎదుర్కోవడం ట్రంప్‌కు ఇప్పుడు నిత్యవ్యవహారమైపోయింది. 2016 ఎన్నికల ప్రచారవేళ ఓ నీలిచిత్రాల తార నోరు మూయించేందుకు భారీగా డబ్బు చెల్లించారంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో 30 అంశాల ప్రాతిపదికన మన్‌హాటన్ కోర్ట్ అభిశంసించింది. రహస్య జాతీయ భద్రతా పత్రాలను అనధికారికంగా ట్రంప్ ఉంచుకున్నారంటూ జూన్‌లో ఫ్లోరిడాలోని గ్రాండ్ జ్యూరీ 37 అంశాలతో నేరాభియోగం మోపింది. ఆ రెండు నేరాభియోగాల తర్వాత ఈ ఆగస్ట్ 1న ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ చేసిన అభియోగం ముచ్చటగా మూడోదన్న మాట. అయితే, మునుపటి రెండింటి కన్నా ఇది భిన్నమైనది, తీవ్రమైనది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ విజయం సాధించినా ట్రంప్, మరో ఆరుగురితో కలసి ఆ ఫలితాన్ని మార్చాలని చూశారన్నది తాజా అభియోగం. ఓటింగ్‌లో మోసమేమీ లేదని ట్రంప్‌కు తెలిసినా ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఆరోపణలతో కుట్ర చేశారనీ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోగొట్టేందుకు ప్రయత్నించారనీ ఆరోపణ. నిరుడు సభాసంఘం నివేదిక సైతం ఇలాంటి నిర్ణయాలకే వచ్చింది. ఎన్నికల తర్వాత 2021 జనవరి 6న అమెరికా అధ్యక్ష భవనంపై ట్రంప్ సమర్థకుల మూకదాడికీ, దానికి దారితీసిన పరిస్థితులకూ పూర్తి బాధ్యత ట్రంప్‌దేనని తేల్చేందుకు చట్టపరమైన తొలి ప్రయత్నం ఈ తాజా నేరాభియోగం.

కిందపడ్డా తనదే పైచేయి అన్నట్టుగా... 2020 ఎన్నికల్లో ఓడిపోయినా సరే అధికార పీఠంపై కొనసాగేందుకు అమెరికా లాంటి ప్రజాస్వామ్య అగ్రరాజ్యపు అధ్యక్షుడు ప్రవర్తించడం, ఎన్నికల ఫలితాలకు కుట్ర సిద్ధాంతాలు ఆపాదించడం ఎలా చూసినా సమర్థించలేనివి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ, ప్రశాంతంగా అధికార బదలాయింపు అనేవి గణతంత్ర అమెరికాకు మూలస్తంభాలు. కానీ, ఎన్నికల కౌంటింగ్ నియమాలు ఏర్పాటు చేశాక, గత 130 ఏళ్ళ పైగా అంతా ప్రశాంతంగా సాగితే, 2021లో ట్రంప్ తన చర్యలతో మూలాలకే దెబ్బకొట్టారు. ఎన్నికల్లో మోసం జరిగిందన్న తన వాదనకు మద్దతునివ్వాలంటూ అధికారులపై ఆయన ఒత్తిడి తెచ్చారు. చివరకు బైడెన్ విజయాన్ని ఖరారు చేసే శాసననిర్మాతల్ని సైతం ఆ జనవరి 6 నాటి మూకదాడితో భయపెట్టే ప్రయత్నమూ చేశారు. ఇది నేరమే కాదు... ఘోరం. అయితే, ఎన్నికల్లో మోసం జరిగిందని తాను చేస్తున్న వాదన బోగస్సని తెలిసినాసరే, ట్రంప్ కావాలనే అలా అడ్డంగా వాదించారని ప్రాసిక్యూటర్లు నిరూపించగలరా అన్నది ప్రశ్న. అలా నిరూపించడం మీదే చర్యలు ఆధారపడి ఉంటాయి. ట్రంప్ మాత్రం ఈ అభియోగాలన్నీ తనపై రాజకీయ వేధింపుల్లో భాగమని ఆరోపిస్తున్నారు.

వచ్చే 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగాలని 77 ఏళ్ళ ట్రంప్ ఉవ్విళ్ళూరుతున్నారు. చిత్రంగా మునుపు మీద పడ్డ రెండు నేరాభియోగాల వల్ల ఆయన ఎన్నికల రేటింగ్ తగ్గకపోగా విపరీతంగా పెరిగింది. కోర్టు వ్యవహారాల వల్ల ట్రంప్ ఆర్థిక వనరులు తరిగిపోవచ్చు. కోర్ట్ విచారణ మాటెలా ఉన్నా తాజా అభియోగాన్ని సైతం ట్రంప్ తన రాజకీయ లాభానికి వాడుకోవడం ఖాయం. కక్ష సాధిస్తున్నారనీ, అసలైన బాధితుణ్ణి తానే అనీ ఆయన తన ప్రచారంలో వేడి పెంచగలరు. అసలు నిజం, సాక్ష్యాధారాలేమైనా, గణనీయ సంఖ్యలో అమెరికన్ ఓటర్లు ట్రంప్ వాదననే సమర్థించవచ్చు. వెరసి అమెరికా చరిత్రలో మునుపెన్నడూ లేనట్టు ఓటర్లు పూర్తిగా రెండు వర్గాలుగా చీలిపోయే పరిస్థితుల్లో రానున్న ఎన్నికలు జరిగే ప్రమాదం కనిపిస్తోంది.

ట్రంప్ తన రాజకీయ చాణక్యంతో కోర్టులో ఉచ్చు నుంచి జారుకొనే ప్రయత్నం చేస్తారు. వకీళ్ళ ద్వారా వ్యవహారాన్ని వీలైనంత జాప్యం చేసి, రేపు మళ్ళీ శ్వేతసౌధ పీఠమెక్కితే అక్కడ నుంచి ఇక అంతా తన కనుసన్నల్లో జరపాలన్నది ఆయన పేరాశ. నిజానికి, శృంగార తార కేసు వచ్చే మార్చిలో, రహస్య పత్రాల కేసు వచ్చే మేలో కానీ తేలవు. వచ్చే జనవరిలో ఎంపిక ప్రక్రియ ప్రారంభించే రిపబ్లికన్ పార్టీ ఆ లోగా తమ అభ్యర్థి ఎవరో ఖరారు కూడా చేసేస్తుంది. ఈ పరిస్థితుల్లో సత్వరమే ఈ అభియోగాలపై విచారణ జరిపి, తప్పొప్పులు తేల్చడమే అమెరికన్ కోర్టుల కర్తవ్యం. ట్రంప్ తప్పు లేదని తేలితే చేసేది లేదు. ఒకవేళ తప్పు చేసినట్టు ఆయనపై నేరాభియోగాలు రుజువైతే తగిన శిక్ష విధించి, చట్టం ముందు ఎంతటి వారైనా ఒకటేనని చూపవచ్చు. అమెరికా ప్రజాస్వామ్య స్ఫూర్తిని లోకానికి చాటవచ్చు. దేశ రాజ్యాంగ వ్యవస్థనే అవహేళన చేసిన ఘటనలో రాజకీయాల రొచ్చులోకి పోకుండా కోర్టులు అప్రమత్తతతో వ్యవహరించడమే ప్రజాస్వామ్య విలువలకు శ్రీరామరక్ష. ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తోంది అందుకే!

ఒపెన్‌హైమర్‌తో మన అనుబంధం

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు జారవిడిచి 78 ఏళ్లు అవుతోంది. ఆధునిక యుగంలో ఇంతటి విధ్వంసకరమైన ఘటన మరోటి చోటుచేసుకోలేదంటే అతిశయోక్తి కాదు. రెండో ప్రపంచయుద్ధం నాటి ఈ ఘటనపై లెక్కలేనన్ని పుస్తకాలు, డాక్యుమెంటరీలు, సినిమాలు వచ్చాయి. తాజాగా ప్రదర్శితమవుతున్న 'ఒపెన్‌హైమర్' చిత్రం కూడా ఈ కోవకు చెందినదే. మన్‌హాటన్ ప్రాజెక్టులో భాగంగా తయారైన అణుబాంబులు, వాటి సృష్టికర్త జె.రాబర్ట్ ఒపెన్‌హైమర్ ఇతివృత్తంతో సాగుతుంది ఈ సినిమా. ఒపెన్‌హైమర్‌కు ఉన్న భగవద్గీత, సంస్కృత జ్ఞానం ఆయనపై భారతదేశంలో ఆసక్తి పెరిగేందుకు కారణమయ్యాయి. భారతదేశ ఆధ్యాత్మికత పట్ల ఆరాధన కంటే కూడా ఈ దేశంతో ఆయనకున్న సంబంధం మరింత లోతైనది.


జర్మనీలో పుట్టి అమెరికాలో సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్తగా ఎదిగిన ఒపెన్‌హైమర్‌ను అణుబాంబు పితామహుడని కూడా అంటారు. ఒపెన్‌హైమర్‌కు ఉన్న భగవద్గీత, సంస్కృత జ్ఞానం ఆయనపై భారతదేశంలో ఆసక్తి పెరిగేందుకు కారణమయ్యాయి. భారతదేశ ఆధ్యాత్మికత పట్ల ఆయనకు ఉందని చెబుతున్న ఆరాధన కంటే కూడా ఈ దేశంతో ఆయనకున్న సంబంధం మరింత లోతైనది. దీన్ని 20వ శతాబ్దంలో ఆధునిక భౌతిక శాస్త్రం అభివృద్ధి నేపథ్యంలో చూడాలి.

విశ్వం మొత్తానికి ఆధారమైన, మౌలికమైన కణాలపై అధ్యయనం సాగిన కాలం అది. అణు కేంద్రకం దాంట్లోని భాగాలను అర్థం చేసుకునే అణు భౌతికశాస్త్ర అభివృద్ధి కూడా ఈ కాలంలోనే వేగం పుంజుకుంది. అణుశక్తితోపాటు అణుబాంబుల తయారీకి దారితీసిన పరిశోధనలివి. ఈ కాలపు భారతీయ శాస్త్రవేత్తలు కూడా చాలామంది ఈ అణు భౌతిక శాస్త్ర రంగంలో కృషి చేశారు. దేబేంద్ర మోహన్ బోస్ (ఇతడి విద్యార్థిని బిభా చౌధురి), మేఘనాథ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్, హోమీ జహంగీర్‌భాభా, దౌలత్‌సింగ్ కొఠారీ, పియారా సింగ్ గిల్ వంటి మహామహులు వారిలో కొందరు మాత్రమే. వీరు ఆధునిక భౌతికశాస్త్రంలో పేరెన్నికగన్న వూల్ఫ్‌గాంగ్ పౌలీ, నీల్స్ బోర్, లార్డ్ రూథర్‌ఫర్డ్, పాల్ డైరాక్, ఎన్రికో ఫెర్మీ, ఎర్విన్ ష్రోడింగర్, జేమ్స్ చాద్విక్, జాన్ కాక్‌క్రాఫ్ట్, హిడెకీ యుకవాలతో కలిసి పని చేయడం లేదా వారితో సంబంధబాంధవ్యాలను కలిగి ఉండటం కద్దు.

భాభాతో సంబంధం

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఖగోళ వికిరణాలపై పరిశోధనలు చేస్తున్న సమయంలోనే హోమీ భాభాకు ఒపెన్‌హైమర్ (కేంబ్రిడ్జ్‌లో సీనియర్. తరువాతి కాలంలో బెర్క్‌లీలో పనిచేశారు) గురించి ఒక అవగాహన ఉండింది. 1936లో భాభా, వాల్టర్ హైట్లర్ ఉమ్మడిగా ఖగోళ వికిరణ జల్లు (కాస్మిక్ రే షవర్స్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించగా, ఒపెన్‌హైమర్ ఓ ఏడాది తరువాత దాదాపుగా అలాంటిదే స్వతంత్రంగా ప్రతిపాదించారు. అప్పట్లో భాభాకు పాశ్చాత్యదేశాల్లోని గొప్ప భౌతిక శాస్త్రవేత్తలతో సంబంధాలు ఉండేవి. ఒకానొక దశలో 1940లో తనను ఒపెన్‌హైమర్‌కు పరిచయం చేయాల్సిందిగా భాభా తన మిత్రుడు పౌలీని కోరారు. ఇద్దరూ కలిసి బెర్క్‌లీలో పరిశోధనలు చేయాలన్నది ఉద్దేశం. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో భాభా భారత్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. భౌతికశాస్త్ర మౌలికాంశాలపై పరిశోధనలు చేసేందుకు ఓ సంస్థను స్థాపించే అవకాశమూ అప్పుడే లభించింది. తరువాతి కాలంలో భాభాకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి భారతీయ అణుశక్తి కార్యక్రమాన్ని సిద్ధం చేసి అమలు చేసే అవకాశమూ దక్కింది.

అణు రియాక్టర్ నిర్మాణానికి, యురేనియం శుద్ధికి అవసరమైన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని భాభా తనకు పాశ్చాత్య దేశాల్లో ఉన్న సంబంధాల ద్వారానే సంపాదించగలిగారు. ప్రిన్స్‌టన్, కావెండిష్ వంటి ప్రసిద్ధ సంస్థల తరహాలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) స్థాపనకూ బాబా అంతర్జాతీయ సహకారం అందేలా రూఢి చేసుకున్నారు. అయితే 1945లో హిరోషిమా, నాగసాకి లపై అణుబాంబులు పడిన తరువాత రాబర్ట్ ఒపెన్‌హైమర్ వివాదాస్పద వ్యక్తి అయ్యారు. అయినా టీఐఎఫ్ఆర్‌లో పరిశోధకుల బృందాన్ని తయారు చేసే విషయంలో భాభా ఆయన సాయం తీసుకున్నారు. ఒపెన్‌హైమర్ విద్యార్థి, ఆయనతో కలిసి మన్‌హాటన్ ప్రాజెక్టులో పనిచేసిన బెర్నార్డ్ పీటర్స్‌కు ఉద్యోగమిచ్చారు. అప్పట్లో ప్రిన్స్‌టన్‌లో పనిచేస్తున్న ఒపెన్‌హైమర్ సోదరుడు ఫ్రాంక్ ఒపెన్‌హైమర్‌కూ ఉద్యోగం ఆఫర్ చేశారు భాభా. రాబర్ట్‌ను సంప్రదించిన తరువాతే ఫ్రాంక్‌కు ఉద్యోగం ఇవ్వజూపినట్లు చరిత్రకారులు చెబుతారు. ఈ అణుశక్తి కార్యక్రమ ఏర్పాటుకు ఫ్రెంచ్ నోబెల్ గ్రహీత ఫ్రెడెరిక్ జోలియెట్ క్యూరీ సలహాలు కూడా నెహ్రూ స్వీకరించారు.



రాబర్ట్ ఒపెన్‌హైమర్

పరోక్ష ప్రేరణ

ఒపెన్‌హైమర్‌పై విమర్శలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో భాభా చేసిన కొన్ని నియామకాలపై నిరసన వ్యక్తమైంది. ఒపెన్‌హైమర్‌కు కమ్యూనిస్టులతో ఉన్న గత సంబంధాలపై కూడా వివాదాలు తలెత్తాయి. ఒపెన్‌హైమర్ కూడా తన మాజీ విద్యార్థి పీటర్స్‌ను కమ్యూనిస్టు సానుభూతిపరుడిగా అభివర్ణించారు. దీంతో పీటర్స్ భారత్‌కు రావడం కష్టమైంది. ఎలాగోలా వచ్చిన తరువాత టీఐఎఫ్ ఆర్‌లో అతడిపై ఇంకోసారి దుమారం రేకెత్తింది. ఇంకోవైపు ఫ్రాంక్ ఒపెన్‌హైమర్ కూడా అమెరికా ప్రభుత్వం పాస్‌పోర్టు ఇచ్చేందుకు నిరాకరించడంతో భారత్‌కు రాలేకపోయారు. అయితే అమెరికాలో రాబర్ట్ ఒపెన్‌హైమర్ మాత్రం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (ఐఏఎస్) డైరెక్టర్‌గా కొనసాగుతూ భారతీయ శాస్త్రవేత్తలు చాలామందికి మార్గదర్శకుడిగా వ్యవహరించారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో యువ భౌతిక శాస్త్రవేత్తగా ఉన్న అల్లాడి రామకృష్ణన్‌కు ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ఏడాది స్కాలర్‌షిప్ మంజూరు చేయడం మచ్చుకు ఒక ఉదాహరణ మాత్రమే. అల్లాడి భారత్‌కు తిరిగి వచ్చాక ఐఏఎస్ లాంటి సంస్థను స్థాపించాలని ఆశించారు. ఈ ఆలోచనే తరువాతి కాలంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్‌గా 1962లో మద్రాస్‌లో ఆవిష్కృతమైంది.

భారత్‌కు తరచూ...

ఆ కాలంలో స్వల్పకాలిక పర్యటనపై భారత్‌కు విచ్చేసే విదేశీ శాస్త్రవేత్తల్లో ఒపెన్‌హైమర్ పేరు తరచూ వినిపించేది. పీసీ మహలనోబిస్ ఆలోచనల రూపమైన 'షార్ట్ విజిట్స్ ఆఫ్ సైంటిస్ట్ ఫ్రమ్ అబ్రాడ్'లో భాగంగా ఒపెన్‌హైమర్‌తో పాటు నీల్స్ బోర్, నార్బెర్ట్ వీనర్, పీఎంఎస్ బ్లాకెట్, జోసెఫ్ నీధమ్, జేబీఎస్ హాల్డేన్ లాంటి మహామహులు భారత్‌కు వచ్చిపోయేవారు. వీరికి పంపే ఆహ్వాన పత్రికలపై నెహ్రూ స్వయంగా సంతకాలు చేసేవారు. ఇందులో చాలామంది నెహ్రూకు తెలుసు.

1945 అనంతర ఒపెన్‌హైమర్ నైతిక దృక్కోణాన్ని నెహ్రూ బహిరంగంగా ప్రశంసించారు. 1959లో భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడుతూ, ఒపెన్‌హైమర్ భగవద్గీత నుంచి స్ఫూర్తి పొందారని ఉల్లేఖించారు. పరిశోధనలు, ఆవిష్కరణలకు కూడా సామాజిక విపరిణామాలు ఉంటాయన్న విషయాన్ని పెద్ద శాస్త్రవేత్తలు గుర్తించేందుకు ఇది ఉపయోగపడాలన్నారు.

హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు ప్రయోగంతో రెండో ప్రపంచ యుద్ధం నాటకీయంగా ముగిసింది. ఈ ఘటన అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య అణ్వాయుధ పోటీకి దారితీసింది. అదే సమయంలో అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నాలూ మొదలయ్యాయి. వలసవాద శకం ముగిసిన తరువాత అణుశక్తిని శాంతియుత, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకోవడమన్న అంశం భారత్ లాంటి దేశాలకు ప్రధాన పరిశోధన ఇతివృత్తమైంది. ఈ నవతరం సైన్స్‌ను అభివృద్ధి చేయడం భారత్‌కు ప్రథమ కర్తవ్యమైంది. అణుశక్తిని విద్యుదుత్పత్తికి ఉపయోగించుకుంటామని భారత్ పలుమార్లు స్పష్టం చేసింది. అయితే 1964లో చైనా అణుబాంబును పరీక్షించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పదేళ్ల తరువాత భారత్ కూడా పోఖ్రాన్-1తో అణ్వస్త్ర దేశాల జాబితాలో చేరిపోయింది. కానీ భగవద్గీతకు నెలవైన భారత్ అణు మార్గం పట్టడాన్ని ఒపెన్‌హైమర్ మాత్రం చూడలేకపోయారు!

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భయం... భయం



ఒక్కోసారి మా నాన్న చనిపోయారన్న విషయం నాకు శాంతిని కలిగిస్తుంది. ఎందుకంటే నేను ఆందోళన చెందాల్సిన మనుషుల్లో ఒకరు తగ్గిపోయినట్టు. ఆయన కుర్తా ధరించేవారు, గడ్డం ఉంచుకునేవారు, ముస్లిం అని ఇట్టే గుర్తుపట్టొచ్చు. చుట్టుపక్కల మత ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ ఇంట్లోంచి కదలొద్దని చెప్పేదాన్ని, లోలోతుల్లో భయం వేసేది.

– శాజియా ఇమామ్, పీహెచ్‌డీ విద్యార్థిని

కపట దాటవేత



గణపతి ఒక మిథ్య అని సీపీఐ (ఎం) కేరళ కార్యదర్శి (ఎం.వి. గోవిందన్) పునరుద్ఘాటించారు. మరి అల్లా సంగతి ఏమని అడిగితే, ప్రతి విశ్వాసం కల్పన కానక్కర్లేదనీ, ఇస్లామీయుల ఏకేశ్వరోపాసన భిన్న తలానికి చెందినదనీ అన్నారు.

– శ్రీజిత్ పణిక్కర్, రైట్‌వింగ్ యాక్టివిస్ట్

దొందూ దొందే!



భిన్నాభిప్రాయాలు తెలుసుకోవడానికి నేను లెఫ్ట్‌వింగ్, రైట్‌వింగ్ ఇరుపక్ష వ్యాఖ్యాతల ట్విట్టర్ ఖాతాలు ఫాలో అవుతాను. ఎవరి గ్రూపులు వాళ్లకున్నాయి. నేను గమనించినది ఏమంటే, మేవాత్ హింస గురించి లెఫ్ట్‌వింగ్ నిజాయతీగా మాట్లాడదు, హంతకుడు చేతన్ సింగ్ గురించి రైట్‌వింగ్ నిజాయతీగా మాట్లాడదు.

– హార్దిక్ రాజ్‌గోర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సినిమా కుటుంబం



హీరో తల్లి పాత్ర చేస్తారా అని క్యాస్టింగ్ ఏజెంట్ ఫోన్ చేశాడు. చేస్తానన్నాను. కానీ హీరో వయసెంత అని అడిగాను. 35 అన్నాడు. అంటే నేను బాల్య వివాహం చేసుకుని, దైవమాయ వల్ల వయసు రాకముందే తల్లినై ఉండాలి. అంటే నా తల్లిదండ్రులు, అత్తామామలు, నా భర్త (ఒకవేళ చిన్నారి భర్త అయితే ఇదింకో దైవమాయ) బెయిల్ లేని బహువిధ మహాపరాధాలకు పాల్పడి ఉండాలి. సారీ! నేను ఆ నేరమయ కుటుంబంలో భాగం కాలేనని చెప్పాను.


– తారా దేశ్‌పాండే, నటి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

సాహితీ ఝరి చిన్నయసూరి

తెలుగు భాషాభ్యుదయానికి విశేషంగా కృషిచేసిన సాహితీ ప్రముఖుల్లో దిట్ట పరవస్తు చిన్నయసూరి. 1806లో శ్రీపెరంబదూర్ పట్టణంలో జన్మించారు. తమిళనాట పుట్టినా తెలుగువారి నోట గద్యాన్ని గడగడ పలికించిన ఘనత ఆయనది. 'పద్యానికి నన్నయ ఎలాగో.. గద్యానికి చిన్నయ అలా' అనే రీతిన తెలుగు సాహిత్యంలో కీర్తి బావుటా ఎగురవేశారు. సంస్కృతంలోనూ ఘనాపాఠిగా రాటుదేలి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా విశిష్ట సేవలందించారు.



తెలుగు భాషను కాచి వడపోసి సరళమైన శైలిలో అందరికీ అర్థమయ్యేలా 'బాల వ్యాకరణం' గ్రంథాన్ని రాశారు. 'పంచతంత్ర' కథల్లో పేరొందిన 'మిత్ర లాభం', 'మిత్రభేదం'... రెండింటినీ సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించి వినూత్నంగా 'నీతిచంద్రిక'ను అందించారు.

ఇవి కాక 'సూత్రాంధ్ర వ్యాకరణం', 'నీతి సంగ్రహం', 'ఆంధ్ర ధాతుమాల' వంటి రచనలు ప్రముఖ మైనవి. తెలుగు భాషపై ఎక్కువ మక్కువతో సాహితీ సేద్యం గావించిన చిన్నయసూరి 1862లో కాలం చేశారు. ఆ మహనీయుడి సేవలకు నివాళిగా 'చిన్నయసూరి సాహితీ పీఠం', 'ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం' సంయుక్తంగా విజయవాడలోని తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం (ఆగస్టు 4) సూరివారి విగ్రహాన్ని ఆవిష్కరిస్తుండడం తెలుగు సాహిత్యాభిమానులందరికీ ఆనందదాయకం.

– చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్

అందరూ ఒక్కటై వారికి అండగా నిలవాలి!

మూడు నెలలుగా నెత్తుటి క్రీడల్లో చిక్కుకుని అగ్నికీలల్లో దహనం అవుతున్న మణిపూర్ రాష్ట్రంలో 2023 మే 4న సంభవించిందని చెబుతున్న మహిళల నగ్న ఊరేగింపు దేశంలో ఒక్కసారిగా పెను సంచలనం రేపింది. ఈ దుర్మార్గంపై దేశంలో ఎల్లెడల వ్యక్తమైన నిరసనల మధ్యనే సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చెక్కర్లు కొడు తున్నది. అది ఈ సంఘటనను ఖండించే వాళ్లను దేశద్రోహులుగా చిత్రించింది. భద్రతా బలగాలను స్వేచ్ఛగా పనిచేయనివ్వడం లేదని ఆరోపించింది. విదేశీ చొరబాట్లను ప్రోత్సహిస్తున్నారని నిందించింది. దేశంలో ఎక్కడైతే హిందువుల సంఖ్య తగ్గిపోతుందో ఆ ప్రాంతం మన దేశం నుండి విడిపోతుందని ఆరోపించింది. దేశమంతా మణిపూర్ హింసాకాండ 'డబుల్ ఇంజన్ సర్కార్లు' చేస్తున్న దుశ్చర్యగా ఆగ్రహిస్తున్న వేళ ఐదు వ్యాఖ్యల నిడివి గల ఈ చిన్న సందేశం మూడో ఇంజన్‌గా పనిచేస్తూ విధ్వంసకాండలో మునిగి తేలుతున్న సంఘ్ పరివార్ మనో గతాన్ని వెల్లడించింది.

మణిపూర్‌లో మతం, తెగల పేరిట మైతేయులు, కుకీల మధ్య విభజన తీసుకు రావడానికి కుట్ర జరుగుతుందని పిస్తుంది. ఒకరి మెజారిటీ ప్రాంతాల్లో మరొకరు ఉండలేనంతగా, ముఖ్యంగా ఇంఫాల్ లోయలో మైతేయేతరులు జీవించలేనంతగా విభజన రేఖ గీస్తోంది. ఇది భద్రతా బలగాల దాకా విస్తరించింది. అందుకే నగ్నదేహాలతో ఊరేగించిన మహిళలను పోలీసులే అల్లరి మూకలకు అప్పగించడాన్ని అడ్డుకోబోయిన సోదరుణ్ణీ, తండ్రినీ చంపేయడాన్ని యాదృచ్ఛిక చర్య అనుకోలేము. కేవలం జాతి, తెగ వైరుధ్యాల అంశంగా కొట్టేయలేము. తెగలు జాతులకు అతీతంగా హిందూ మతాన్ని అధికంగా అనుసరించే మైతేయుల్లో క్రైస్తవం ప్రబలడాన్ని అడ్డుకోవడానికి వారిలో భౌగోళికంగా తక్కువ ప్రాంతం, జనాభాపరంగా అధిక జనాభా అనే అంశాలను రెచ్చగొట్టి ఎస్టీ హోదా పేరిట వారిని ఐక్యం చేయడానికి ప్రయత్నించాయి సంఘ్ శక్తులు. కుకీ, నాగా, జోమీ తదితర 29 తెగలుగా, జాతులుగా నివసిస్తున్న ప్రజల మధ్యకు 'వనవాసి కళ్యాణ సమితి' పేర సంఘ్ పరివార్ ప్రవేశించి వారిని హైందవీకరించే ప్రయత్నం చేసింది.

అలాగే చురచంద్‌పూర్ తదితర జిల్లాల్లో చట్ట విరుద్ధ నివాసాలంటూ నవంబర్ 2022 లోనే 38 గ్రామాలకు నోటీసులు ఇచ్చి 38 వేల మందిని నిర్వాసితులుగా చేయడానికి సంకల్పించింది. ఇందులో కొన్ని గ్రామాలను ఖాళీ చేయించారు. 2023 ఏప్రిల్ 11న, 26 ఇళ్లను ఏకపక్షంగా కూల్చివేశారు. దీన్ని 'కుకీ ఇంగ్ మణిపూర్ '(కేఐఎమ్) అపెక్స్ బాడీ నిరసించినా పట్టించుకోలేదు. 2023 మార్చి 11 నాటికే కుకీ నేషనల్ ఆర్మీ (కేఎన్ఏ), జోమీ నేషనల్ ఆర్మీ (జడ్ఎన్ఏ) తదితర సాయుధ సంస్థలతో జరిపే త్రైపాక్షిక శాంతి చర్చలను ప్రభుత్వం నిలిపివేసింది. సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్ఓఓ) రద్దుపరిచి, కూంబింగ్ ఆపరేషన్లు మొదలుపెట్టింది. సరిగ్గా ఇదే సమయంలో ఇంఫాల్ హైకోర్టు ఇంచార్జ్ చీఫ్ జస్టిస్‌గా ఉన్న జస్టిస్ మురళీధరన్ ఆర్టికల్స్ 14, 21ల కింద మైతేయులకు ఎస్టీ హోదా సమంజసమేనని తెలుపుతూ దాన్ని కేంద్రానికి పంపి నాలుగు నెలల్లో పార్లమెంటు ఆమోదం పొందేలా చూడాలని రాష్ట్రానికి సూచించింది. 1927లో బ్రిటిష్ కాలంలో రూపొందిన ఫారెస్ట్ చట్టం అటవీ-పర్యావరణ



శాఖను రాష్ట్ర పరిధిలో ఉంచి మైతేయులను ఖుమన్, లువాంగ్, మెయిరంగ్, మైయితీ తెగలుగా గుర్తించి 1947 వరకు వారికి ఎస్టీ హోదా కల్పించింది. మణిపూర్ మహారాజు 1949 సెప్టెంబర్ రెండున భారత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం 1949 అక్టోబర్ 15న మణిపూర్ భారత్‌లో విలీనమైంది. 1956లో కేంద్ర భూభాగాల చట్టం అమల్లోకి వచ్చి ఇంఫాల్ రాజధానిగా మణిపూర్ కేంద్రపాలిత ప్రాంతం అయింది. షెడ్యూల్ ఏరియా కొండ ప్రాంతాల చట్టంలో ఆర్టికల్ 371–సీ ప్రకారం మణిపూర్ కొండ ప్రాంతాలకు తగు రాజ్యాంగ రక్షణలు కల్పించబడ్డాయి. 1975లో సిక్కిం భారత్‌లో విలీనమైన తర్వాత 1976లో ఫారెస్ట్ చట్టానికి సవరణలు తెచ్చి దీనిని కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో చేర్చింది. ఇక మైతేయులు సుమారు రెండు వేల సంవత్సరాలుగా సారవంతమైన ఇంఫాల్ లోయలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కొనసాగిస్తున్న అంశం ఆధారంగా 1992లో మండల్ కమిషన్ వారికి ఓబీసీ హోదానిచ్చింది.

అందుకే హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మణిపూర్ ఆదివాసీ సంఘాలన్నీ కలిసి 'ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం' (ఐటీఎల్ఎఫ్), 'ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ ఆఫ్ మణిపూర్ '(ఏటీఎస్ఎమ్)గా ఏర్పడి 2023 మే 5న ప్రదర్శనలు చేపట్టాయి. రాష్ట్ర వ్యాప్త నిరసనకు పిలుపునిచ్చాయి. సరిగ్గా ఇదే సమయంలో కుకీల చేతుల్లో ఒక మైతేయి మహిళ అత్యాచారానికి గురైందని ఒక ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో ప్రచారంలో పెట్టి ఒక మతం ప్రార్థనామందిరాలను కూల్చారు. కుకీ జాతి తెగలకు, మైతేయులకు మధ్య విభజన తీసుకువచ్చి క్రైస్తవ మైతేయుల 'ఘర్ వాపసీ' కార్యక్రమాన్ని నిర్వహించడానికి గాను అభద్రతను, విభజనను ఆర్గనైజ్ చేయడమే ఈ ఘర్షణల లక్ష్యంగా కనపడుతోంది. అడవులపై, వనరులపై మొత్తంగా ఈశాన్య రాష్ట్రాలపై ఆదివాసుల అధికారాలన్నీ దెబ్బతీసి వాటిని పెట్టుబడిదారుల స్వేచ్ఛా మార్కెట్లకు కట్టబెట్టాలన్న అసలు లక్ష్యం దీని వెనుక ఉండవచ్చు. వాస్తవంలో మణిపూర్ రాష్ట్రం తగలబడి పోతుంటే సాక్షాత్తు ప్రధానమంత్రి, యూనియన్ హోం శాఖ మంత్రి ఇరువురు కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కల్పితమైన 'కేరళ స్టోరీ' సినిమా హింస గురించి ప్రచారం చేశారు. తీరా మహిళల నగ్న ఊరేగింపు ఉదంతం వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా సూటిగా మణిపూర్ సమస్యను పరిష్కరిస్తామనీ, శాంతియుతంగా ఉండాలనీ దేశ ప్రజలకు విశ్వాసం ఇవ్వకుండా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ తర్వాత మణిపూర్ ప్రస్తావన చేయడం కాకతాళీయం కాదు.

అయితే దీని వెనుక దురుద్దేశాలను ఓడించినప్పుడే మణిపూర్‌లో నిజమైన శాంతి నెలకొంటుంది. సరికొత్త అటవీ చట్టానికి పార్లమెంట్ సిద్ధమవుతూ 'ఆదివాసి' అర్థాన్నే మార్చజూస్తున్న వేళ... ఈశాన్య రాష్ట్రాల ప్రజలను అప్రమత్తం చేయాలి. కలుపు కోదగ్గ శక్తులను కలుపుకొని దీన్ని ఓడించే పోరాటానికి తక్షణం సన్నద్ధమవుదాం. మణిపూర్ ప్రజలకు దేశమంతా అండగా నిలబడాల్సిన సమయమిదే.

– అమర్

ఖాళీ చేసుకోవాలి!

1. కప్పు టీ

జపాన్ దేశంలో యూనివర్సిటీ ప్రొఫెసరొకాయన జెన్ గురించి తెలుసుకోవటానికి వాన్-ఇన్ అనే ప్రసిద్ధ జెన్ గురువు దగ్గరకు వచ్చాడు. వచ్చిన ప్రొఫెసర్‌కు గురువుగారు మర్యాదపూర్వకంగా టీ కలిపి కప్పులో పోసి ఇచ్చాడు. కప్పు నిండినాక కూడా పోస్తూనే ఉన్నాడు. ఆపకుండా అలా పోస్తూనే ఉన్నాడు.

కప్పులో టీ పొర్లి పోతుండటం గమనిస్తూ ఉన్న ప్రొఫెసర్ ఉండబట్టలేక అన్నాడు, 'కప్పు నిండి పొర్లి పోతోంది. కప్పు లోపలికి టీ కొంచెం కూడా పోదు.'

జ్యోతిర్మయం

గురువు గారు అన్నాడు... 'ఈ కప్పు లానే, నీవూ నీ సొంత అభిప్రాయాలతో, నమ్మకాలతో నిండిపోయి ఉన్నావు. ముందు నీ కప్పు నీవు ఖాళీ చెయ్యందే, నేనెట్లా నీకు జెన్ గురించి చెప్పగలను?'

2. శిష్యుడుగా మారిన దొంగ

ఓ సాయంత్రం వేళ షిచిరికోజున్ అనే జెన్ గురువు 'సుత్త' పిటకంలోని కొన్ని సూత్రాలను వల్లె వేసుకొంటుండగా, ఓ దొంగ ఇంట్లో దూరి... 'డబ్బు ఇస్తావా, ప్రాణం ఇస్తావా' అని కత్తి చూపి బెదిరించాడు.

షిచిరి అతడితో 'నన్ను చిరాకు పెట్టకు. ఆ బల్ల సొరుగులో డబ్బు ఉంటుంది చూడు' అని సూత్ర పఠనంలో నిమగ్నుడయ్యాడు. కొద్దిసేపు అయ్యాక సూత్ర పఠనం ఆపి, దొంగతో అన్నాడు 'అంతా పట్టుకెళ్ళకు, రేపొద్దునే పన్ను చెల్లించటానికి కొంత నాకు అవసరం.'

దొంగ దొరికినంత ఎక్కువ మొత్తం మూటగట్టుకొని బయల్దేరబోతుండగా షిచిరి అతడితో అన్నాడు... 'బహుమానం స్వీకరించినపుడు, దాతకు కృతజ్ఞతలు చెప్పటం విధాయకం.' దొంగ అలాగే అతడికి కృతజ్ఞతలు చెప్పి బయట పడ్డాడు. కొన్నాళ్ళకు దొంగ రక్షక భటులకు పట్టుబడ్డాడు. షిచిరి ఇంట్లో చేసిన దాంతో సహా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. సాక్షిగా షిచిరిని పిలిచినపుడు, 'కనీసం నాకు సంబంధించినంతవరకు ఇతడు దొంగ కాదు. అతడికి నేనే డబ్బు ఇచ్చాను. అందుకు నాకు కృతజ్ఞతలు కూడా చెప్పాడు.' కారాగారశిక్ష అనుభవించిన తరువాత దొంగ, షిచిరిని కలుసుకొని అతడికి శిష్యుడయ్యాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.తదియ సా.5.32 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శతభిషం ప.12.14 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.42 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.29.

బురదరోడ్లు.. ఆపై వైద్యులు లేరు..

- జ్వరంతో బాధపడుతూ మూడేళ్ల బాలుడు మృతి
- బైక్‌పై మృతదేహం తరలింపు


బైక్‌పై మృతదేహాన్ని తీసుకెళ్తున్న తండ్రి

బజార్‌హత్నూర్: వర్షానికి పాడైన రోడ్లు.. సమయానికి అందుబాటులో లేని డాక్టర్లు .. వెరసి ఓ బాలుడి నిండు జీవితం బలైంది. బురద రోడ్డుపై మోటార్‌సైకిల్‌పై ఆ స్పత్రికి చేరడం ఆలస్యం కావడం.. సమ యానికి వైద్యులూ అందుబాటులో లేక ఆ బాలుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం డేడ్ర గ్రామానికి చెందిన గిరిజన దంపతులు పంద్ర లక్ష్మణ్, జమునల కుమారుడు పరుశురాం(3) బుధవారం రాత్రి నుంచి తీవ్ర జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడ్డాడు. గ్రామం నుంచి పీహెచ్‌సీకి 16కిలో మీటర్ల దూరం ఉండగా.. వర్షాలకు అధికభాగం రోడ్డు బురదమయమైంది. అదే రోడ్డుపై గురువారం ఉదయం 6 గంటలకు బయలుదేరి మోటార్‌సైకిల్‌పై పీహెచ్‌సీకి బాలుడిని తీసుకువచ్చారు. అయితే ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేరని, కింది స్థాయి సిబ్బంది పట్టించుకోలేదని, రిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారని లక్ష్మణ్ తెలిపాడు. కొద్దిసేపటికే బాబు మృతిచెందాడని, వైద్యులు అందుబాటులో ఉంటే తన కుమారుడు బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దంపతులిద్దరూ మోటార్‌సైకిల్‌పైనే మృతదేహంతో గ్రామానికి చేరుకున్నారు.

చనిపోయిన తర్వాతే తీసుకొచ్చారంటూ మెడికల్ ఆఫీసర్ వితండవాదన

కాగా, ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ భీంరావ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. బాలుడు మృతిచెందిన తర్వాతే ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులే లేరు కదా మృతిచెందినట్లు ఎవరు నిర్ధారించారని అడగ్గా.. సమాధానం చెప్పలేదు.

ఎఫ్‌ఆర్‌ఓ హత్యకేసులో ఇద్దరికి జీవితఖైదు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు తీర్పు
- ఏడు నెలల్లోపే విచారణ పూర్తి చేసి శిక్ష విధింపు


శ్రీనివాసరావు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంచలనం సృష్టించిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఓ) శ్రీనివాసరావు హత్య కేసులో నిందితులు మడకం తుల, పొడియం నాగకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. జీవితఖైదుతో పాటు రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఏడు నెలల్లోపే ఈ విచారణ పూర్తి చేసి శిక్ష విధించడం గమనార్హం.

ఏం జరిగిందంటే...

జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండాలపాడు పంచాయతీ పరిధి ఎర్రబోడులో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలు అటవీ భూముల్లో పోడు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఆ భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని ప్లాంటేషన్ చేశారు. ఈ క్రమంలో గతేడాది నవంబర్ 22న గొత్తికోయలు ఆ భూముల్లో పశువులు మేపుతుండగా ప్లాంటేషన్ వాచర్ భూక్యా రాములు, బేస్ వాచర్ ప్రసాద్ అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని వారు ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు దృష్టికి తేగా ఆయన రావికంపాడు సెక్షన్ అధికారి తేజావత్ రామారావుతో అక్కడికి వెళ్లారు. ఈ భూముల్లో పశువులు మేపొద్దని చెబుతూ.. వీడియో తీస్తుండగా గొత్తికోయలు మళ్లీ గొడవ పడ్డారు. ఈ క్రమంలో మడకం తుల, పొడియం నాగ వేట కొడవళ్లతో ఎఫ్‌ఆర్‌ఓ మెడపై నరికారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును ఖమ్మం తరలిస్తుండగానే మృతిచెందారు. ఈ ఘటనపై నాటి చంద్రుగొండ ఎస్‌ఐ విజయలక్ష్మి, సీఐ వసంత్‌కుమార్ కేసు నమోదు చేయగా, 24 మంది సాక్షులను విచారించిన జడ్జి.. నేరం రుజువు కావడంతో నిందితులకు జీవితఖైదు విధిస్తూ తీర్పుచెప్పారు. కోర్టు తీర్పు నేపథ్యంలో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, అటవీ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిద్రలోనే తెల్లారిన బతుకులు

- ఇంటి గోడ కూలి తల్లిదండ్రులతో పాటు కొడుకు మృతి
- సూర్యాపేట జిల్లాలో విషాదం


రాములు, రామక్క


శ్రీను


వర్షానికి కూలిన గోడలు

నాగారం: నిద్రలోనే ముగ్గురి బతుకులు తెల్లారిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బాగా తడిసిన ఇంటి గోడ కూలడంతో వృద్ధ దంపతులతో పాటు కుమారుడు దుర్మరణం చెందిన ఘటన సూర్యాపేట జిల్లాలోని నాగారం మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. శీల రాములు(90), రామక్క (83) దంపతులు తమ చిన్న కుమారుడు, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను(38)తో కలిసి చిన్న రేకుల ఇంట్లో జీవిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీను భార్య.. పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. కాగా బుధవారం రాత్రి రోజూ మాదిరిగానే శిథిలావస్థకు చేరిన ఆ రేకుల ఇంట్లోనే ఓ గదిలో ముగ్గురు కలిసి ఒకే చోట నిద్రించారు. వర్షాలకు ఇంటి గోడలు బాగా తడవడంతో రాత్రి సమయంలో మధ్య గోడ కూలి వారి మీద పడటంతో ముగ్గురూ నిద్రలోనే విగతజీవులుగా మారారు. గురువారం సాయంత్రం విద్యుత్ సిబ్బంది మీటర్ రీడింగ్ తీసేందుకు ఆ ఇంటికి రాగా ఎప్పుడూ బయట కూర్చునే వృద్ధ దంపతులు కనిపించకపోవడం, ఇంటి గడియ లోనికి వేసి ఉన్నా ఎవరూ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చింది. స్థానికులతో కలిసి గోడల మట్టిని తొలగించగా మృతదేహాలు కన్పించాయి. పోలీసులు వచ్చి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఒక్కొక్కరికి రూ.4లక్షల పరిహారం

విషయం తెలిసిన వెంటనే మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. తక్షణ సహాయంగా రూ. 25 వేల చొప్పున మొత్తం రూ. 75వేలు మంత్రి జగదీశ్‌రెడ్డి స్వయంగా అందజేశారు. వారి పిల్లలకు గురుకుల పాఠశాలలో విద్యావకాశం కల్పించడంతో పాటు పక్కా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు రికార్డు స్థాయిలో ధర పలికింది. గురువారం మార్కెట్‌కు 130 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపునకు గరిష్ట ధర క్వింటాలుకు రూ.12,213లు, కనిష్ట ధర రూ.4,509లు పలకగా, గోళారకానికి గరిష్ట ధర రూ.11,559లు, కనిష్ట ధర రూ.6,200లు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

DR. Y.S.R.UNIVERSITY OF HEALTH SCIENCES A.P., VIJAYAWADA - 8

ADMISSIONS INTO MBBS AND BDS COURSES FOR THE ACADEMIC YEAR 2023-24 UNDER

1) Competent Authority (SELF-FINANCING) seats and Competent Authority (NRI Category) seats in new Government Medical Colleges;
2) MANAGEMENT QUOTA [Category-B1, B2 and Category-C(NRI)] seats in Private Un-aided Non-Minority and Minority Medical Colleges and Dental Colleges affiliated to Dr. YSRUHS; and
3) NRI Category seats in Sri Padmavathi Medical College for Women (Under SVIMS), Tirupati.

Online Application forms along with uploading scanned original certificates are invited from the eligible candidates for admission into MBBS and BDS Courses under various categories as stated above for the academic year 2023-24.

SCHEDULE

Date of issue of Notification	03-08-2023
Availability of online Applications Website https://upmq.ysruhs.com	10.00 AM on 04-08-2023 To 05.00 PM on 10-08-2023
For Detailed Notification, Prospectus / Regulations, Notices, visit University website	https://drysr.uhsap.in

NO. OF COLLEGES AND SEATS AVAILABLE

Government Colleges

Course	College Status	No. of Colleges	Competent Authority	
			Self-Financing (B2)	NRI Category
MBBS	Government	05	225	95 (*)
	SVIMS, Tirupati	01	-	23

(*) 19 seats in each new Government Medical Colleges (Total 05) are meant for Competent Authority (NRI Category) seats.

Private Colleges

Course	College Status	No. of Colleges	Category of Seat				
			B	B1	B2	C (NRI)	
MBBS	Private Non- Minority	16	-	152	852	421	458
	Private Minority	02	88	-	-	37	
BDS	Private Non- Minority	14	-	66	390	194	209
	Private Minority	01	35	-	-	15	

NOTE:
1) Category- B1 seats are open to the candidates from all over the Country and filled first by order of merit from the merit list notified.
2) Category-B2 seats shall be allotted to local candidates from Andhra Pradesh State only i.e. by order of merit from the merit list notified.
3) 15% of Intake in Private Un-aided colleges are meant for Category- C (NRI) Seats. For all details, please refer the Prospectus / Regulations.

Vijayawada
Dated: 03.08.2023

Sd/-
(Dr.VEMIREDDY RADHIKA REDDY)
REGISTRAR

(Encl. No.1135MBBS/BDS/EA1/2023-MQ)

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సవరణ ప్రకటన

No.E1/DB/MCK/8201/148/MCK/2023-24 తేది: 02.08.2023

CM అష్యూరెన్స్ ఫండ్ గ్రాంట్స్ క్రింద రూ.13294.71 లక్షల అంచనా వ్యయంతో మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్ పరిధిలో పైప్‌లైన్స్, సర్ఫేస్ డ్రెయిన్స్, సీవరేజ్ లైన్స్ మొ.వి వేయుటతో పాటు ఇంటర్నల్ రోడ్ల వెడల్పు చేయుట, రీగ్రేడింగ్, C.Cతో పటిష్టపరుచుట సవరి ఇంప్రూమెంట్ కోసం ప్యాకేజీ. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 18-07-2023 సా.04.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 04-08-2023 సా.04.00 గం.కు బదులుగా బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 14-08-2023 సా.04.00 గం. అని చదువుకోగలరు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును. ఇమెయిల్: kncmnr@rediffmail.com

సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్

DIPR RO No.4962-PP/CL/Advt/1/2023-24, Dt: 03.08.2023

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

Lr No. E1/1748/2022-23 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది : 03.08.2023

రూ.1800.00 లక్షల మొత్తంతో వివిధ పనులను చేపట్టుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది 04.08.2023 సా.4.30 గం. నుండి 14.08.2023 సా.4.30 గం. వరకు కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచుట సా.4.31 గం.కు కమిషనర్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేదా వారి డిప్యూటీచే తెరవబడుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in ని దర్శించండి లేదా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం. 9849597085, 8367537939

సం/- కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR RO No.4965-PP/CL/Advt/1/2023-24 Dt: 03.08.2023

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ -II
5వ అంతస్తు, వెస్ట్ వింగ్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.HMDA/DEV/EE/Div-II/01/2023-24, తేది:03.08.2023

మెహిదీపట్నం స్కైవాక్, హైదరాబాద్ వద్ద గ్యారిసన్ దృశ్య పరిశీలనను నివారించేందుకు మెహిదీపట్నం గ్యారిసన్ సరిహద్దు గోడపై హై వ్యూ కట్టర్స్ ఏర్పాటు చేసే పని కోసం చెల్లుబాటగు నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు కోరబడుతున్నవి. బిడ్లు దాఖలు చేసేందుకు ఆఖరి తేది: 08-08-2023న మ.3.30 గం.వరకు. తదుపరి వివరాల కోసం దర్శించండి: https://tender.telangana.gov.in.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ -II, HMDA

DIPR RO No.4971-PP/CL/Advt/1/2023-24, Dt. 03.08.2023

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
"Energy saved is Energy Produced"

ఇ-ప్రొక్యూర్‌మెంట్/ఓపెన్ టెండరు పత్రికా ప్రకటన
RRZ-05/2023-24

CGM/OP/RR జోన్‌లో వరుసగా సైబర్ సిటీ సర్కిల్‌లోని మన్నెగూడ గ్రామంలో సివిల్ పనులతోపాటు లైన్స్‌తో 33/11KV SS స్థాపన & రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద సివిల్ పనులతోపాటు లైన్స్‌తో 33/11KV SS స్థాపన కోసం స్పెసిఫికేషన్ నం.లు 19B/2022-23 & 07/2023-24 తో టెండర్ల కోసం అర్హతగల కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. వివరమైన ప్రకటన, స్పెసిఫికేషన్ మరియు డిజిటల్ సర్టిఫికేట్‌కు సంబంధించిన తదుపరి వివరాల కోసం దర్శించండి www.tender.telangana.gov.in

సం/- చీఫ్ జనరల్ మేనేజర్, ఆపరేషన్స్, రంగారెడ్డి జోన్, KPHB కాలనీ, హైదరాబాద్

DIPR RO No.4957-PP/CL/Advt/1/2023-24, Dt: 03.08.2023

TS PGEC / TS PGECET-2023 ADMISSIONS

Telangana State Council of Higher Education, Hyderabad

NOTIFICATION

Registration-cum-Online Certificate Verification

The GATE / GPAT qualified and eligible candidates of 2021, 2022 and 2023 and TS PGECET-2023 qualified and eligible candidates seeking admission into M.E./ M.Tech./ M.Arch./ M.Pharm/ Pharm.D (P.B.) programs for the academic year 2023-2024 are informed to register online from **07-08-2023** onwards. For more information refer to the detailed notification available on the website **http://pgecetadm.tsche.ac.in** or **http://pgecet.tsche.ac.in**

Date: 04-08-2023
Place: Hyderabad

Convener
TS PGEC /TS PGECET-2023 Admn.

DIPR RO No.4956-PP/CL/Advt/1/2023-24, Dt: 03-08-2023

DR. Y.S.R.UNIVERSITY OF HEALTH SCIENCES A.P., VIJAYAWADA - 8

NOTIFICATION FOR ADMISSION INTO PH.D., COURSE FOR THE ACADEMIC YEAR 2022-23

Applications are invited from the eligible candidates for admission into Ph.D course in the field of Modern Medicine and other Allied Health Sciences as per Revised Ph.D Regulations 2022-23 of Dr. YSR University of Health Sciences, Vijayawada from 04-08-2023 to 26-08-2023. For detailed information please visit University Website at https://drysr.uhsap.in

VIJAYAWADA - 520 008
Dated: 03.08.2023

Sd/-
(Dr.V.RADHIKA REDDY)
REGISTRAR

TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH, Hyd.

(A Deemed to be University)

36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad, Telangana – 500 046

Advertisement No. 2023/07

Applications are invited for Admission to TIFR, Hyderabad under the Subject Board of Biology through CSIR-UGC NET 2023 (JRF eligible only) & DBT BET-2023 (JRF eligible only)

Ph.D. Programme
Starting from September 2023

To apply online, please visit **https://gsadmissions.tifrh.res.in**
or write to Academic Coordinator Email: **gsadmissions@tifrh.res.in**

The last date to submit application: 20th August, 2023

భారత ప్రభుత్వం/ भारत सरकार
ఆయుష్ మంత్రిత్వ శాఖ/ आयुष मंत्रालय

జాతీయ ధన్వంతరి ఆయుర్వేద అవార్డు 2023 కోసం ఆయుర్వేద నిపుణుల నుండి దరఖాస్తులు/నామినేషన్లు కోరబడుతున్నవి. అవార్డులు ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ యాక్ట్, 1970లోని II, III, IV షెడ్యూల్‌లో చేర్చబడి ఉండి అర్హత కలిగిన మరియు ఆయుర్వేద రంగంలో విస్తృత సేవలు అందించిన ఆయుర్వేద నిపుణులకు ప్రదానం చేసేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడినవి. అవార్డు గ్రహీతలు ధన్వంతరి జయంతి (ధంతేరాస్) నాడు నిర్వహించబడే 8వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా అవార్డుతో సత్కరించబడతారు. వివరాలను జాతీయ అవార్డుల పోర్టల్ http://awards.gov.in దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం నుండి పొందవచ్చును. తదనుగుణంగా దరఖాస్తులు/నామినేషన్లను 15 సెప్టెంబర్, 2023లోగా దాఖలు చేయవలెను.

cbc 17201/11/0006/2324

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

e-AUCTION NOTICE

Rc. No.12/2023/BL-8/F1 **Dt. 03-08-2023**

The VMRDA, Visakhapatnam is proposed to sell the following vacant bulk lands/ land parcels to the public, on **"as is where is basis"** and applications are invited through GOAP e-auction portal : **(https://konugolu.ap.gov.in)** from **03-08-2023 to 18-08-2023 upto 5.00 PM. Date of Auction : 18-08-2023.**

Sl.No.	e-Auction Notification No. & Date	Details of Bulk Land	Extent Ac Cts
1.	Rc.No. 13/2023/BL-8/F1, dated .08-2023	Sy.No. 421/p (carved out from Sy.No. 27) of Madhurawada Village, Chinagadila Mandal, Visakhapatnam District	87.80
2.	Rc.No. 14/2023/BL-9/F1, dated .08-2023	Sy.No. 127/10 of Madhurawada Village, Chinagadila Mandal, Visakhapatnam District	0.285

For more details visit at VMRDA website : **www.vmrda.gov.in / Email : e.auctionvmrda@gmail.com / Konugolu portal help desk details : 08645-246370/71/72/73/74. For Administrative matters contact Help desk VMRDA, Contact details : 9985614879, Land Line No. 0891-2754133**

Sd/-Metropolitan Commissioner, VMRDA

బుద్వేల్ లో ప్రభుత్వ భూముల వేలం

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వారికి సువర్ణ అవకాశం

హెచ్.ఎం.డి.ఏ వారిచే మొత్తం 100 ఎకరాల విస్తీర్ణం గల 14 ప్రధాన ప్లాట్ల ఈ - వేలం

100 ఎకరాలు

14 ల్యాండ్ పార్సెల్స్

3.47 ఎకరాల నుండి 14.33 ఎకరాల వరకు

అత్యాధునిక మౌలిక వసతులు గల లే అవుట్

వేలం కొరకు ప్రతిపాదించబడిన ప్లాట్లు

వరుస సంఖ్య	ప్లాట్ నెంబరు	ప్లాట్ విస్తీర్ణం (ఎకరాల్లో)
1	ప్లాట్ నెంబరు 1	5.10
2	ప్లాట్ నెంబరు 2	8.15
3	ప్లాట్ నెంబరు 4	14.33
4	ప్లాట్ నెంబరు 5	10.59
5	ప్లాట్ నెంబరు 8	6.31
6	ప్లాట్ నెంబరు 9	6.69
7	ప్లాట్ నెంబరు 10	6.94
8	ప్లాట్ నెంబరు 11	6.92
9	ప్లాట్ నెంబరు 12	6.69
10	ప్లాట్ నెంబరు 13	6.94
11	ప్లాట్ నెంబరు 14	6.13
12	ప్లాట్ నెంబరు 15	7.16
13	ప్లాట్ నెంబరు 16	3.47
14	ప్లాట్ నెంబరు 17	4.59
	మొత్తం	100.01



పేమెంట్ షెడ్యూల్

- మొదటి వాయిదా (ప్రారంభ డిపాజిటు) : అమ్మకపు విలువలో 33% దరావత్తు మినహాయించుకొని ఆఫర్ లెటర్ జారీచేసిన తేది నుండి 7 రోజులలోపు చెల్లించాలి
- రెండవ & చివరి వాయిదా: అమ్మకపు విలువలో మిగిలిన మొత్తాన్ని దరావత్తుతో కలుపుకొని 30 రోజులలోపు చెల్లించాలి.

బ్రోచర్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు

ప్రధానాంశాలు

- 100% ఎటువంటి చిక్కులు లేని క్లియర్ టైటిల్ ఉన్న ప్రభుత్వభూమి
- బహుళప్రయోజన నిర్మాణాలకు అనువైన ప్రాంతం
- అపరిమితమైన FSI (AAI అనుమతులకు లోబడి)
- 36మీ, 45మీ రోడ్లు, ఇంకా అన్ని మౌలికవసతులతో, నియోపోలిస్‌లోని మౌలికవసతులకు సమానంగా
- 15 నిమిషాలలో ఎయిర్‌పోర్టుకు & నియోపోలిస్‌కు
- బుద్వేల్ స్టేషన్ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రోలైన్ మార్గంలో
- ఔటర్ రింగ్ రోడ్డుకు చక్కటి అనుసంధానం

ఈ-వేలం షెడ్యూల్

ప్రకటన	04-08-2023
ప్రీ బిడ్ సమావేశం	06-08-2023
రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేది	08-08-2023 సా॥ 5 గం.ల వరకు
దరావత్తు చెల్లించుటకు ఆఖరు తేది	09-08-2023 సా॥ 5 గం.ల వరకు
ఈ-వేలం తేది, సమయం	10-08-2023 సెషన్-I ఉ. 11 గం. ల నుండి మ. 2 గం. ల వరకు (ప్లాటు నెంబర్లు 1, 2, 4, 5, 8, 9, 10) సెషన్-II మ. 3 గం. ల నుండి సా. 6 గం. ల వరకు (ప్లాటు నెంబర్లు 11, 12, 13, 14, 15, 16, 17)
నిర్దేశిత కనీస ధర	ఎకరాకు రూ. 20 కోట్లు
కనీస బిడ్ పెంపుదల	ఎకరాకు రూ.25 లక్షలు లేదా దాని గుణిజాలలో

అర్హత ప్రమాణాలు & మరిన్ని వివరాలకు సందర్శించండి https://www.hmda.gov.in/auctions/

జారీ చేసినవారు: ప్రత్యేక కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

క్లుప్తంగా...

'ఇస్లామిక్ స్టేట్'కు కొత్త చీఫ్

న్యూఢిల్లీ: ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) తమ అధినేత అబు హుస్సేన్ అల్ హుస్సెయినీ అల్ ఖురేషి మృతి చెందినట్లు ధ్రువీకరించింది. ఈ మేరకు టెలిగ్రామ్ చానల్ ద్వారా ఆ సంస్థ ప్రకటించింది. ఆ ప్రకటన ఏ తేదీన విడుదలైందీ తెలియరాలేదు. అతడు ఎప్పుడు, ఎలా మృతి చెందాడనే విషయం కూడా అందులో పేర్కొనలేదు. ఐఎస్ కొత్త అధిపతిగా అబు హఫ్స్ అల్ హషిమి అల్ ఖురేషి పగ్గాలు చేపట్టనున్నారని సంస్థ ప్రతినిధి తెలిపారు.

బాలికను చంపి, బొగ్గుబట్టీలో కాల్చేశారు

రాజస్తాన్‌లోని భిల్వారాలో దారుణం

జైపూర్: రాజస్తాన్‌లో భిల్వారాలో దారుణం చోటుచేసుకుంది. కొందరు రాక్షసులు 14 ఏళ్ల బాలికను చంపి, బొగ్గు బట్టీలో కాల్చేశారు. బుధవారం ఉదయం మేకల కాపలాకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె సోదరుడు, గ్రామస్తులు వెతుకులాట మొదలుపెట్టారు. రాత్రికి గ్రామ సమీపంలోని మండుతున్న ఒక బట్టీలో బాలిక చేతి గాజు, ఎముక ముక్కలు..ఆ పక్కనే బాలిక చెప్పులు వారికి కనిపించాయి. దీంతో, వారు బట్టీలు నిర్వహించే కల్బేరియా తెగకు చెందిన అయిదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాలికపై అత్యాచారం చేశాక, చంపి కొలిమిలో పడేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను ప్రశ్నిస్తున్నట్లు కోట్రి పోలీస్ స్టేషన్ అధికారులు చెప్పారు.

కాల్పుల్లో జవాను మృతి




చురాచాంద్‌పూర్‌లో మృతులకు నివాళులర్పిస్తున్న జో–కుకీ వర్గీయులు

ఇంఫాల్: చురాచాంద్‌పూర్‌లో కుకి–జోమి ప్రజల అంత్యక్రియల ఊరేగింపును అడ్డుకునేందుకు కొందరు యత్నించారు. అడ్డుకున్న జవాన్లతో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో మణిపూర్ రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు సహా 25 మంది ఆందోళనకారులు గాయపడ్డారు. అనంతరం ఒక జవాను మృతి చెందారు. ఈ ఘటనతో చురాచాంద్‌పూర్ జిల్లాలో నిషేధాజ్ఞలను మళ్లీ పొడిగించారు. మరోవైపు, మణిపూర్ ఘర్షణల్లో మూడు నెలలుగా ప్రాణాలు కోల్పోయిన 35 మంది కుకి–జోమి తెగ ప్రజల సామూహిక ఖననాలపై హైకోర్టు స్టే విధించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాది ఇప్పటిదాకా 19 మంది బలి



కోటా(రాజస్తాన్): రాజస్తాన్‌లోని కోటా పట్టణంలో వైద్య విద్య ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన ముఖానికి ప్లాస్టిక్ బ్యాగ్ చుట్టుకొని ఊపిరాడని స్థితిలో ప్రాణాలు తీసుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన మన్‌జోత్ చాబ్రా కోటాలోని ఓ శిక్షణా కేంద్రంలో 'నీట్' కోచింగ్ తీసుకుంటున్నాడు. గురువారం ఉదయం తన హాస్టల్ రూమ్‌లో విగతజీవిగా కనిపించాడు. మన్‌జోత్‌కు అతని తల్లిదండ్రులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో వారు హాస్టల్ వార్డెన్‌ను అప్రమత్తం చేశారు. విద్యార్థి గది తలుపులను బద్దలు కొట్టి చూడగా మృతదేహం కనిపించింది. కోటాలో ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోవడంతో హాస్టల్ గదుల్లో సీలింగ్ ఫ్యాన్‌కి యాంటీ సూసైడ్ పరికరాలు అమర్చారు. దీంతో మన్‌జోత్ తన ముఖానికి, తలకి ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌ని చుట్టుకొని, దానికి ఒక బట్టను గట్టిగా కట్టి ప్రాణాలు తీసుకున్నట్టు పోలీసు అధికారి ధర్మవీర్ సింగ్ వెల్లడించారు. తన మరణానికి ఎవరూ కారణం కాదంటూ అతడి గదిలో ఒక లేఖ లభ్యమైనట్లు చెప్పారు. మన్‌జోత్ చాలా తెలివైనవాడని, అందరితో జోక్స్ వేస్తూ సరదాగా ఉంటాడని అతని స్నేహితులు చెప్పారు. కోటాలో ఈ ఏడాది బలవన్మరణం చెందిన విద్యార్థుల సంఖ్య 19కి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ఇదే పట్టణంలో 15 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అఖిల భారత స్థాయిలో జరిగే ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కేంద్రాలకు కోటా ప్రసిద్ధి గాంచింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థులు కోచింగ్ కోసం వస్తుంటారు. చదువుల్లో ఒత్తిడి వల్ల వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

అదే ప్రతిష్ఠంభన!

మణిపూర్‌పై పార్లమెంటులో అదే రగడ

- 176 నిబంధన కింద 'స్వల్ప వ్యవధి' చర్చకు సిద్ధం: కేంద్రం
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు: విపక్ష కూటమి
- మోదీ ప్రకటన, పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు పట్టు
- విపక్ష నేతలను ఒప్పించేందుకు మంత్రుల విఫలయత్నం

న్యూఢిల్లీ: పార్లమెంటులో మణిపూర్ ప్రతిష్టంభన వీడకపోగా గురువారం పీటముడి మరింతగా బిగుసుకుంది. ఈ విషయమై విపక్షాలను అనునయించేందుకు గురువారం అధికార బీజేపీ ఒక మెట్టు దిగినా లాభం లేకపోయింది. లోక్‌సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఇతర ప్రతిపక్ష నేతలతో కేంద్రం తరఫున రాజ్యసభ నాయకుడు పీయూష్ గోయల్, మరో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ అరగంటకు పైగా చర్చలు జరిపారు. కానీ తమ డిమాండ్లపై పట్టు వీడేందుకు విపక్షాలు ససేమిరా అన్నాయి. మణిపూర్ హింసాకాండపై ప్రధాని ఉభయ సభల్లోనూ ప్రకటన చేయడంతో పాటు పార్లమెంటులో లోతైన చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టాయి. దాంతో చర్చలు ఎటూ తేలకుండానే ముగిశాయి. 267 నిబంధన కింద ఈ అంశంపై చర్చకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసినా, ప్రధాని ప్రకటన డిమాండ్‌కు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదని పట్టుదలగా ఉంది. అంతగా అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేస్తారని చెబుతోంది. చివరికి కేంద్రం మరింత దిగొచ్చి మణిపూర్‌పై 176 నిబంధన కింద ఆగస్టు 11న రాజ్యసభలో స్వల్ప వ్యవధి చర్చకు సిద్ధమని ప్రతిపాదించింది. విపక్ష ఇండియా కూటమి మాత్రం 267, 176 నిబంధనల్లో దేని కిందా చర్చకు ఒప్పుకునేది లేదంటోంది. ''నిబంధనతో మాకు నిమిత్తం లేదు. ఇరు పక్షాలకూ ఆమోదయోగ్యమైన నిబంధన కింద పూర్తిస్థాయి చర్చ మాత్రం జరిగి తీరాల్సిందే'' అని డిమాండ్ చేస్తోంది. మణిపూర్‌పై ఏదోలా పార్లమెంటులో చర్చ జరిగి ప్రతిష్టంభనకు తెరపడవచ్చంటున్నారు. తాము ప్రతిపాదించిన మధ్యేమార్గానికి మోదీ సర్కారు అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్టు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు.



రాజ్యసభలో మణిపూర్ అంశాన్ని చర్చించాలని వేడుకుంటున్న విపక్ష సభ్యులు

సభ్యుల హామీతో మళ్లీ సభలోకి స్పీకర్

ఇక లోక్‌సభలో మరో అరుదైన, ఆసక్తికరమైన దృశ్యం చోటుచేసుకుంది. హుందాగా నడుచుకుంటామని పలువురు విపక్ష సభ్యులు హామీ ఇవ్వడంతో స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం సభలో అడుగుపెట్టి కార్యకలాపాలను నడిపించారు. సభా కార్యకలాపాలకు సభ్యులు పదేపదే అడ్డుకుంటుండటం పట్ల మంగళవారం ఆయన తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చడం, వారి ప్రవర్తనకు హుందాగా లేదంటూ ఆక్షేపించడం, ఇక సభకు రాబోనని ప్రకటించడం తెలిసిందే. ఆ మేరకు బుధవారమంతా స్పీకర్ లోక్‌సభకు దూరంగా ఉన్నారు. గురువారం ఉదయం కూడా ప్రశ్నోత్తరాలయ్యే దాకా సభకు రాలేదు. దాంతో, 'స్పీకర్ సభకు రావాలన్నది విపక్ష సభ్యులందరి కోరిక. ఆయన్ను సభ మొత్తం ఇష్టపడుతుంది'' అని అధీర్ రంజన్ చౌధరి (కాంగ్రెస్) అన్నారు. ''ఎన్ని భేదాభిప్రాయాలున్నా మాట్లాడుకుని పరిష్కరించుకుందాం. స్పీకర్ మన నాయకుడు'' అని చెప్పారు. అనంతరం అధీర్ నేతృత్వంలో విపక్ష నేతలు సౌగాథా రాయ్ (తృణమూల్), కనిమొళి (డీఎంకే), సుప్రియా సులే (ఎన్సీపీ) తదితరులతో పాటు మంత్రి గడ్కరీ సైతం బిర్లా చాంబర్‌కు వెళ్లి సభకు రావాల్సిందిగా కోరారు.

జీఎన్‌సీటీడీ (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదిస్తుండగా ఆప్ ఎంపీ సుశీల్ రింకూ వెల్‌లోకి దూసుకొచ్చి కాగితాలు చించి స్పీకర్‌కేసి విసిరారు. దాంతో సమావేశాలు పూర్తయ్యేదాకా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

నాకు కోపమే రాదు ఎందుకంటే... | నా పెళ్లై 45 ఏళ్లయింది!

రాజ్యసభలో నవ్వులు పూయించిన చైర్మన్



మణిపూర్ అంశంపై పార్లమెంటు అట్టుడుకుతున్న వేళ రాజ్యసభలో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తనపైనే జోకులు వేసుకుని సభలో నవ్వులు పూయించారు. దాంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మీకు పదేపదే కోపమెందుకు వస్తుందని విపక్షనేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. 'సర్, నాకసలు కోపమే రాదు. ఎందుకంటే నా పెళ్లై 45 ఏళ్లయింది' అంటూ ధన్‌ఖడ్ చెణుకులు విసరడంతో సభ్యుల నవ్వులతో సభ దద్దరిల్లిపోయింది. ''చిదంబరం (కాంగ్రెస్ సభ్యుడు) చాలా సీనియర్ లాయర్ కూడా. అథారిటీపై కోపం చూపే హక్కు మాకుండదని ఆయనకు బాగా తెలుసు. సభలో మీరే (సభ్యులు) అథారిటీ. మరో విషయం. నా భార్య ఎంపీ కాదు. కనుక ఆమె గురించి నేనిలా సభలో మాట్లాడటం సరికాదు కూడా'' అంటూ ధన్‌ఖడ్ మరోసారి అందరినీ నవ్వించారు. తనకు కోపం వస్తుందన్న వ్యాఖ్యలను సవరించుకోవాల్సిందిగా ఖర్గేను కోరారు. దాంతో ఆయన లేచి, ''మీకు కోపం రాదు. చూపిస్తారంతే. కానీ నిజానికి చాలాసార్లు లోలోపల కోపగించుకుంటారు కూడా'' అనడంతో అధికార, విపక్ష సభ్యులంతా మరోసారి నవ్వుల్లో మునిగిపోయారు!

రెండుసార్లు వాకౌట్

అంతకుముందు, మణిపూర్ అంశాన్ని లేవనెత్తేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, తృణమూల్, ఆర్జేడీ, ఆప్, వామపక్షాలు తదితర విపక్షాలు ఉదయం రాజ్యసభ భేటీ కాగానే వాకౌట్ చేశాయి. మధ్యాహ్నం రెండింటికి తిరిగి సమావేశమయ్యాక కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీకి చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అవకాశమిచ్చారు. మణిపూర్ హింసపై, మహిళలపై ఘోర అత్యాచారాలపై చర్చకు అవకాశం కోరుతున్నట్టు ఆయన చెప్పారు. దీనిపై అధికార, విపక్ష సభ్యులతో ఎన్నిసార్లు సమావేశమైనా ఎవరికి వాళ్లే తమదే పై చేయి కావాలని పట్టుదలకు పోవడంతో లాభం లేకపోతోందంటూ చైర్మన్ వాపోయారు. ఆగ్రహించిన విపక్ష సభ్యులు 'ప్రధాని మోదీ సభకు రావాలి' అంటూ నినాదాలకు దిగారు. వాటిని పట్టించుకోకుండా ఖనిజాల (సవరణ) బిల్లు ప్రవేశపెట్టేందుకు మంత్రి ప్రహ్లాద్ జోషికి చైర్మన్ అవకాశమిచ్చారు. దాన్ని నిరసిస్తూ విపక్షాలు రెండోసారి వాకౌట్ చేశాయి.

జ్ఞానవాపీ మసీదులో సర్వేకు ఓకే

- అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు
- అంజుమన్ ఇంతెజామియా పిటిషన్ కొట్టివేత



జ్ఞానవాపీ మసీదు ముందు శంఖం పూరిస్తున్న భక్తుడు

ప్రయాగ్‌రాజ్/వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే జరపాలంటూ పురావస్తు శాఖ(ఏఎస్ఐ)కు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. శాస్త్రీయ సర్వేకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపింది. జిల్లా కోర్టు ఉత్తర్వు సముచితమేనని, ఈ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొంది. వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకునే ఉన్న జ్ఞానవాపీ మసీదు ఆలయంపైనే నిర్మించిందా లేదా తేల్చేందుకు ఏఎస్ఐ శాస్త్రీయ సర్వే జరపాలంటూ వారణాసి జిల్లా కోర్టు జూలై 21న అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలపై అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మసీదు కమిటీకి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలంటూ ఏఎస్ఐ సర్వేపై జూలై 26 సాయంత్రం 5వరకు స్టే ఇచ్చింది. ఈ మేరకు మసీదు కమిటీ సర్వేను ఆపాలంటూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై అలహాబాద్ హైకోర్టు సీజే ధర్మాసనం జూలై 27 వరకు హిందు, మసీదు కమిటీ వర్గాల వాదనలు విని, తీర్పు రిజర్వు చేసింది. మసీదు కమిటీ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మసీదు ఆవరణలో ఏఎస్ఐ అధికారులు తక్షణమే తమ పనులు ప్రారంభించవచ్చని, సర్వేలో భాగంగా ఆ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు జరపరాదని స్పష్టం చేసింది. ఏఎస్ఐ అధికారులు సర్వేను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సహకరించాలంటూ ఏఎస్ఐ తమను కోరిందని వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రాజలింగం తెలిపారు. జ్ఞానవాపి మసీదులో ఏఎస్ఐ సర్వేకు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. సర్వే నిలుపుదల కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది.

విపక్షాల లొల్లి నడుమే... 'ఢిల్లీ' బిల్లుకు ఆమోదం

మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ ● విపక్షాల వాకౌట్

- బిల్లుపై సుదీర్ఘ చర్చ.. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం
- ప్రజల సంక్షేమం గురించి ఆలోచించండి: అమిత్ షా
- 'ఇండియా' కూటమికి కేజ్రీవాల్ బై బై చెప్పేస్తారని జోస్యం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023'పై గురువారం లోక్‌సభలో ఆమోద ముద్రపడింది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళన మధ్యే మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసనగా విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు ఈ బిల్లుపై లోక్‌సభలో దాదాపు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు?: కాంగ్రెస్ సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ బిల్లును ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. ప్రభుత్వ పాలనా సర్వీసులపై ఢిల్లీ ప్రభుత్వానికే అధికారాలు ఉన్నాయంటూ న్యాయస్థానం చెప్పిందని గుర్తుచేశారు. ఒకవేళ ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే, రాష్ట్రాల్లో ప్రజల చేత ఎన్నికైన శాసనసభలపై కేంద్ర ప్రభుత్వానిదే పైచేయి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రం అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అధికారులే నడిపిస్తే ఇక ఎంపీలను, ఎమ్మెల్యేలను ఎన్నుకోవడం ఎందుకని నిలదీశారు. 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' వ్యవస్థను విచ్ఛిన్నం చేయొద్దని కోరారు. డీఎంకే సభ్యుడు దయానిధి మారన్ మాట్లాడుతూ.. 'ఇండియా' కూటమి బలంగా ఉందని, మీ గురించి ఆలోచించుకోండి అని బీజేపీకి హితవు పలికారు. 2024లో తమ కూటమి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

ప్రజలను బానిసలుగా మారుస్తారా?: కేజ్రీవాల్

ఢిల్లీ బిల్లును వ్యతిరేకిస్తూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గురువారం ట్వీట్ చేశారు. ఢిల్లీ ప్రజలను బానిసలుగా మార్చడానికే ఈ బిల్లు తీసుకొచ్చారని ఆక్షేపించారు. ప్రజల హక్కులను లాక్కొనే బిల్లు ఎందుకని నిలదీశారు. బిల్లుకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వద్ద సరైన వాదన ఒక్కటి కూడా లేదన్నారు. బిల్లు విషయంలో తప్పు చేస్తున్నట్లు కేంద్రానికి కూడా తెలుసని పేర్కొన్నారు.

అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే..: అమిత్ షా

ఢిల్లీకి సంబంధించిన చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఏఏ కింద పార్లమెంట్‌కు ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఢిల్లీ బిల్లుపై లోక్‌సభలో తొలుత ఆయన చర్చను ప్రారంభించారు. కేవలం అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలోని అధికార ఆప్ ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పించాలన్న సూచనను జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సర్దార్ వల్లభ్‌బాయి పటేల్, సి.రాజగోపాలాచారి, రాజేంద్ర ప్రసాద్ సైతం తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఢిల్లీ బిల్లు విషయంలో అసలు సమస్య అధికారుల బదిలీలు, పోస్టింగులపై నియంత్రణ గురించి కాదని, ఇప్పటిదాకా జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే బిల్లును వ్యతిరేకిస్తున్నారని కేజ్రీవాల్ పార్టీపై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. బిల్లులు, చట్టాలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని తేల్చిచెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, అందుకే మీరు ప్రతిపక్షానికి పరిమితం అయ్యారని కాంగ్రెస్ సహా ఇతర పార్టీలను ఉద్దేశించి అన్నారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందాక 'ఇండియా' కూటమిలో 'ఆప్' భాగస్వామిగా ఉండబోదన్నారు.

హరియాణాలో మళ్లీ ఉద్రిక్తత



నూహ్ అల్లర్లలో అరెస్టయిన యువకులు

గురుగ్రామ్: మత ఘర్షణలతో అట్టుడికిన హరియాణాలోని నూహ్ జిల్లాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం రాత్రి 11.30 గంటలకు ఓ వర్గానికి చెందిన రెండు ప్రార్థనా మందిరాలు స్వల్పంగా దగ్ధమయ్యాయి. ఘటనలో ఎవరూ గాయపడలేదు. అయితే, ఒక ప్రార్థనా మందిరం కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో, మరొకటి గుర్తుతెలియని కారణాలతో మంటలు అంటుకోవడంతో దగ్ధమైనట్లు పోలీసులు చెప్పారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. గురుగ్రామ్‌లోనూ ఉద్రిక్తత కొనసాగుతోంది. కాగా, హరియాణాలో మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటిదాకా 93 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) ప్రసాద్ చెప్పారు. 176 మందిని అరెస్టు చేశామని, వీరిలో 78 మందిని పీడీ చట్టం కింద అదుపులోకి తీసుకున్నామని తెలియజేశారు.

డేటా దుర్వినియోగం చేస్తే రూ.250 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: పౌరుల డిజిటల్ హక్కులు, వ్యక్తిగత సమాచార భద్రతకు ఉద్దేశించిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల మధ్య కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుని ద్రవ్య బిల్లుగా తీసుకువచ్చారన్న ఆరోపణల్ని మంత్రి అశ్విని వైష్ణవ్ తోసిపుచ్చారు. ఇది సాధారణ బిల్లేనని స్పష్టం చేశారు. పౌరుల వ్యక్తిగత గోప్యతతో ప్రమేయమున్న ఈ బిల్లును హడావుడి ఆమోదించవద్దని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధరి అన్నారు. గత ఏడాది ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉంచిన ముసాయిదా బిల్లుపై వచ్చిన సలహాలు సూచనలతో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. వినియోగదారుల డిజిటల్ డేటాని దుర్వినియోగం చేసేవారిపై కేంద్రం కొరడా ఝళిపించింది. అలాంటి సంస్థలపై రూ.50 నుంచి రూ.250 కోట్ల వరకు జరిమానా విధించనుంది. అంతేకాకుండా ఈ చట్టం అమలు కోసం ప్రత్యేకంగా డేటా ప్రొటెక్షన్ బోర్డుని ఏర్పాటు చేయనున్నట్టుగా బిల్లులో పేర్కొంది.



సునాక్ ఇంటిపై నల్లవస్త్రం

నలుగురు పర్యావరణ కార్యకర్తల అరెస్టు

లండన్: బ్రిటన్ ప్రధాని ఇంటిపై నల్లటి వస్త్రాన్ని కప్పిన నలుగురు పర్యావరణ కార్యకర్తలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఉత్తర ఇంగ్లాండ్‌లో నార్త్ యార్క్‌షైర్ ప్రాంతంలోని రిచ్‌మండ్‌లో ఉన్న రిషి సునాక్ ఇంటిపై వారు నల్లటి వస్త్రం కప్పి తమ నిరసనను తెలియజేశారు. వీరు 'గ్రీన్‌పీస్' అనే పర్యావరణ పరిరక్షణ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. సముద్రంలో చమురు, గ్యాస్ వెలికితీతను మరింత విస్తరిస్తూ సునాక్ ఇటీవల తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇలా నిరసన వ్యక్తం చేశారు. సునాక్ ఇంటిపైకి ఎక్కి 200 చదరపు మీటర్ల నల్ల వస్త్రాన్ని కప్పారు. అలాగే సునాక్ ఇంటి ముందు మరో ఇద్దరు కార్యకర్తలు 'చమురు లాభాలు ముఖ్యమా? లేక మా భవిష్యత్తు ముఖ్యమా?' అని ప్రశ్నిస్తూ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సమయంలో సునాక్ కుటుంబసభ్యులెవరూ ఆ ఇంట్లో లేరు.

యుద్ధ మృతులు 10 వేలు

కీవ్: రష్యా దురాక్రమణ తమ దేశంపై మొదలయ్యాక 499 మంది చిన్నారులు సహా 10,749 మంది పౌరులు చనిపోయినట్లు ఉక్రెయిన్ తెలిపింది. ఉక్రెయిన్ ప్రాసిక్యూటర్ జనరల్ ఉన్నతాధికారి యూరి బియెలౌసోవ్ ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలు వెల్లడించారు. ఆక్రమిత ప్రాంతాలను విముక్తి చేసిన తర్వాతే వాస్తవ సంఖ్య తేలుతుందని చెప్పారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో 500 మంది చిన్నారులు సహా 9 వేల మందికి పైగా పౌరులు మృతి చెందినట్లు జూలై 7న ఐక్యరాజ్యసమితి వెల్లడించిన నివేదిక తెలిపింది. కాగా, రష్యా కాల్పుల్లో ఖెర్సన్ నగరంలోని 18వ శతాబ్దానికి చెందిన చారిత్రక సెంట్ కేథరిన్ కేథడ్రల్ చర్చి దెబ్బతింది. మంటలను ఆర్పుతుండగా మరోసారి దాడి జరిగింది.

యుద్ధ ట్యాంకర్‌పై కూర్చున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ నిలువెత్తు రక్త ప్రతిమపై వాటర్ గన్‌తో నీళ్లు పిచికారీ చేస్తున్న ఓ బాలిక. ఇటలీ రాజధాని రోమ్‌లో జేమ్స్ కొలోమినా అనే కళాకారుడు ఈ ప్రతిమను ప్రతిష్టించారు.





రిలయన్స్ పేరుతో ఫేక్ లెటర్

'రిలయన్స్ ఫౌండేషన్' పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫేక్ లెటర్లు సర్క్యులేట్ అవుతున్నాయి. దీంతో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. -8లో



అవయవదానంపై అవగాహన పెరగాలి

అవయవ దానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని మంత్రి హరీష్‌రావు అన్నారు. రవీంద్రభారతిలో జాతీయ అవయవదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. -8లో

ఆరేళ్ల బాలుడికి కాలేయ మార్పిడి



ఉస్మానియా దవాఖానాలో ఆరేళ్ల బాలుడికి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు. -8లో

న్యూస్‌రీల్

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. గురువారం చింతల్ బస్తీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. రిజిస్టర్లు, పేషెంట్ల చార్ట్‌ను ఆయన పరిశీలించారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, ఎస్‌పీహెచ్ నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

8న 'చలో ట్రాన్స్‌పోర్ట్ భవన్'

- తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘం



హిమాయత్‌నగర్: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 8న 'చలో ట్రాన్స్‌పోర్ట్ భవన్'ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జేఏసీ నాయకులు కొంరెల్లి బాబు, వెంకటేశం, సి.హెచ్.జంగయ్య, ఎం.డి.ఒమర్‌ఖాన్ తదితరులు మాట్లాడుతూ... 2014 నుంచి పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్రం ఆవిర్భావం నుంచీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచలేదన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న నిర్వహించే 'చలో ట్రాన్స్ పోర్ట్ భవన్' ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కమతం యాదగిరి, భిక్షపతి యాదవ్, నర్సిరెడ్డి, నేతలు జి.మల్లేష్, ఎస్.కె.లతీఫ్, వెంకన్న, శ్యామ్‌లాల్‌నాయక్, హరిదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్ కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 16 మంది బదిలీపై రాగా.. వీరిలో 14 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ లభించింది. వీరికి 12 తహసీల్ ఆఫీసులతో పాటు రెండు డివిజన్ ఆఫీస్‌ల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కేటాయించారు. హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ పరిపాలనాధికారి (ఏఓ)గా పీ కృష్ణకుమార్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ ఏఓగా బుచ్చయ్యలకు పోస్టింగ్ లభించింది. తహసీల్దార్లుగా అనిత (సైదాబాద్), అనితా రెడ్డి (షేక్‌పేట), సంధ్యారాణి (హిమాయత్‌నగర్), ఎస్ జ్యోతి (ఆసిఫ్‌నగర్), ఎండీ నయీముద్దీన్ (ఖైరతాబాద్), భీమయ్య గౌడ్ (అమీర్‌పేట), అశోక్ కుమార్ (తిరుమలగిరి), జయమ్మ (బండ్లగూడ), పద్మసుందరి (మారేడుపల్లి), ప్రేమ్‌కుమార్ (నాంపల్లి), పాండునాయక్ (చార్మినార్), అహల్య (గోల్కొండ)లకు పోస్టింగ్ లభించింది.

లాటరీ పద్ధతిలో మద్యం షాపుల రిజర్వేషన్ల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సికింద్రాబాద్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో మద్యం షాపుల రిజర్వేషన్‌ను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లాటరీ పద్ధతిన రిజర్వేషన్లను ఖరారు చేశారు. హైదరాబాద్ ఎక్సైజ్ జిల్లాలో మొత్తం 80 దుకాణాలకు ఎస్టీలకు 1 , ఎస్సీలకు 4, గౌడ సామాజిక వర్గానికి 5, సికింద్రాబాద్ ఎక్సైజ్ పరిధిలోని 99 మద్యం షాపులకు ఎస్టీలకు 1, ఎస్సీలకు 7, గౌడ సామాజిక వర్గానికి-6 దుకాణాలను కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, హైదరాబాద్ సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు విజయ్, పవన్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యాదయ్య, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఆశన్న, గిరిజనాభివద్ధి అధికారిణి సంధ్య తదితరులు పాల్గొన్నారు.







తెలంగాణ అసెంబ్లీ, మండలి సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలతో అసెంబ్లీ ఎదుట కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

బలగాలతో బందోబస్తు

భూం.. బూమ్

సర్కార్ ఖజానాకు హెచ్ఎండీఏ నజరానా

- భూముల అమ్మకం ద్వారా రూ.వేల కోట్ల ఆదాయం
- నగరం నలువైపులా భారీ ఎత్తున భూముల అమ్మకం
- ఇప్పటికే ఉప్పల్ భగాయత్, మేడిపల్లి, బాచుపల్లిల్లో ప్లాట్‌ల విక్రయాలు
- కోకాపేట్ నియో పోలిస్‌లో రెండో దశకు భారీ స్పందన
- ఎకరం అత్యధికంగా రూ.100.75 కోట్లు
- త్వరలో బోడుప్పల్, మోకిల, షాబాద్‌లలో అమ్మకాలకు సన్నాహాలు
- బుద్వేల్‌లో మరో 50 ఎకరాలు సిద్ధం



సాక్షి, సిటీబ్యూరో: సర్కార్ ఖజానాకు హెచ్ఎండీఏ కాసుల వర్షం కురిపిస్తోంది. భూముల అమ్మకాల ద్వారా పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. నగరానికి నలువైపులా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు, రైతుల నుంచి కూడా భూములను సేకరించి భారీ లేఅవుట్‌లను అభివృద్ధి చేసి విక్రయిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న బిడ్డింగ్‌లో దేశ, విదేశాలకు చెందిన దిగ్గజ వ్యాపార సంస్థలు, బిల్డర్లు పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్నారు. మరోవైపు సాధారణ, మధ్యతరగతి వర్గాలు సైతం హెచ్ఎండీఏ ప్లాట్‌లపై ఆసక్తి చూపుతున్నాయి. దీంతో వందల చదరపు గజాల విస్తీర్ణం నుంచి ఎకరాల్లో భూముల విక్రయానికనుగుణంగా హెచ్ఎండీఏ లేఅవుట్‌లను అభివృద్ధి చేస్తోంది. కోకాపేట్‌లో మొదటి దశలో 64 ఎకరాలను విక్రయించగా తాజాగా 45.33 ఎకరాలకు వేలం నిర్వహించారు. మరోవైపు ఇప్పటి వరకు ఉప్పల్ భగాయత్‌లో మూడు దశల్లో సుమారు 410 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్‌లను విక్రయించారు. వీటితో పాటు బాచుపల్లి, మేడిపల్లి, తొర్రూరు, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి, తదితర ప్రాంతాల్లోనూ నిర్వహించిన అమ్మకాల ద్వారా ఆదాయాన్ని ఆర్జించింది. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించిన భూముల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.5వేల కోట్ల మేరకు ఆదాయం లభించినట్లు అంచనా.

కోకాపేట్ హాట్‌కేక్..

నగరానికి పడమట ఉన్న కోకాపేట్ అంతర్జాతీయ హంగులతో దేశవిదేశాలకు చెందిన వ్యాపార దిగ్గజ సంస్థలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరో వైపు రాయదుర్గంను కేవలం 5 కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన ఫార్చ్యూన్ 500 కంపెనీలకు చేరువలో ఉన్న నియోపోలిస్‌లో రెండో దశ భూముల అమ్మకానికి కూడా భారీ స్పందన లభించింది. మొదటి దశ అమ్మకాల్లో ఎకరం గరిష్ఠంగా రూ.60 కోట్ల వరకు ధర పలికింది. ప్రస్తుతం రెండో దశలో ఏకంగా ఎకరం రూ.100.75 కోట్లకు పైగా ధరతో అమ్ముడు కావడం విశేషం. మొత్తం 14 ప్లాట్‌ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 45.33 ఎకరాల భూమిని ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా హెచ్ఎండీఏ విక్రయానికి పెట్టింది. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎన్ని అంతస్తుల వరకైనా హైరైజ్ భవనాలను నిర్మించేందుకు ఈ లేఅవుట్‌లో అనుమతులను ఇచ్చారు.

ఉప్పల్ భగాయత్‌కు భారీ స్పందన...

ఉప్పల్ భగాయత్‌లో 300 నుంచి 950 చదరపు గజాలకుపైగా విస్తీర్ణం కలిగిన ప్లాట్‌లను మూడు దశల్లో విక్రయించారు. మూడు దశల్లో సుమారు రూ.1500 కోట్లకు పైగా ఆదాయం లభించినట్లు అంచనా. అలాగే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉన్న తొర్రూరు, బాచుపల్లి, బహదూర్‌పల్లి, మేడిపల్లి, తదితర ప్రాంతాల్లో ప్లాట్‌లను విక్రయించారు. నగరవాసులతో పాటు ఎన్నారైలు సైతం ఈ ప్లాట్‌లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. మరోవైపు హెచ్ఎండీఏకు ఉన్న సొంత భూముల్లోనే కాకుండా రైతులనుంచి కూడా పెద్ద ఎత్తున భూముల సేకరణ చేపట్టింది. వీటిలో బహుళ వినియోగ ప్లాట్‌లను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనున్నారు. ఇన్ముల్‌నెర్వలోని 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాల భూములలో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. మిగతా చోట్ల కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, బోగారంలో 125, ప్రతాప్‌సింగారంలో సుమారు 153 ఎకరాలు, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 924 ఎకరాలకు పైగా భూములను గుర్తించారు. రైతులు అంగీకరిస్తే త్వరలో అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు.

త్వరలో మరిన్ని భూముల వేలం..

బోడుప్పల్‌లో మరో 50 ప్లాట్‌లకు ఈ నెలలో ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసేందుకు అనుకూలంగా ఈ ప్లాట్‌లు 266.67 నుంచి 300 గజాల వరకు విస్తరించి ఉన్నాయి. మోకిల్లలో 1321 ప్లాట్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 50 ప్లాట్‌లను విక్రయానికి సిద్ధం చేశారు. షాబాద్‌లో మరో 877 ప్లాట్‌లను విక్రయించనున్నారు. బుద్వేల్‌లో మరో 50 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ భూముల విక్రయం ద్వారా హెచ్ఎండీఏకు రూ.వందల కోట్ల ఆదాయం లభించనుంది.

ఫోకల్‌కు 'లెటర్'.. లూప్‌నకు 'కవర్'

- హాట్ కేకుల్లా అమ్ముడైన పోలీసు పోస్టులు
- స్థానిక రాజకీయ నేతల సిఫారసు
- అప్రాధాన్యమైన వాటికీ లెక్కకట్టిన కొందరు అధికారులు
- ఆశించిన ఆమ్యామ్యాలు ముట్టజెబితేనే ఉత్తర్వులు

బది 'లీలలు' ఎన్నో..!

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సంఘం మార్గదర్శకాలు.. ఒకే పోస్టులో సుదీర్ఘకాలం విధుల నిర్వహణ.. ఇబ్బడిముబ్బడిగా ఇచ్చిన పదోన్నతులు.. వెరసీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో పోలీసు అధికారుల బదిలీలు చోటుచేసుకున్నాయి. దాదాపు పక్షం రోజులుగా వరుసపెట్టి ఉత్తర్వులు వస్తూనే ఉన్నాయి. ఫోకల్ పోస్టులకు రాజకీయ నాయకులు ఇచ్చిన లెటర్ల ఆధారంగా, లూప్ లైన్‌గా పిలిచే నాన్ ఫోకల్ వాటిని కొందరు అధికారులు నిర్దేశించిన 'కవర్ల' ఆధారంగా ఉత్తర్వులు ఇచ్చారు. డీఎస్పీ ఆపై స్థాయి పోస్టుల్లో భారీ స్థాయిలో బేరసారాలు, లావాదేవీలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి.



ఫిఫ్టీ.. ఫిఫ్టీ విధానంలో..

- సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈసారి స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఉండే ఎస్సై పోస్టుల నుంచి నాన్- కేడర్ ఎస్పీల వరకు అన్నింటిలోనూ రాజకీయ నాయకుల ప్రమేయం అనివార్యంగా మారింది. సదరు అధికారి సమర్థత ఆధారంగా కాకుండా ఆయనకు ఎక్కడ పోస్టింగ్ కావాలో అక్కడి రాజకీయ నాయకులు ఇచ్చే సిఫారసుల ఆధారంగా పోస్టింగ్ లభించింది. ఫోకల్ పోస్టులుగా పిలిచే శాంతిభద్రతల విభాగంతో పాటు మరికొన్ని కీలక వింగ్స్‌లో ఇదే పరిస్థితి నెలకొంది.
- సిఫారసు లేఖలు ఇవ్వడంలోనూ స్థానిక నేతలు తొలినాళ్లల్లో తమ సామాజిక వర్గాలకు చెందిన వారికి పెద్దపీట వేశారు. ఇది వివాదాస్పదంగా మారి విషయం 'పై వరకు' వెళ్లడంతో పంథా మార్చారు. తమ పరిధిలోని సగం పోస్టులు తమ సామాజిక వర్గానికి చెందిన వారికి, మిగిలిన సగం ఇతర వర్గాలకు చెందిన వారికి సిఫారసు చేస్తూ లేఖలు ఇచ్చారు. ఉన్నతాధికారుల్లో అనేక మంది సదరు అధికారి సర్వీస్ రికార్డు కన్నా ఈ లేఖలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాల్సి వచ్చింది.

రేటు కట్టిన కొందరు అధికారులు..

- ఫోకల్ పోస్టుల విషయం ఇలా ఉండగా.. ఏమాత్రం ప్రాధాన్యం లేని విభాగాలకూ ఈసారి భారీ డిమాండ్ వచ్చింది. ఒకేసారి వందల మంది అధికారులకు పదోన్నతులు రావడంతో 'పోటీ'ని తట్టుకుని ఫోకల్ పోస్టు సంపాదించలేమని, ఎక్కడో ఒకచోట సీటు దొరికితే చాలన్న భావన అనేక మందిలో నెలకొంది. అలా కాకుండా వెయిటింగ్‌లోనో, చీఫ్ ఆఫీస్‌లోనో ఉండిపోయితే పరిస్థితి వర్ణనాతీతంగా మారుతుందనే భయం ఆ అధికారులకు పట్టుకుంది.
- వీరికి జీతం, వాహనం, కార్యాలయం వీటిలో ఏవీ ఉండవు. గణేష్ ఉత్సవాలు సహా అనేక బందోబస్తులు, సాధారణ ఎన్నికలు వరుసగా వస్తుండటంతో వెయిటింగ్‌లో, చీఫ్ ఆఫీస్‌లో ఉన్న వారికి అన్ని డ్యూటీలకూ అడ్డంగా వాడేస్తారు. ఎలాంటి సదుపాయాలు లేకుండా తమ సొంత ఖర్చులతో ఈ విధులన్నీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అనేక మంది అధికారులు ఈసారి లూప్‌లైన్ల కోసమూ పోటీపడ్డారు. దీన్ని క్యాష్ చేసుకోవడం ప్రారంభించిన కొందరు ఉన్నతాధికారులు లూప్ లైన్లకూ రేటు కట్టి మరీ వసూలు చేశారు.

రబ్బర్ స్టాంప్‌గా ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డ్...

- ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పోలీసు, రెవెన్యూ సహా రాష్ట్రంలో కీలక విభాగాల్లో బదిలీల ప్రక్రియ గత నెల 31తో ముగియాలి. ఈ గడువు దాటితే ఒక్కరిని బదిలీ చేయాలన్నా ప్రత్యేకంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. అది సాధ్యమయ్యే పని కాదని చెబుతూ వసూళ్లకు తెర లేపినట్లు తెలుస్తోంది. వాస్తవానికి పోలీసు విభాగంలో కీలక పోస్టుల్లో బదిలీల్లో పారదర్శకత కోసం ప్రకాష్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేశారు.
- ప్రతి ట్రాన్స్‌ఫర్ ఈ బోర్డు సిఫారసుల ఆధారంగానే జరగాలి. అధికారులు జారీ చేసే బదిలీ ఉత్తర్వుల్లో అదే జరిగినట్లూ చూపిస్తుంటారు. కానీ.. వాస్తవం మరోలా ఉంటోంది. పైరవీలు, సిఫార్సులు, బేరసారాల ఆధారంగా అప్పటికే రూపొందిన జాబితాలకు ఈ బోర్డు కేవలం ఆమోదముద్ర వేస్తోంది. ఇలా నామ్‌కే వాస్తేగా మారిన ఎస్టాబ్లిష్‌మెంట్ రబ్బర్ స్టాంపులా మారిందనే విమర్శలూ ఉన్నాయి. ఈ కారణంగానే రాజకీయ నాయకులు, కొందరు ఉన్నతాధికారుల మాటే అంతిమం అవుతోంది.

మూసీ.. వరదకు మెరిసి!



ఇటీవల భారీ వర్షాలకు తగ్గిన కాలుష్యం

- నదీ తీర ప్రాంతాల్లో కొట్టుకుపోయిన వ్యర్థాలు
- శివారుల్లో పరిమిత స్థాయిలోనే బీఓడీ, డీఓ మోతాదులు
- 12 ప్రాంతాల్లో నీటి నాణ్యతను పరిశీలించిన పీసీబీ

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయిలో అత్యంత కాలుష్యకారక నదుల జాబితాలో చేరిన మూసీ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కాసింత తేరుకుంది. ఎగువ ప్రాంతం, జంట జలాశయాల నుంచి వరద నీటిని వదలడంతో మూసీలోని వ్యర్థాలు వరదల్లో కొట్టుకుపోయాయి. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వం తలచుకున్నా వదలని దుర్గంధం కుండపోత వర్షాలకు కనుమరుగైంది. ఫలితంగా మూసీ కొత్త రూపును సంతరించుకుంది.

12 చోట్ల నమూనాల సేకరణ

వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో జన్మించిన మూసీ.. నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తోంది. నది పొడవునా 12 చోట్ల కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) శాస్త్రవేత్తలు నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించారు. ప్రధానంగా అనంతగిరి నుంచి గ్రేటర్ హైదరాబాద్‌కు వంద కిలో మీటర్ల వరకు నదిలో కాలుష్యం అంతగా నమోదు కానట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నదిలో వృక్ష, జంతు ప్లవకాలు, ఆవరణ వ్యవస్థ పరిరక్షణకు నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీఓ) మోతాదు లీటరు నీటిలో 4 మిల్లీగ్రాముల కంటే అధికంగా, బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) 3 మిల్లీగ్రాములకు మించరాదు. వర్షాకాలంలో మూసీలో కాలుష్యం కాస్త తగ్గుముఖం పట్టినా.. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా నమోదవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

సిటీ, శివార్లలో తేడా..

డీఓ, బీఓడీ మోతాదు ప్రధాన నగరంలో, శివారు ప్రాంతాలలో మిశ్రమంగా నమోదయింది. బాపూఘాట్, మూసారంబాగ్ బ్రిడ్జి, నాగోల్, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం వరకు మూసీలో బీఓడీ తగిన మోతాదులో లేవని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శివారు ప్రాంతాలైన గండిపేట, రుద్రవెల్లి, వలిగొండ బ్రిడ్జి, సోలిపేట, భీమారం బ్రిడ్జి, కృష్ణా నదిలో కలిసే వాడపల్లి వద్ద ఈ మోతాదులు పరిమిత స్థాయిలోనే ఉండటం గమనార్హం. గ్రేటర్‌లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక, బల్క్ డ్రగ్, ఫార్మా వ్యర్థాలు, జలాలు మూసీలోకి చేరడమే ఈ పరిస్థితికి కారణమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు.

పార్లర్.. పారాహుషార్

నగరంలో బ్యూటీపార్లర్ నిర్లక్ష్యం

- జుట్టును కోల్పోయిన ఓ మహిళ

సాక్షి, సిటీబ్యూరో: కొందరు బ్యూటీపార్లర్ల అవగాహనా లోపం, అనధికారిక లేపనాల వినియోగం నగర వాసులను తీవ్ర సమస్యల్లోకి నెట్టేస్తోంది. కొందరికి ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుండగా అందంగా మారాలని కోరుకుంటున్న మరికొందరిని అనాకారిగా మార్చేస్తోంది. నగరంలోని అబిడ్స్ ప్రాంతంలో గురువారం ఓ పార్లర్ నిర్వాకం దీనికి అద్దం పట్టింది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా అయింది ఆ మహిళ పరిస్థితి. తన భర్త కోరిక మేరకు మరింత అందంగా, మోడల్‌లా మారాలని బ్యూటీపార్లర్‌కు వెళ్లిన ఆమె ఉన్న జుట్టునూ సైతం పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె జుట్టుకు బ్యుటీషియన్ ఏదో ఆయిల్ అప్లై చేసింది. అనంతరం హెయిర్ కట్ చేయడం ప్రారంభించగా.. జుట్టు దానంతట అదే విపరీతంగా ఊడిపోవడం ప్రారంభమైంది. తలపై ఉన్న జుట్టు రాలిపోతుండడంతో ఆ మహిళ తీవ్రమైన షాక్‌కు గురైంది.

అనధికారిక ఉత్పత్తులు.. అవగాహన లేని సిబ్బంది..



- నగరంలోని పలు పార్లర్లలో సరైన శిక్షణ లేని సిబ్బందిని నియమించుకుంటున్నారు. దీనిపై ఎటువంటి నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో పార్లర్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. లాభాల కోసం ఊరూ పేరూ లేని బ్రాండ్లకు చెందిన ఆయిల్స్, క్రీమ్స్, పౌడర్స్ వీరు వినియోగిస్తున్నారు. గత కొంత కాలంగా అనేక మంది పార్లర్ల ద్వారా వీటి వల్ల కష్టనష్టాలు చవిచూసినప్పటికీ వెలుగు చూస్తున్నవి చాలా తక్కువే.
- గతంలో ఒక పార్లర్‌లో హెడ్ వాష్ చేయించుకున్న ఓ మహిళ ఏకంగా స్ట్రోక్‌కి గురవ్వడం దీనికి కారణం అక్కడి సిబ్బంది ఆ మహిళ మెడ సరాన్ని నిర్లక్ష్యంగా వత్తడమేనని కూడా వెల్లడైంది. అదే విధంగా పలువురికి ముఖ వర్చస్సు మారిపోవడం, దద్దుర్లు, రాషెస్, అలర్జీలు రావడం సాధారణంగా మారింది. వారిలో అత్యధికులు తమలో తాము కుమిలిపోవడం తప్ప పెద్దగా బయటకు రావడం, ఘర్షణకు దిగడం లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు వెలుగు చూడడం లేదు. ఇది పార్లర్ల నిర్వాహకులకు మరింత ఊతంగా మారింది.

బ్యూటీపార్లర్‌పై కేసు నమోదు

గన్‌ఫౌండ్రీ: హెయిర్ కట్టింగ్ కోసం వెళ్లిన ఓ మహిళ జుట్టు బ్యూటీషియన్ నిర్వాకంతో ఊడిపోయిన ఘటన గురువారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అబిడ్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్‌కు చెందిన సీజ్ (35) హెయిర్ కటింగ్ కోసం అబిడ్స్‌లోని న్యూక్వీన్ బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. బ్యూటీషియన్ ఆయిల్‌ను ఆమె తలకు వాడటంతో జుట్టు పూర్తిగా రాలిపోయింది.. దీంతో పార్లర్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు సీజ్ మాట్లాడుతూ.. పార్లర్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే తన జుట్టు ఊడిపోయిందని ఆరోపించారు. సదరు పార్లర్‌ను సీజ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జాగ్రత్తలు అవసరం..



హెయిర్ ఫాల్‌కి రీజన్ కనుక్కోవాలి. నూనెలవీ ఏది పడితే అది వాడకూడదు. లైసెన్స్ ఉందా లేదా? క్వాలిటీ కంట్రోల్ ఉందా లేదా ఫ్లేవర్ ఒకటి మాత్రమే యాడ్ చేస్తున్నారా లేదా? నిర్దిష్ట ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా? పార్లర్‌లోని సిబ్బంది క్వాలిఫైడ్ అవునా కాదా? అని చూడాలి. పార్లర్స్ వాళ్లు వాడే ఆయిల్స్ సరైనవి వాడుతున్నారా లేదా అని తనిఖీ చేసుకోవాలి. ఆయిల్స్ ఏవీ కూడా మన వాతావరణం రీత్యా అవసరం లేదు. ఆయిల్ మసాజ్ వల్ల కొంత లాభం ఉండొచ్చు తప్ప ఇతరత్రా జుట్టుకు ఆయిల్‌తో పనేమీ లేదు. అంతేకాకుండా కొన్ని లేపనాలు కొందరి చర్మానికి నప్పనివి ఉంటాయి. వాటిలోని కెమికల్స్ వల్ల తీవ్రమైన వ్యతిరేక రియాక్షన్స్ వస్తాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ పద్మావతి, డెర్మటాలజిస్ట్

అవయవదానంపై అవగాహన పెరగాలి



అవయవదాతల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తలసాని, మహమూద్ అలీ

గన్‌ఫౌండ్రీ: అవయవదానం ఎంతో గొప్పదని అవయవదానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో జీవన్‌దాన్ సంస్థ ఆధ్వర్యంలో 13వ జాతీయ అవయవదాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదాతల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... అవయవాలను దానం చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది పునర్జన్మ పొందారన్నారు. రక్త సంబంధీకులు మన మధ్య లేకపోయినా మరొకరి రూపంలో మన మధ్యలోనే ఉంటారన్నారు. నుదిటి రాతను సైతం మార్చి ప్రాణాలను నిలిపిన బ్రహ్మలని కొనియాడారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవదానాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అత్యధిక అవయవదానాలు జరిగిన రాష్ట్రంగా తెలంగాణ ఘనతను కేంద్రప్రభుత్వం గుర్తించిందని ఢిల్లీలో జరిగిన జాతీయ అవయవదాన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రథమ బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతోనే ఇది సాధ్యమైందన్నారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ప్రాథమిక దశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పలువురు కుటుంబ సభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు దానం నాగేందర్, శాసనమండలి సభ్యులు సురభి వాణీదేవి, ఎంఎస్ ప్రభాకర్, తెలంగాణ వైద్య మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జీవన్‌దాన్ సంస్థ సభ్యులు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడికి కాలేయ మార్పిడి

ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల ఘనత


బాలుడికి కేక్ తినిపిస్తున్న డాక్టర్ నాగేందర్


పూర్తిగా కోలుకున్న తండ్రి, కొడుకులు చెన్నయ్య సాయిప్రణీత్

అఫ్జల్‌గంజ్: అవయవదానంపై చాలా మందికి అపోహలు ఉన్నాయని అవి సరికావని, జీవన్మృతుల్లో ఒకరి నుంచి 9 అవయవాల ద్వారా ఇతరులకు ప్రాణదానం చేయవచ్చని, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ అన్నారు. జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఆరేళ్ల బాలుడికి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు చేసిన కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స వివరాలను వెల్లడించారు. కుల్కచర్ల మండలం, చెల్లాపూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య, యశోద దంపతుల కుమారుడు సాయిప్రణీత్ (6) రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యుల సూచనల మేరకు నిలోఫర్ ఆస్పత్రికి వెళ్లగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత అక్కడి వైద్యుల సూచన మేరకు నెల రోజుల క్రితం ఉస్మానియా ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్యుల బృందం బాలుడికి కాలేయం దెబ్బతిన్నట్లు గుర్తించి, కాలేయ మార్పిడి అవసరమని నిర్ధారించారు. కుమారుడి కోసం కాలేయం ఇచ్చేందుకు తండ్రి ముందుకు రావడంతో అతడి నుంచి 250 గ్రాముల కాలేయాన్ని సేకరించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, నిలోఫర్ వైద్యులు, నెఫ్రాలజీ, అనస్థీషియా తదితర విభాగాల సమన్వయంతో దాదాపు 20 గంటల పాటు శ్రమించి బాలుడికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. తండ్రీ, కొడుకు పూర్తిగా కోలుకోవడంతో గురువారం వారిని డిశ్చార్జి చేశారు. నగరంలో ఎక్కడా చిన్నపిల్లలకు కాలేయ మార్పిడి చేసే సౌలభ్యం లేదని, ఉస్మానియాలోని అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన వైద్యుల సయన్వయంతోనే ఇది సాధ్యమయిందన్నారు. కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలకు సాధారణంగా 20 యునిట్ల రక్తం అవసరమతుందని, కానీ ఈ బాలుడికి ఎక్కువ రక్తం అవసరం లేకుండానే విజయవంతంగా కాలేయ మార్పిడి చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్, పాండూ నాయక్, పావనీ, మనీషా సహాయ్, ఆర్ఎంవో డాక్టర్లు శేషాద్రి, సాయిశోభా, ఎండీ రఫీ, విజయ్ భాస్కర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్ అవయవ దాతలు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని.. యువకుడి ఆత్మహత్య


సుర్క రాఘవేందర్ (ఫైల్)

చిక్కడపల్లి: బీటెక్ పూర్తి చేసి ఏడాది గడిచినా ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, కొత్తపల్లి గ్రామానికి చెందిన రాములు కుమారుడు సూర్య రాఘవేందర్(23) మూడేళ్లుగా తన తమ్ముడితో సహా స్థానిక వెంకటేశ్వర ఆలయ సమీపంలోని గదిలో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది బీటెక్ పూర్తి చేసిన రాఘవేందర్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అతడి సోదరుడు కాలేజీకి వెళ్లడంతో గదిలో ఒంటరిగా ఉన్న రాఘవేందర్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువు పూర్తయి ఏడాది గడిచినా ఉద్యోగం రాలేదని మనస్తాపంతోనే అతను ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిలయన్స్ పేరుతో ఫేక్ లెటర్

- రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులుగా చెప్పుకుంటూ విద్యాశాఖకు లేఖ
- కాలేజీల్లో వసతులు కల్పిస్తామని హామీ
- ప్రతిపాదనలు పంపాలని కోరిన విద్యాశాఖ కార్యదర్శి
- ఫేక్ లెటర్‌గా గుర్తించి సీసీఎస్‌లో ఫిర్యాదు, కేసు నమోదు

హిమాయత్‌నగర్: ప్రముఖ వ్యాపార వేత్త ముఖేష్ అంబానీకి చెందిన 'రిలయన్స్ ఫౌండేషన్' పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫేక్ లెటర్లు సర్క్యులేట్ అవుతున్నాయి. ఫౌండేషన్ ప్రతినిధులుగా చెప్పుకుంటున్న సుబ్బారావు, గౌతమ్‌రెడ్డి అనే వ్యక్తులు విద్యాలయాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని ఏపీ, తెలంగాణలోని విద్యాశాఖ అధికారులను కలిసి లేఖలు అందజేస్తున్నారు. వారి మాటలు నిజమని నమ్మిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో అవసరమైన వసతులపై వివరాలు వెల్లడించాలని సంబంధిత అధికారులనుఏ ఆదేశించారు. ఈ విషయం కాస్తా 'రిలయన్స్ ఫౌండేషన్'కు చేరడంతో అసలు రంగు బయటపడింది. అలాంటి వ్యక్తులు ఎవరూ తమ సంస్థలో పనిచేయడం లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఫౌండేషన్ ప్రతినిధి సచిన్ యశ్వంత్ గురువారం హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

– విద్యాశాఖ కార్యదర్శినే నమ్మించారు

'రిలయన్స్ ఫౌండేషన్' దేశవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు కాలేజీల్లో విద్యా, వైద్యం, క్రీడలు, మహిళా సాధికారత, ఆర్ట్స్, కల్చర్, హెరిటేజ్ అండ్ అర్బన్ రిలేటెడ్ ప్రాజెక్టులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని సుబ్బారావు, గౌతమ్ రెడ్డి అనే వ్యక్తులు 'రిలయన్స్' ఫౌండేషన్ పేరుతో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ సీఈఓ జయప్రద, డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మారెడ్డిలను సంప్రదించారు. సంస్థ సీఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఎలిజబెత్ సంతకాలను ఫోర్జరీ చేసిన లెటర్లను వారికి అందజేశారు. సదరు అధికారులు ఆయా లేఖలను విద్యాశాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు పంపారు. దీంతో ఆయన రాష్ట్రంలోని 280 కాలేజీల్లో అవసరమైన వసతులపై నివేదికలు అందజేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు.

బయటపడింది ఇలా..

మా రాష్ట్రంలో మీ ఫౌండేషన్ ద్వారా చేపట్టబోతున్న సేవలకు అభినందనలు తెలుపుతూ, కాలేజీల వారీగా అవసరమైన వసతులపై విద్యాశాఖ అధికారులు ముంబైలోని రిలయన్స్ ఫౌండేషన్‌కు లేఖ రాశారు. ఈ లెటర్‌ను చూసిన నివ్వెర పోయిన రిలయన్స్ అధికారులు తాము ఇలా ఎవరికీ ఏదీ చేస్తామని చెప్పలేదని తేల్చి చెప్పింది. దీనిపై అప్రమత్తమైన రిలయన్స్ ఐటీ సిబ్బంది లెటర్‌ను పరిశీలించగా.. ఇంగ్లీష్ లెటర్స్‌లోని 'రిలయన్స్'లో వచ్చే 'సీ' లెటర్‌ను తొలగించి 'ఎస్' లెటర్‌తో లేఖను రూపొందించి ఇటు విద్యాశాఖను, ప్రభుత్వాన్ని, ప్రజల్ని మోసం చేస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఏపీలో ఇద్దరిని అరెస్టు చేయగా..సీసీఎస్ పోసులు సుబ్బారావు, గౌతమ్ రెడ్డిల కోసం గాలిస్తున్నారు. కొంతకాలంగా వారు తమ ఫౌండేషన్‌లో సభ్యులుగా చేర్చుతామని అమాయకులను మోసం చేస్తున్నట్లు గుర్తించామని ఫౌండేషన్ ప్రతినిధి సచిన్ యశ్వంత్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభినందనలు


ఇటీవల బాధ్యతలు చేపట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేను గురువారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన న్యాయ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు బోధ లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రమణరావు తదితరులు. - సాక్షి, సిటీ బ్యూరో

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

ఉప్పల్: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, చీమకుర్తి గ్రామానికి చెందిన వెంకూరి విజయ లక్ష్మి కుమార్తె సంధ్యారాణి(29)కి ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్ ప్రాంతానికి చెందిన హనుమాల ప్రవీణ్‌కుమార్‌తో 2022లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో భారీగా కట్న కానుకలు ముట్టజెప్పారు. అయితే ప్రతి రోజు అదనపు కట్నం కోసం అత్త, మామ, ఆడపడచు ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి లోనైన సంధ్యారాణి గురువారం ఉదయం గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కుమార్తె ఆత్మహత్యకు ఆమె భర్త, అత్తింటి వారి వేధింపులే కారణమని ఆరోపిస్తూ ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుప్రతికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ కిడ్నాప్ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మతిస్థిమితం లేని మహిళను అపహరించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ గురువారం ఎల్బీనగర్‌లోని నాల్గో అదనపు సీనియర్ చెప్పారు. ఏపీపీ శోభారాణి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వావిలాల రవీందర్ రెడ్డి అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. 2019 జులై 5 రాత్రి అతను ఓ మతిస్థిమితం లేని మహిళను తన లారీలో ఎక్కించుకుని పరారయ్యాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ విద్యార్థి దీనిని గుర్తించి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నా మర్నాడు నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం అతడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. నిందితుడికి శిక్ష ఏసీపీ జానకి రెడ్డి తదితరులు అభినందించారు.

లొకేషన్‌కు రప్పించి దోచేశారు..

బంజారాహిల్స్: గే యాప్‌లో ఛాటింగ్ చేస్తుండగా హాయ్.. హాయ్.. అంటూ పలకరించుకున్నారు.. కొద్దిసేపటి లోనే ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. మా ఇంటికి రావాలంటూ అవతలి వ్యక్తి ఆహ్వానం మేరకు వెళ్లిన యువకుడిని కత్తితో బెదిరించి బ్రాస్లెట్‌తో పాటు నగదు లాక్కున్న సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్-12 ప్రాంతానికి చెందిన యువకుడు(23) ఈ నెల 1న తన గే లకు సంబంధించి గ్లెండర్ యాప్‌లో చాటింగ్ చేస్తుండగా అవతలి వైపు నుంచి అఫ్రిది అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కాసేపు చాటింగ్ చేసుకున్న తరువాత తన గదికి రావాలంటూ అఫ్రిది లొకేషన్ పంపాడు. దీంతో సదరు యువకుడు అఫ్రిది గదికి వెళ్లగా కత్తి చూపించి న్యూడ్ వీడియోలు, ఫొటోలు తీశాడు. బలవంతంగా అతడి చేతికి ఉన్న బ్రాస్లెట్‌తో పాటు గొలుసు, రూ. 2వేల నగదు, డెబిట్, క్రెడిట్ కార్డులు లాక్కున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరించాడు. అతడి భారి నుంచి తప్పించుకుని బయటపడిన బాధితుడు పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు అఫ్రిదిని రౌడీషీటర్‌గా గుర్తించారు.

అదే తరహాలో మరో యువకుడిని..

నిందితుడు అఫ్రిది ఇదే తరహాలో మరో యువకుడిని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 భోళానగర్‌లోని తన గదికి రప్పించాడు. అనంతరం కత్తితో బెదిరించి దుస్తులు విప్పించి నగ్న దృశ్యాలు వీడియో తీయించాడు. వీడియోలు ఎందుకు తీస్తున్నావంటూ నిలదీయగా అతడిపై దాడి చేయడమే కాకుండా తన స్నేహితుడు హరున్‌తో కలిసి దాడి చేసి రూ. 7వేల నగదు, బంగారు ఉంగరం లాక్కున్నాడు. ఫోన్ పే ద్వారా రూ. 20 వేలు మహ్మద్ ఉమర్ మొయినుద్దీన్ ఖాతాకు బదిలీ చేయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల పేరుతో పుట్టి ముంచేశారు

- 'కార్డిసెప్స్' పుట్టగొడుగుల పేరుతో లూటీ
- రూ.1.73 కోట్లు పెట్టుబడి పెట్టించి కాజేసిన వైనం
- సీసీఎస్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హిమాయత్‌నగర్: పలు దేశాల్లో డిమాండ్ ఉన్న 'కార్డిసెప్స్ పుట్టగొడుగుల' పేరుతో ఇద్దరు వ్యక్తులు భారీ ఎత్తున లూటీ చేశారు. వీటిలో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో కోట్లు సంపాదించవచ్చునని ఎర వేశారు. తాను పెట్టిన పెట్టుబడికి వచ్చిన లాభాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ దక్షిణా మూర్తి అనే వ్యక్తి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి చెందిన పార్టనర్స్ మెట్ల సాయిపవన్ కుమార్, స్నిగ్ధప్రియ దక్షిణమూర్తిని సంప్రదించి, తాము 'కార్డిసెప్స్ పుట్టగొడుగుల వ్యాపారం చేస్తున్నామని, దీనిని మరింతగా ఎస్టాబ్లిష్ చేయాలంటే పార్టనర్స్ అవసరమన్నారు. వారి మాటలు నమ్మిన దక్షిణామూర్తి రూ.1.73 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఆరు నెలల్లో రూ.2. 84 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. వాటిని ఇవ్వడం లేదు. డబ్బులు ఆవ్వాలని కోరగా బెదిరింపులకు పాల్పడుతుండటంతో బాధితుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నైజీరియన్ మహిళ కోసం ముమ్మర గాలింపు

ఎండీఎంఏ డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారిగా గుర్తింపు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ఎండీఎంఏ డ్రగ్స్‌తో ఇద్దరు యువకులు పట్టుబడగా మరో వ్యక్తి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పరారీలో వ్యక్తి కోసం ఎస్ఓటీ పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. నిందితులు ఎండీఎంఏ డ్రగ్స్‌ను బెంగళూరులో నివాసముంటున్న ఓ నైజీరియన్ మహిళ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.మాదక ద్రవ్యాలను సదరు నైజీరియన్ మహిళ ఎక్కడి నుంచి తీసుకువచ్చి వారికి విక్రయిస్తుందనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. ఈ రాకెట్‌లో ఎవరెవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. సదరు మహిళను పట్టుకునేందుకు పోలీసులు ప్రస్తుతం బెంగళూరు నగరంలో గాలిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారనంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

◆ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెజిస్టిక్ మ్యాన్షన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వనమాల రెసిడెన్సీ, ట్రాన్సీ హోటల్ 11 కేవీ ఫీడర్లు, ప్రకాశ్‌నగర్, ఆల్వీన్‌కాలనీ, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఎరుకుల బస్తీ, మెజిస్టిక్ మ్యాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ ఎదురు గల్లీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, డీఎస్‌ఎం కాలనీ, అశోక్ కాలనీ, ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏరియా, జెక్ కాలనీలోని కొన్ని ఏరియాలు, ఉమానగర్, వామన్‌నాయక్ లైన్, చిన్మయ స్కూల్, ట్రాన్సిస్ట్ హాస్టల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

◆ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంజారానగర్, సీతారామయ్య టవర్స్ 11కేవీ ఫీడర్లు బోరబండ, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలోని బంజారానగర్, ఎస్ఆర్ టీనగర్, వినాయకరావునగర్, శివాజీనగర్, ఆర్‌కె నగర్, ఓల్డ్ అండ్ న్యూ శాస్త్రినగర్, పీ.ఆర్. నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్ ఇండస్ట్రియల్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

◆ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంజినీర్స్ కాలనీ 11కేవీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌బీఐ క్వార్టర్స్, హనుమాన్ టెంపుల్, కేకే టవర్స్, ఇంజినీర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ వెల్లడించారు.

◆ విశ్వభారతి 11కేవీ ఫీడర్ కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ, మధురానగర్ బి-బ్లాక్, విశ్వభారతి స్కూల్ ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. కమాండెంట్ 11కేవీ ఫీడర్ శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలీస్ లైన్స్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఇక్రిశాట్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. హైలాంకాలనీ 11కేవీ ఫీడర్ యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలోని హైలాంకాలనీ, గాయత్రీహిల్స్ మసీదు ఏరియా, స్రవంతినగర్ ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక రేపు

బంజారాహిల్స్: గ్రీన్ ల్యాండ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 5న (శనివారం) నిర్వహించనున్నట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌కుమార్ తెలిపారు. గ్రీన్‌లాండ్ డివిజన్ కార్యాలయం కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, కరెంటు బిల్లుల్లో హెచ్చుతగ్గులు, సరఫరాల్లో ఇబ్బందులను ఇందులో పరిష్కరించుకోవచ్చన్నారు.

6న మహాలక్ష్మికి లక్ష కమలాలతో అర్చన

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య సంఘం డబీర్‌పుర, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సహకారంతో శ్రీ లష్టలక్ష్మి సమేత మహాలక్ష్మి కమల పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సరబు లక్ష్మణ్ గుప్తా తెలిపారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 6వ తేదీన (ఆదివారం) ఉదయం 9 గంటలకు ఖైరతాబాద్‌లోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో అధిక మాసం సందర్భంగా సామూహిక శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి లక్ష కమలం పూలతో అర్చన కార్యక్రమం 121 మంది దంపతులచే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రవణ స్వామి ఆధ్వర్యంలో భాస్కర యోగిచే ప్రవచనం ఉంటుందని వివరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కటకం శివకుమార్ గుప్తా, కోశాధికారి లింగ ప్రకాష్ గుప్తా, దయాకర్ గుప్తా, వెంకటేశ్వర్లు, సత్యం గుప్తా, శ్రీరామ్ గుప్తా, శ్రీనివాస్ రావు, వెంకట గోపాలకృష్ణ, స్వర్ణలత, శ్రీనివాస్, తాడిశెట్టి పశుపతి, తలకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వాతంత్య్ర వేడుకలకు దూరంగా ఉంటాం'

లిబర్టీ: దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవాలకు దూరంగా ఉంటున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. దళితులపై ప్రధానంగా ఇటీవల కాలంలో మణిపూర్ క్రిస్టియన్ సమాజంపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దళితు బహుజనులపై దాడులు, అణచివేత, లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కట్టడి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మణిపూర్‌లో ఆదివాసీ క్రిస్టియన్ మహిళలపై దాడులు చేస్తున్న కేంద్రంలోని మోదీ సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతో నులిపురుగులకు చెక్

- తప్పనిసరిగా మాత్ర వేసుకోవాలి
- తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్ర వేయించాలి
- వేసుకోని వారికి మరోసారి పంపిణీ

నులి పురుగులు అత్యంత ప్రమాదకరమైనవి. ఇవి పొట్టలోకి ఫ్లుగా చేరి చిన్నారులు మొదలు పెద్దవారి వారికీ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే 1 నుంచి 19 ఏళ్ల వయసు వారికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు.




బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమంగా ఏర్పాటుచేసి వీటిని పంపిణీ చేశారు. ఈ మాత్రలను వేసుకున్న వారు తరువాతి రోజుల్లో కూడా వేసుకొనేలా ప్రణాళికలు రూపొందించారు. అపరిశుభ్రత వల్ల ఇది వ్యాప్తి చెందుతుందని, మట్టిలో ఆడుకొనేటప్పుడు నులిపురుగులు చేతుల్లోకి పోతాయని, ఈ విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. చేతులను శుభ్రంగా కడుక్కోపోతే ఇవి పొట్టలోకి చేరి వృద్ధి చెందుతాయన్నారు. వీటి బారిన పడితే బక్కచిక్కిపోవడమే కాకుండా రక్తహీనతతో బాధపడతారని హెచ్చరించారు. నులిపురుగుల నిర్మూలన కోసం అల్బెండజోల్ మాత్ర మింగడానికి తోడు వీటి సంక్రమణ వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలంటే జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

◆ 1–19 ఏళ్ల లోపు వయసున్న లక్షమంది వరకు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, మైనార్టీ విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలకు వెళ్లి ఈ అల్బెండజోల్ మాత్రలను వేస్తున్నారు. 1–2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2–19 ఏళ్ల వయసు వారికి పూర్తి మాత్రను వేశారు.

◆ ఇందుకు సంబంధించి వైద్యారోగ్య శాఖ సిబ్బందికి గత నెలలోనే శిక్షణనిచ్చారు. నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించారు.

◆ వీటి వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తల్లిదండ్రులకు వివరించారు. మాత్ర వేసుకోని వారిని గుర్తించి మరోమారు వేసేలా ప్రణాళికలు రూపొందించారు.

◆ విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్ర పంపిణీ విజయవంతంగా నిర్వహించారు.



కింగ్‌కోఠిలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో...



బోరబండలో అంగన్‌వాడీ విద్యార్థులకు...

కింగ్‌కోఠిలో...

హిమాయత్‌నగర్: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ప్రియాంక మంచాల పిలుపునిచ్చారు. కింగ్‌కోఠిలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లోని విద్యార్థులకు కార్పొరేటర్ మహాలక్ష్మితో కలసి డాక్టర్ దీప్తి ప్రియాంక డీవార్మింగ్ మందులను అందజేశారు. ప్రిన్సిపాల్ రెబక, వై.వి.రెడ్డి, లిడియా, ఏఎన్ఎం జయలక్ష్మి, ఆశ స్వప్న, బీజేపీ నాయకులు రామన్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు...

◆ చేతి గోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి
◆ పరిశుభ్ర నీటిని తాగాలి
◆ ఆహారంపై మూతలు ఉంచాలి
◆ పరిసరాల పరిశుభ్రత పాటించాలి
◆ పండ్లు, కూరగాయాలను శుభ్రమైన నీటితో కడగాలి
◆ భోజనం చేయడానికి ముందు టాయిలెట్‌కు వెళ్లి వచ్చిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
◆ బహిరంగా ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయవద్దు

రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో...

రహమత్‌నగర్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. బోరబండ ఎస్ఆర్‌టీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ షేక్ హసీనా, ఆశావర్కర్ పుష్ప, ఎస్ఆర్‌టీనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొట్టు శివ, బస్తీ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ... నులిపురుగులు ఉన్న పిల్లల్లో ఎదుగుదల ఉండదని, పోషకాహారం లోపం, రక్తహీనత సమస్యలతో బాధపడుతుంటారని తెలిపారు.

బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం

- సీఎం కేసీఆర్ నిర్ణయాలతో ప్రజల్లో హర్షాతిరేకాలు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్




సీఎం చిత్రపటానికి పాలాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు, నాయకులు

ఖైరతాబాద్: దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసి చూపించారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రైతులకు రుణమాఫీ ప్రకటించి రూ. 19 వేల కోట్ల లబ్ధి చేశారని, నగరంలో ఎలాంటి ఆధారం లేకుండా ఉన్న 14 వందలకు పైగా ఉన్న నోటిఫైడ్ స్లమ్స్‌కు ముఖ్యమంత్రి హామీతో మహర్దశ పట్టనుందన్నారు. గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులతో కలిసి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రీ చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలో చేశారన్నారు. అవాకులు, చవాకులు పేలుతున్న బీజేపీ నాయకులు వారు పాలించే రాష్ట్రంలో దిక్కుదివాణం లేదు కానీ తెలంగాణ రాష్ట్రంకు వచ్చే సరికి అది లేదు ఇది లేదు అంటూ మాట్లాడుతున్నారు. ఆ రాష్ట్రంలో తెలంగాణలో ప్రవేశ పెట్టిన ఒక్క స్కీం ప్రవేశ పెడితే ఆ రాష్ట్రం దివాలా తీస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ 49 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో వారు సంతోషంతో ఉన్నారన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ 415 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ పొడిగించాలని నిర్ణయించడం నగర ప్రజానీకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నగర ప్రజల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రజల్లో సంతోషాన్ని నింపిన బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ప్రజలే హ్యాట్రిక్ విజయం అందిస్తారన్నారు. సంబరాల్లో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్నారాంమూర్తి, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతాయాదవ్, వెంకటేశ్వర డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ డివిజన్‌ల అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న అంజన్‌కుమార్ యాదవ్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డీసీసీ పరిధిలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులను నియమించారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్‌యాదవ్, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా గొల్యాల రాజు, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా కాటూరి రమేష్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడిగా నారికేల నరేష్, ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేష్, హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా నయీమ్ నియమితులయ్యారు. గురువారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ముఖ్య నాయకుడు వినోద్‌రెడ్డి చేతులమీదుగా కొత్త అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు సమీర్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న ఆయుర్వేద కళాశాల విద్యార్థులు

వెంగళరావునగర్: సమస్యల పరిష్కరించాలనే డిమాండ్‌తో ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య విద్యార్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కోర్టు తమపై జాలి చూపినా ప్రభుత్వం మాత్రం కరుణించడం లేదని ఈ సందర్భంగా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నిరోజులైనా తమ సమస్యలు పరిష్కరించనిదే దీక్షలు విరమించేది లేదని, ప్రభుత్వం తక్షణమే దిగి వచ్చి తమకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఆయుర్వేద వైద్య విద్యార్థులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ సందీప్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ సరిత, డాక్టర్ హిమజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని నమ్ముతూ జూబ్లీహిల్స్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం ఎమ్మెల్యే కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ ముఖ్య నాయకులు చిన్నారెడ్డి, డీ.శ్రీనివాస్, హరినాథ్, హరిప్రసాద్, కోటేశ్వర్‌రావు, సాయికుమార్, ప్రదీప్, పవన్, తిరుపతి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, బబ్లూ, శ్యామ్‌నాయుడు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదానం



బంజారాహిల్స్: లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు ఘట్టమనేని జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం బంజారాహిల్స్‌లో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హంగర్ రిలీఫ్ ప్రోగ్రామ్ పేరుతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా 250 మంది పేదలకు ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్ అరుణ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్, రామనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా ఎర్రమంజిల్ రోడ్డు



పంజగుట్ట: ఎర్రమంజిల్ నుంచి రామకృష్ణానగర్ వెళ్లే మార్గం మొత్తం మురుగునీరు, బురదతో నడిచేందుకు అనువుగా లేకుండా తయారైంది. నెలరోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. అడుగు లోతు బురద పేరుకుపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ మార్గం గుండా వెళ్తూ ఇద్దరు వృద్ధులు జారిపడి గాయపడ్డారన్నారు. అసలే వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమలు, ఈగలు వ్యాపించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించి, బురద నీరు నిల్వకుండా చూడాలని కోరారు.

వైభవంగా అతిరుద్రయాగం



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీపంచాయతన పూర్వక శతచండీ సహిత అతిరుద్రయాగం గురువారం కనుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం మహన్యాస పారాయణం, శ్రీరుద్ర పారాయణం, శ్రీచండీ సప్తశతి పారాయణం, శ్రీ పద్మినీభాయోషా సవిత్రు సూర్యనరాయణ నమస్కారాలు, శ్రీ మహాగణాధిపతి చతురావృత్తి తర్పణం, శ్రీ శివపంచాక్షరి జపం, శ్రీ సుబ్రమణ్య జపం, శ్రీ సుదర్శన జపం, శ్రీ రుద్రాభిషేకం, అతిరుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శ్రీ రుద్ర హోమం, శ్రీ చండీ సప్తశతి హవనం, శ్రీరుద్రక్రమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వెల్లికంటి మురళీధర్ శర్మ, శ్రీనివాసశర్మ ఈ యాగాలను టీటీడీ వేద పాఠశాల కోటప్పకొండ ప్రధానధ్యాపకులు మార్తి వెంకటరామశర్మ నేతృత్వంలో నిర్వహించారు. రుద్రయాగంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఎస్.లావణ్య వేడుకలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.



బీఆర్ఎస్ పాలనలో సమాన గౌరవం

రహమత్‌నగర్: బీఆర్ఎస్ పాలనలోనే అన్ని మతాలు, కులాల వారికి సమాన గౌరవం లభిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్ బాబా సైలానినగర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన సందల్ ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పార్టీ డివిజన్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ విజయ్‌కుమార్, మైనారిటీ నాయకుడు తన్వూఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో టిప్పర్ బీభత్సం

పలు వాహనాలు ధ్వంసం



ప్రమాదానికి కారణమైన టిప్పర్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని సుభాష్ చంద్రబోస్‌నగర్ బస్ స్టేషన్ వద్ద అదుపుతప్పిన టిప్పర్ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి ఢీ కొనడంతో ఆటోతో పాటు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. వివరాలివీ... సుభాష్ చంద్రబోస్‌నగర్ సబ్ స్టేషన్ వద్ద ఉన్న మలుపు ప్రాంతంలో బుధవారం రాత్రి ఏపీ 16 డబ్ల్యూ 3916 నంబర్ గల టిప్పర్ జూబ్లీహిల్స్ నుంచి ఎస్పీఆర్‌హిల్స్‌కు లోడుతో వస్తున్నది. ఈ క్రమంలో అదుపుతప్పి ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో, ద్విచక్ర వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మద్యం మత్తులో ఉన్న టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోని తీసుకున్నారు.

కమలాపురికాలనీలో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని కమలాపురి కాలనీ ఫేజ్-1లో గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. నిత్యం సీవరేజీ ఓవర్‌ఫ్లోతో పాటు ఇతర ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జలమండలి డీజీఎం వాహబ్, ఎల్లారెడ్డిగూడ సెక్షన్ మేనేజర్ శ్యాంతో కలిసి లీకవుతున్న సీవరేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. ఇటీవల వర్షాలకు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో, పైపులలో రాళ్లు, మట్టి, బురద, వ్యర్థాలు ఇరుక్కుపోయి మురుగు లీకవుతుందని కాలనీ వాసులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ ఆదేశించారు.

ఆంధ్రాలో యువతి ఆత్మహత్యాయత్నం: తెలంగాణకు కేసు బదిలీ

- దంపతుల మధ్య పబ్జి గేమ్ చిచ్చు
- కూల్‌డ్రింక్‌లో మత్తుమందిచ్చి న్యూడ్ ఫొటోలు
- ఆపై శారీరకంగా కలవాలని యువతికి బెదిరింపు

వెంగళరావునగర్: పబ్జి గేమ్ ద్వారా స్నేహాన్ని పెంచుకున్న యువకుడు ఓ మహిళను శారీరకంగా కలవడమే కాకుండా నగ్న ఫొటోలు అందరికీ పంపుతానని బెదిరించడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆంధ్రాలోని కోనసీమలో చోటు చేసుకుంది. ఈ కేసును తెలంగాణలోని మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు ఆ రాష్ట్ర పోలీసులు బదిలీ చేశారు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రాలోని కోనసీమ జిల్లా గండేపల్లి మండలం పి.వినాయకంపల్లి గ్రామానికి చెందిన జాషువా, ఓ మహిళ, కపిలేశ్వరం మండలం అంగర గ్రామానికి చెందిన వి.నరసింహమూర్తి పబ్జి గేమ్ ద్వారా స్నేహితులయ్యారు. ఆ మహిళ ఇటీవల తన మేనమామ జాషువాను వివాహం చేసుకుంది. వారి వివాహం తర్వాత నరసింహమూర్తి ఆ మహిళను ప్రేమ పేరుతో సందేశాలు పంపాడు. ఈ విషయాన్ని గమనించిన మహిళ భర్త జాషువా ఆమెతో గొడవపడ్డాడు. దాంతో ఆమె ఉద్యోగం చేసుకుంటానని చెప్పి హైదరాబాద్‌లోని బల్కంపేటలో ఉండే తన స్నేహితురాలు నవ్యను కలిసింది. ఇటీవల నవ్య ద్వారా ఆ మహిళ అడ్రస్‌ను తెలుసుకున్న నర్సింహమూర్తి హైదరాబాద్ వచ్చాడు. ఆమె గదిలోనే రెండు రోజులు గడిపాడు. అనంతరం తన స్నేహితురాలు మంచిది కాదని ఆమెను నమ్మించి అమీర్‌పేటలోని సిద్ధి వినాయక హాస్టల్‌కు తరలించి అక్కడే ఇద్దరూ ఉంటున్నారు. ఈ క్రమంలో నిందితుడు నీ భర్తకు విడాకులిస్తే నిన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. జవహర్‌నగర్‌లోని తన మరో గదికి తీసుకెళ్లి కూల్ డ్రింక్‌లో మద్యం కలిపి ఆమె మత్తులో ఉన్నప్పుడు నగ్న ఫొటోలు తీశాడు. తనతో శారీరకంగా కలవకపోతే అందరికీ వాటిని పంపుతానని బెదిరించి లొంగదీసుకున్నాడు. ఆందోళన చెందిన ఆమె ఆంధ్రాకు వచ్చి నిందితుని స్వగ్రామమైన అంగర గ్రామ బస్టాప్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నం చేసింది. ఆమెను చుట్టుపక్కల వారు, బంధువులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం ఈ కేసును నిందితుడు ఉంటున్న హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

అడ్డగింత దిగ్విజయం!

- రాజధానిలోకి పేదలు రాకుండా విజయవంతంగా అడ్డుకున్న చంద్రబాబు అండ్ కో
- ఇళ్ల స్థలాలు మొదలు ఇళ్ల నిర్మాణం వరకు వరుసగా పిటిషన్లు
- ఆర్‌–5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం వద్దన్న హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం
- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సుప్రీంకోర్టులో సవాల్‌ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం


సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఏపీ రాజధానిలో పేదలు ఉండటానికి వీల్లేదంటున్న చంద్రబాబు సహా తెలుగుదేశం పార్టీ పెద్దలు వారి పంతం నెగ్గించుకున్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆర్‌–5 పేరుతో ఓ జోన్‌ను సృష్టించి, ఆ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలకు రాజధాని రైతుల ముసుగులో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోన్న చంద్రబాబు అండ్‌ కో తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. సీఎం జగన్‌.. 50 వేల మందికి పైగా పేద అక్కచెల్లెమ్మలకు అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, వేగంగా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో మరోమారు కోర్టు ద్వారా మోకాలొడ్డారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు రాజధానిలో పేదల ఇళ్ల కోసం మొత్తం భూమిలో 5 శాతం కేటాయించాలని చట్టం తీసుకొచ్చి, దాన్ని తమ స్వప్రయోజనాల కోసం అమలు చేయకుండా తుంగలో తొక్కిన టీడీపీ పెద్దలు.. ఇప్పుడూ పేదలకు తీరని ద్రోహమే చేశారు. రాజధానిలో పేదలు వచ్చి చేరితే అదో పెద్ద మురికి వాడగా మారుతుందని, వారి వల్ల తమ స్థలాలకు రేట్లు పడిపోతాయంటూ పేదలను కించపరుస్తూ తమ న్యాయవాదుల ద్వారా దారుణంగా వాదనలు వినిపించిన టీడీపీ పెద్దలు.. కోర్టుల్లో తమకున్న బలాన్ని మరోసారి రుజువు చేశారు. రాజధానిలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో ప్రభుత్వం చేపట్టబోతున్న ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలంటూ రైతుల ముసుగులో వారు దాఖలు చేయించిన అనుబంధ పిటిషన్లను హైకోర్టు అనుమతించింది. పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా హైకోర్టు స్టే విధించింది. పేదల ఇళ్ల నిర్మాణానికి విస్తృత ప్రజా ప్రయోజనాలు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల ఇళ్ల నిర్మాణానికి అనుమతినివ్వడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఆర్‌–5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణం పూర్తయితే పూడ్చలేని నష్టం జరుగుతుందని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు, జస్టిస్‌ చీకటి మానవేంద్రనాథ్‌ రాయ్, జస్టిస్‌ రవినాథ్‌ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, హైకోర్టు తీర్పుపై నిరుపేదల పక్షాన సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఆద్యంతం సందేహాస్పదం

వివేకా హత్య కేసులో విస్మయం కలిగిస్తున్న సీబీఐ దర్యాప్తు

పలు కీలక కోణాలు విస్మరించిన వైనం

దర్యాప్తు తీరుపై 'ద వైర్‌' విశ్లేషణాత్మక కథనం–2



సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ వైఎస్‌ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తీరు ఆద్యంతం అశాస్త్రీయం, అహేతుకం, అసంబద్ధం, సందేహాస్పదంగా ఉందని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్‌ 'ద వైర్‌' కుండబద్దలు కొట్టింది. రాజకీయ కారణాలతోనే హత్య జరిగిందని చెబుతున్న సీబీఐ.. కీలకమైన ఆస్తి వివాదం కోణాన్ని విస్మరించడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. వివేకా హత్య అనంతరం ఆయన నివాసంలో నిందితులు ఆస్తి పత్రాల కోసం వెతికారన్నది స్పష్టమవుతున్నా, ఆ కోణంలో ఎందుకు దర్యాప్తు చేయడం లేదని ప్రశ్నించింది. నార్కో ఎనాలిసిస్‌ పరీక్షల్లో కూడా ఏమీ చెప్పని వాచ్‌మెన్‌ రంగన్నకు రెండున్నరేళ్ల తర్వాత అంతా గుర్తుకు వచ్చినట్టు సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడంపై సందేహాలు వ్యక్తం చేసింది. ఇక కీలక ఆధారంగా గొప్పగా ప్రకటించిన గూగుల్‌ టేక్‌ అవుట్‌ డాటా పూర్తిగా తప్పని స్వయంగా సీబీఐనే ప్రకటించడాన్ని 'ద వైర్‌' ప్రధానంగా ప్రస్తావించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్‌ సరితా రాణి రాసిన రెండు విశ్లేషణాత్మక కథనాలను 'ద వైర్‌' వెబ్‌సైట్‌ ప్రముఖంగా ప్రచురించింది. మొదటి కథంలో సీబీఐ దర్యాప్తులో డొల్లతనాన్ని బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రచురించిన రెండో కథనంలో మరింత లోతుగా విశ్లేషించి సీబీఐ దర్యాప్తు తీరును ఎండగట్టింది. సీబీఐ ప్రస్తావించిన ఐపీడీఆర్‌ డేటా కూడా హేతుబద్ధ ఆధారం కాదని తేల్చి చెప్పింది. దర్యాప్తునకు ఆధారంగా చెబుతూ సాక్షుల వాంగ్మూలాల పేరిట సీబీఐ చెబుతోంది కట్టు కథలేనని స్పష్టం చేసింది. ఏకంగా 14 మంది సాక్షులు సీబీఐ తీరును తప్పుబట్టడం.. ఏకంగా రిటైర్డ్‌ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం సీబీఐపైనే న్యాయస్థానంలో పిటిషన్‌ దాఖలు చేయడాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. ఏ కోణంలో చూసినా సరే వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ దారి తప్పిందనే విషయాన్ని స్పష్టం చేసింది. 'ద వైర్‌' వెబ్‌సైట్‌ రెండవ కథనంలోని ప్రధాన అంశాలు ఇలా..

వివేకాను చివరిగా ఎవరు చూశారు?

వాచ్‌మెన్‌ రంగన్న ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం 2019 మార్చి 14 రాత్రి 12 గంటల సమయంలో వివేకా తన నివాసం నుంచి బయటకు వచ్చి సిగరెట్‌ తాగడం రంగన్న చూశాడు. నిందితులు కాకుండా వివేకా జీవించి ఉండగా చివరిసారిగా చూసిన వ్యక్తి రంగన్న. పోలీసు దర్యాప్తు నియమావళి ప్రకారం జీరో అవర్‌గా పిలిచే అప్పటి నుంచే దర్యాప్తు మొదలు కావాలి. అయితే 2021లో దస్తగిరి ఇచ్చిన అప్రూవర్‌ వాంగ్మూలంగానీ అనంతరం రంగన్న ఇచ్చిన వాంగ్మూలంలోగానీ 11.30 గంటలకు ఎర్ర గంగిరెడ్డి వివేకా నివాసానికి వచ్చారని చెప్పడం గమనార్హం.

వాచ్‌మెన్‌ రంగన్న అప్పుడలా.. ఇప్పుడిలా

వివేకా హత్య కేసు దర్యాప్తు చేసిన మొదటి దర్యాప్తు అధికారి చెప్పిన దాని ప్రకారం.. వాచ్‌మెన్‌ రంగన్న 2019 మార్చి 14వ తేదీ రాత్రి వివేకానందరెడ్డి నివాసం వరండాలో నిద్రపోయాడు. ఎన్నికల ప్రచారం ముగించుకుని రాత్రి 11.30 గంటల సమయంలో వివేకానందరెడ్డి తన నివాసానికి చేరుకున్నారు. కారు శబ్దం వినిపించి రంగన్న నిద్ర లేచి గేటు తెరిచారు. వివేకా ఇంటి వద్ద దిగిపోయాక.. కారు డ్రైవర్‌ ప్రసాద్‌ ఇంటికి వెళ్లిపోయాడు. 'నేను నిద్రపోతాను.. నువ్వు నిద్రపో' అని వివేకా రంగన్నతో చెప్పి తన నివాసంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత వివేకాను ఆయన నివాసంలో ఆ రోజు రాత్రి హత్య చేస్తుంటే బయటే ఉన్న రంగన్న ఏం చేశాడనే దానిపై టీడీపీ ప్రభుత్వ హయాంలోని పోలీసు అధికారులు విచారించనే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొన్ని వారాల తర్వాత రంగన్న పేరు కూడా అనుమానితుల జాబితాలో చేర్చారు. మరికొందరు అనుమానితులతోపాటు రంగన్నను కూడా అహ్మదాబాద్‌ తీసుకువెళ్లి నార్కో అనాలిసిస్‌ పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షల్లో ఎలాంటి విషయాన్ని రాబట్టలేదు. మరి రంగన్నకు ఏదైనా విషయం తెలిసి ఉంటే నార్కో ఎనాలిసిస్‌ పరీక్షల్లో బయటపడేది కదా!

రెండున్నరేళ్ల తర్వాత అన్నీ గుర్తుకొచ్చాయా?

వివేకా హత్య జరిగిన రెండున్నరేళ్ల తర్వాత సీబీఐ రంగన్నను ప్రత్యక్ష సాక్షిగా న్యాయస్థానంలో హాజరుపరిచింది. ఈ సారి రంగన్న కొన్ని కొత్త విషయాలు చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. 2019 మార్చి 14న రాత్రి వివేకాను ఇంటి వద్ద దించేసి డ్రైవర్‌ ప్రసాద్‌ వెళ్లిపోయిన తర్వాత.. 15 నిమిషాలకు అంటే 11.45 గంటలకు వివేకా స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డి అక్కడికి చేరుకున్నాడని చెప్పారు. దర్యాప్తులో ఇదే కీలకమైన టర్నింగ్‌ పాయింట్‌. ఎందుకంటే ఈ మొత్తం ఎపిసోడ్‌లో దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలు రెండు చోట్ల సరిపోలుతున్నాయి. వివేకా నివాసానికి ఎర్ర గంగిరెడ్డి రావడం.. వెళ్లడం అనే అంశాలు.

మృతదేహాన్ని అర్ధరాత్రే చూసిన రంగన్న

2021 జూలైలో జమ్మలమడుగు న్యాయస్థానంలో రంగన్న ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. 2019 మార్చి 14 అర్ధరాత్రి వివేకా నివాసం నుంచి శబ్దాలు రావడంతో కిటికీ వద్దకు వెళ్లి లోపలికి చూశాడు. లోపల నలుగురు వ్యక్తులు హాల్, బెడ్‌ రూమ్‌లలో తిరుగుతూ దేని కోసమో వెతుకుతున్నారు. రంగన్న ఓ చెట్టు వెనుక దాక్కున్నాడు. సునీల్‌ యాదవ్, ఉమాశంకర్‌ రెడ్డి, దస్తగిరి బయటకు వచ్చి గోడదూకి వెళ్లిపోవడం చూశాడు. అనంతరం ఎర్ర గంగిరెడ్డి బయటకు వచ్చి విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించి వెళ్లాడు. ఆ తర్వాత అంటే తెల్లవారుజామున 3 గంటల సమయంలో రంగన్న వివేకా నివాసం లోపలికి వెళ్లాడు. బెడ్‌రూమ్‌లో మంచం పక్కన రక్తం పడి ఉంది. బాత్‌రూమ్‌లో వివేకా కింద పడిపోయి ఉన్నారు. ఆయన చుట్టూ రక్తం మడుగు కట్టి ఉంది.

సాక్షులు చెప్పని విషయాలు చెప్పినట్లు..

సాక్షుల వాంగ్మూలాల పేరిటా సీబీఐ అడ్డదారులు తొక్కింది. సాక్షులు చెప్పని విషయాలు చెప్పినట్టుగా గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న రామ్‌సింగ్‌ నమోదు చేయడం వివాదాస్పదమవుతోంది. కనీసం 14 మంది సాక్షులు తాము చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడాన్ని ఖండించారు. నలుగురు సాక్షులు రామ్‌సింగ్‌కు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇదే విషయాన్ని ఎంపీ అవినాశ్‌ రెడ్డి సీబీఐ డైరెక్టర్‌ ప్రవీణ్‌ సూద్‌కు రాసిన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు కూడా. వివేకా చనిపోయారనే విషయాన్ని 2019 మార్చి 15న ఉదయం 6.15 గంటలకు ఆయన పీఏ కృష్ణా రెడ్డి గుర్తించారు. అంతకు ముందే వివేకా మరణం గురించి ఎవరికైనా తెలుసా అనే కోణంలో సీబీఐ దృష్టి సారించింది. వివేకా హత్య గురించి గజ్జెల ఉదయ్‌ కుమార్‌ రెడ్డికి 2019 మార్చి 15 తెల్లవారుజామున 4 గంటలకే తెలుసని ఆయన తల్లి తమ పొరుగున ఉండే ప్రభావతి దేవికి చెప్పినట్టుగా సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఆ మేరకు ప్రభావతి దేవీ 161 వాంగ్మూలం ఇచ్చినట్టు కూడా వెల్లడించింది. కానీ సీబీఐ వాదనను ప్రభావతి దేవి ఖండించారు. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ తన పేరిట వాంగ్మూలం నమోదు చేసుకుందని ఆవిడ స్పష్టం చేశారు.

అజేయ కల్లం పేరిట తప్పుడు వాంగ్మూలం

సాధారణ వ్యక్తులే కాదు.. ఏకంగా రాష్ట్ర రిటైర్డ్‌ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాంగ్మూలాన్ని కూడా సీబీఐ వక్రీకరించడం వివాదాస్పదమైంది. అజేయ కల్లం చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ తప్పుడు వాంగ్మూలం నమోదు చేసి చార్జ్‌షీట్‌లో పేర్కొంది. దీన్ని అజేయ కల్లం తీవ్రంగా ఖండిస్తూ న్యాయస్థానంలో పిటిషన్‌ దాఖలు చేయడం సీబీఐ తీరును ఎండగడుతోంది. '2019 మార్చి 15 ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్‌లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతుండగా.. ఇంట్లో సహాయకుడు వచ్చి వైఎస్‌ భారతి పిలుస్తున్నారని వైఎస్‌ జగన్‌కు చెప్పారు. దాంతో లోపలికి వెళ్లిన జగన్‌ కాసేపటి బయటకు వచ్చి తన చిన్నాన్న వివేకానందరెడ్డి మరణించినట్టు అక్కడ ఉన్న మాకు చెప్పారు' అని అజేయ కల్లం వాంగ్మూలంలో పేర్కొన్నట్టు సీబీఐ తెలిపింది. దీన్ని అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. 2019 మార్చి 15 ఉదయం 5 గంటలకు పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం మొదలైంది. గంటన్నర తర్వాత అంటే 6.30 గంటల సమయంలో సహాయకుడు వచ్చి ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డిని పిలిచారు. ఆయన బయటకు వెళ్లారు. తర్వాత కాసేపటికి కృష్ణమోహన్‌రెడ్డి వచ్చి వైఎస్‌ జగన్‌ చెవిలో ఏదో చెప్పారు. దాంతో నిశ్చేష్టుడైన వైఎస్‌ జగన్‌ వెంటనే లేచారు. తన చిన్నాన్న వివేకానందరెడ్డి చనిపోయారు అని మాతో చెప్పారు. వెంటనే సమావేశాన్ని ఆపేసి బయటకు వచ్చాం' అని తాను సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు అజేయ కల్లం స్పష్టం చేశారు. అసలు వైఎస్‌ భారతి పేరును తాను ప్రస్తావించ లేదని, అలాగే తాను 6.30 గంటలని చెప్పగా 5.30 గంటలుగా సీబీఐ పేర్కొందని ఆయన తప్పుబట్టారు.

అయినా బయట నిద్రించిన రంగన్న!

రక్తం మడుగులో తన యజమాని వివేకానందరెడ్డి చనిపోయి ఉండడాన్ని చూసిన తర్వాత రంగన్న ఏం చేశారంటే.. ఆయన ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం తలుపు దగ్గరకు మూసివేసి బయటకు వచ్చి అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించకపోవడంతో అక్కడే బీడీ తాగాడు. కాసేపు మెట్ల మీద కూర్చున్నాడు. కాసేపట్లో సమీపంలోని మసీదు నుంచి ఉదయం ప్రార్థనలు వినిపించాయి. దాంతో అక్కడే వరండాలో నిద్రపోయాడు. సీబీఐ అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న రెండు మసీదుల్లోని మత పెద్దలతో మాట్లాడారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం రోజూ ఉదయం 5 గంటలకు మసీదులో ప్రార్థనలు మొదలవుతాయి. అప్పటికి 15 నిమిషాల ముందే మసీదు మైకుల ద్వారా అజాన్‌ వినిపించడం మొదలు పెడతారు. అంటే తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 4.45 గంటల మధ్యలో రంగన్న తన యజమాని వివేకా మృతదేహాన్ని చూశాడు. కానీ తన వద్ద ఉన్న ఫోన్‌ ద్వారా అందుబాటులో ఉన్న వివేకా వద్ద పని చేసే సిబ్బందికి గానీ.. అక్కడికి పది నిమిషాల్లోనే వెళ్లగలిగేంత సమీపంలో ఉన్న డ్రైవర్‌ ప్రసాద్‌ నివాసానికి గానీ.. మరెవరికైనా చెప్పాలనిగానీ అనుకోలేదు. ఉదయం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్య వివేకా పీఏ కృష్ణా రెడ్డి, వంటమనిషి లక్ష్మి, ఆమె కుమారుడు ప్రకాశ్‌ వచ్చే వరకు నిద్రపోతున్నట్టు నటిస్తూ గడిపాడు. పైగా ఉదయం వివేకా నివాసం ఉత్తరం వైపు తలుపు తెరచి ఉండటాన్ని చూసిన పీఏ కృష్ణా రెడ్డి.. తనను ఇంటి లోపలికి వెళ్లి చూడమంటే రంగన్న లోపలికి వెళ్లాడు. అప్పుడు వివేకా మృతదేహాన్ని మొదటి సారి చూసినట్టుగా అందర్నీ నమ్మించాడు. ఆ విషయాన్ని 861 రోజుల తర్వాత సీబీఐ ద్వారా న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. హత్య జరిగిన రెండేళ్ల తర్వాత దస్తగిరి ఇచ్చిన అప్రూవర్‌ వాంగ్మూలం, రంగన్న ఇచ్చిన వాంగ్మూలం తప్ప మరే ఆధారం లేదు.


రేపటి సంచికలో: వివేకా లేఖను పట్టించుకోరా?

నగర వార్తలు

కళ్ల కలక సమస్య పెరిగింది

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల్లో కళ్లకలక, కంటి ఫ్లూ సంబంధిత కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని ప్రముఖ డిజిటల్‌ హెల్త్‌కేర్‌ ప్లాట్‌ఫామ్‌ మెడిబడ్డీ అధ్యయనం నిర్ధారించింది. ఉత్తరాది.. దక్షిణాది తేడా లేకుండా దాదాపు అన్ని చోట్లా..దేశంలో గత కొన్ని వారాలుగా భారీ వర్షాలు వరదలు సంభవించడంతో ఈ పరిస్థితి దేశవ్యాప్తంగా ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వివిధ కంటి సంబంధిత సమస్యల కోసం వైద్య సలహాలను కోరుకునే రోగుల సంఖ్య ఇటీవల బాగా పెరిగిందని, కళ్లు ఎర్ర బడి నీరు కారటం, నిద్ర లేచిన వెంటనే కళ్ళు అంటుకునే ఉండటం...అదే విధంగా కళ్లకలక వంటి సమస్యలతో గత సంవత్సరం నేత్ర వైద్యుల సంప్రదింపులు ఒక్కశాతం మాత్రమే కాగా ఇప్పుడు అది 2.6%కి పెరిగిందన్నారు. వయసుల వారీగా చూస్తే 49% పెరుగుదలతో 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులలో కళ్లకలక అధికంగా కనిపిస్తోందని వివరించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



పంజగుట్ట: అసలే ఇంటికి పెద్దదిక్కు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే గత 8 సంవత్సరాలుగా జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు జరపకుండా ఆ దుఃఖాన్ని మరింత రెట్టింపు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర జిల్లా పరిషత్‌ కారుణ్య నియామక అభ్యర్థులు ఆవేదనవ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు కవిత, నాగమణి, సుశీల్‌ జాదవ్, రాహుల్‌ రెడ్డిలు మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో సుమారు వెయ్యి మంది జిల్లా పరిషత్‌ శాఖలో కారుణ్య నియామకాలు రాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీపీఎస్‌ అభ్యర్థులకైతే పింఛన్‌ కూడా రాకపోవడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. కారుణ్య నియామకాలు భర్తీ చేయాలని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. ఇటీవల వీఆర్‌వో, వీఆర్‌ఏ లను జిల్లాపరిషత్‌లోని ఖాళీలలో భర్తీ చేయడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర సర్క్యులర్‌ ప్రకారం జిల్లా పరిషత్‌ శాఖలో మరణించిన కుటుంబాలకు అదే శాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉందని ఆ సర్క్యులర్‌ సవరించి ఏదైనా శాఖలో తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

నులిపురుగులను నివారించిన రాష్ట్రం తెలంగాణ

పంజగుట్ట: దేశంలోనే నులిపురుగులను పూర్తిగా నివారించిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలవాలని హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌ స్కూల్‌ విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు, ఖైరతాబాద్‌ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డితో కలిసి వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ అనుదీప్‌ మాట్లాడుతూ .. మనం మట్టిలో ఆడుకుని చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేస్తే అందులోని చిన్న పురుగులు మన శరీరంలోకి వెళతాయని అవే నులిపురుగులుగా మారి మనం తీసుకునే పోషకాలు మన శరీరానికి అందకుండా అదే తీసుకుంటుందని, దీనివల్ల పిల్లలు ఎత్తు, బరువు, మెదడు ఎదగకుండా పోతారన్నారు. తెలంగాణలో మట్టిలో బ్యాక్టీరియా గతంలో 62 శాతం ఉండేదని, ప్రస్తుతం ఒక్క శాతం మాత్రమే ఉందని ఈ ఒక్క శాతం కూడా లేకుండా చేయాలన్నారు. హైదరాబాద్‌ జిల్లాలో ఒక్క సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలు 11 లక్షల 62 వేల మంది ఉన్నారని ప్రతీ ఒక్కరికీ ఈ మందు అందేలా చూడాలని స్కూల్స్‌ కాకుండా అంగన్‌వాడీల్లో విద్యార్థులు వారి స్నేహితులు, బంధువులు అందరికీ ఇవ్వాలని సూచించారు. విజయారెడ్డి మాట్లాడుతూ .. పిల్లలు రోడ్డుపై ఆహారాన్ని అస్సలు తీసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, డిప్యూటీ డీఈవో శ్యామ్యూల్‌ రాజ్, పాఠశాల ప్రిన్సిపల్స్‌ వీఏఎస్‌ కరుణశ్రీ, ఎన్‌.మంజులత పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగు నివారణ మందు వేస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కొండ దేవయ్య పటేల్‌ డిమాండ్‌ చేశారు. అన్ని కులాలకు సంక్షేమ పథకాలు ఇస్తున్న కేసీఆర్‌ రాష్ట్రంలో 24 శాతం, సుమారు 40 నుండి 50 లక్షల జనాభా ఉన్న మున్నూరు కాపులను విస్మరించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరు కాపుల డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను గ్రేటర్‌ అధ్యక్షులు ఆర్‌వీ మహేదర్‌ పటేల్, రాష్ట్ర జాయింట్‌ సెక్రటరీ వాసాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి తేళ్ళ హరికృష్ణ, గ్రేటర్‌ మహిళా అధ్యక్షురాలు కొత్త కృష్ణవేణిలతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రం విడిపోగానే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి కాపులకు 5వేల కోట్లతో ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో మాత్రం కాపులను విస్మరించారన్నారు. 9 మంది ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, ఇద్దరు ఎంపీలు ఉన్నప్పటికీ వారు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించేలా చేయలేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రత్యేక ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రాల్లో ఒక ఎకరం స్థలం, రెండు కోట్ల నిధులు కేటాయిస్తే మున్నూరు కాపు హాస్టల్స్‌ నిర్మించి విద్యార్థులు చదువుకునేలా ప్రొత్సహిస్తామన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 4 నుండి 18వ తేదీ వరకు మున్నూరు కాపు ప్రజా ప్రతినిధుల ఇండ్లముందు పోస్టర్లు పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. సమావేశంలో కాటం పద్మ, శ్రీనివాస్, ప్రసాద్, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయాలి

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని తెలంగాణ బీసీ సంఘం ప్రతినిధులు రాజేశ్వర్‌ యాదవ్, జగదీష్‌ గౌడ్, జగన్‌ చారి, సాయి వర్ధన్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజేశ్వర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో గురువారం మంత్రి కేటీఆర్‌ను కలిసి బీసీల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని కోరారు. కళాశాలల్లో ఫీజులు పెండింగ్‌లో ఉండటంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేదిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ బంధు పథకం ద్వారా రూ.10 లక్షలు ప్రతి బీసీ కుటుంబానికి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ నామినేటెడ్‌ పోస్టుల్లో, పార్టీలో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 5వేలు భత్యం ఇవ్వాలని అన్నారు.

4 నుంచి ఏషియన్‌ తైక్వాండో పోటీలు

పంజగుట్ట: తైక్వాండో అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ, యజ్ఞ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తైక్వాండో అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా, కర్నాటక సహకారంతో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు 7వ సౌత్‌ ఏషియన్‌ తైక్వాండో, 18వ సౌత్‌ వెస్ట్‌ ఇండియా తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా అధ్యక్షుడు డాక్టర్‌ రాజేంద్ర బాలన్‌ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోటీల కరపత్రాన్ని తైక్వాండో అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ అధ్యక్షులు ఉజ్వల్‌ రాజ్, అంతర్జాతీయ ఎంపైర్‌ ప్రదీప్‌ జనార్ధన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోటీలకు 8 దేశాలనుండి, భారతదేశంలోని 12 రాష్ట్రాల నుండి సుమారు వెయ్యికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి ఇండోర్‌ స్టేడియంలో జరిగే పోటీల ప్రారంభోత్సవానికి క్రీడాశాఖా మంత్రి శ్రీనివాస్‌ గౌడ్, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, ఆరికెపూడి గాంధీ, తెలంగాణ ఒలంపిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు జయేష్‌ రంజన్‌ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు రచన, అబ్దుల్‌ రహమాన్, నరేంద్ర సింగ్‌ రావత్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రూ. లక్ష ఆర్థిక చేయూత

సాక్షి,సిటీబ్యూరో: 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేటగిరి–1,2 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ముస్లిం మైనారిటీలకు వంద శాతం సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక చేయూత మంజూరు చేస్తామని రాష్ట్ర మైనారిటీ ఆర్థిక సంస్థ చైర్మన్‌ ఇంతియాజ్‌ ఇషాక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద సుమారు రెండు లక్షల 16 వేల 693 మంది కేటగిరి 1,2 కింద దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. వారిలో అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన వారికి ఆర్థిక చేయూత మంజూరు చేస్తామన్నారు.

శస్త్రచికిత్సల నిపుణుడిగా సుబ్బారావు సేవలు ఎనలేనివి

చిక్కడపల్లి : దేశంలోనే శస్త్రచికిత్సల నిపుణుడుగా ఎల్లాప్రగడ సుబ్బారావు ఖ్యాతిచెందారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్‌ ఎల్లాప్రగడ సుబ్బారావు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనచారి మాట్లాడుతూ వైద్యవృత్తినే దైవారాధనగా భావించిన గొప్ప వ్యక్తి సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జయసూర్య, చంద్రశేఖర్, బేవరెజెస్‌ కార్పొరేషన్‌ పూర్వ చైర్మన్‌ దేవిప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనాచారి

జాతీయ స్థాయి త్రోబాల్‌ పోటీలకు | రాజ్‌భవన్‌ స్కూల్‌ విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బంజారాహిల్స్‌: జాతీయ స్థాయి త్రోబాల్‌ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు సోమాజిగూడలోని రాజ్‌భవన్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పుదుచ్చేరిలో ఈ నెల 4న నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న 28వ సబ్‌ జూనియర్‌ జాతీయ స్థాయి త్రోబాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు ఈ పాఠశాల నుంచి గురువారం నలుగురు విద్యార్థులు వెళ్లారు. బాలుర జట్టుకు పదో తరగతి విద్యార్థి సాయి నితిన్, తొమ్మిదో తరగతి విద్యార్థి చాణక్య, బాలికల జట్టుకు పదో తరగతి విద్యార్థిని హరిప్రియ, తొమ్మిదో తరగతి విద్యార్థిని జ్ఞాన ప్రసన్న ఎంపికయ్యారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం రాజ్‌భవన్‌ స్కూల్‌నుంచి మాత్రమే నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా పోటీలకు వెళ్తున్న విద్యార్థులను స్కూల్‌ ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయుడు పీర్కొండ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

6 నుంచి గో మహా పాదయాత్ర



గో మహా పాదయాత్ర పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రొత్సహించాలని గో ఉత్పత్తులను పెంచాలని డిమాండ్‌ చేస్తూ ఆగస్టు 6వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ గో సేవా ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. యాత్ర 6వ తేదీ ఉదయం 8:30కి సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళీ దేవాలయం నుండి ప్రారంభమై తిరుమలకు, తిరుమల నుండి అరుణాచలం వరకు 789 కిలోమీటర్లు 25 రోజుల పాటు గో మహాపాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాదయాత్ర పోస్టర్‌ను అఖిలభారత హిందూ మహా సభ ప్రధాన కార్యదర్శి కమలేష్‌ మహారాజ్, దిల్‌సుఖ్‌నగర్‌ సాయిబాబా దేవాలయం చైర్మన్‌ గుండా మల్లయ్య, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు రమేష్‌ గుప్తాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశంలో 100 కోట్ల గోవులు ఉండేవని ప్రస్తుతం 8 కోట్లు మాత్రమే ఉన్నాయని, ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్‌ తరాలకు గోవును చిత్రంలో చూపించాల్సి వస్తుందన్నారు. యాత్ర ప్రారంభోత్సవానికి మంత్రులు తలసాని శ్రీనివాస్‌ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌ రెడ్డి, టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్‌.కృష్ణయ్య, గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ఫెరోజ్‌ఖాన్‌ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో శెట్టి హరికృష్ణ యాదవ్, సంజయ్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'కేసీఆర్ నిర్ణయాలు విపక్షాలకు మాస్టర్ స్ట్రోక్'



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ అని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా లాబీలో మంత్రి మీడియాతో చిట్‌చాట్ చేశారు. పోడుభూముల పంపిణీ, వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, రైతు రుణమాఫీలతో ఏం చేయాలో పాలుపోనిస్థితిలో విపక్షాలు ఉన్నాయని, దెబ్బమీదదెబ్బ కొట్టడంతో తట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో సాధారణంగా అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలకు ఎజెండా ఉంటుందని, కానీ ఆ ఎజెండా కూడా తామే నిర్ణయిస్తున్నామని వ్యాఖ్యానించారు.

నల్లగొండ జిల్లాలో రాజకీయ వరదలు: మంత్రి జగదీశ్‌రెడ్డి

''నల్లగొండ జిల్లాలో రాజకీయ వరదలు వస్తాయి. అన్ని నియోజకవర్గాల్లో కొత్త, పాత వరదలు కలుస్తాయి''అని బీఆర్‌ఎస్‌లో చేరికలను ఉద్దేశిస్తూ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము వేరే పార్టీ అధ్యక్షులనే మార్చామనే ప్రచారం ఉన్నప్పుడు.. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడం పెద్ద కష్టమా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌లో విభేదాలను మీడియా ప్రస్తావించగా ''ఎవరూ గెలవలేని పార్టీల్లోనే రాజకీయ గొడవలు ఉన్నప్పుడు.. అధికార పార్టీలో అభ్యర్థుల గొడవలు ఉండవా? పార్టీలో అంతర్గత కలహాలు సహజం. కొత్త, పాత నేతలు కలుపుకొని వెళ్లాల్సి ఉంటుంది''అని పేర్కొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వస్తోందనే 'రుణమాఫీ'

రుణమాఫీ మొత్తం వడ్డీలకే పోతుంది: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తోందని రైతు రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ అంటున్నారని, ముందే రుణమాఫీ చేస్తే రైతన్నలు బాగుపడేవారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ..ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎంకు రైతు రుణమాఫీ గుర్తు రావడం సంతోషకరమని ఎద్దేవా చేశారు. విడతల వారీగా రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల్లో ప్రకటించారని, ఇప్పటివరకు చేయకపోవడంతో బయట నుంచి తెచ్చిన అప్పు వడ్డీలకే రుణమాఫీ మొత్తం సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు వచ్చినా అందరికీ రైతుబంధు రాలేదని, వాయిదా పద్ధతిలో కాకుండా ఏక కాలంలో రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ బంధు, ముస్లిం బంధు ఏమైందని ఆయన నిలదీశారు.

మండలిలోకి కొత్త సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ఈ మధ్యకాలంలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన పలువురు సభ్యులు గురువారం తొలిసారి శాసనమండలిలో అడుగుపెట్టారు. వారిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వెంకట్రామ్‌రెడ్డి, బీజేపీ సభ్యుడు ఏవీఎన్ రెడ్డి, ఎంఐఎం సభ్యుడు మీర్జా రెహ్మత్ బేగ్ ఉన్నారు.

వరద నష్టంపై అసెంబ్లీలో చర్చించాలి

గవర్నర్, సీఎం ములుగు జిల్లాలో పర్యటించాలి: సీతక్క డిమాండ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ సమావేశాల్లో వరదల నష్టం, ప్రజల ఇబ్బందులపై చర్చించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క కోరారు. సీతక్క గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ వరదలతో ములుగు జిల్లాలో భారీ నష్టం జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గవర్నర్, సీఎం ములుగు జిల్లాలో పర్యటించి బాధితులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు, ఇల్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షలు, సామాన్లు నష్టపోయిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు.

కేటీఆర్, ఈటల ఆలింగనం

అసెంబ్లీ సమావేశ మందిరంలో ఆసక్తికర సన్నివేశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల తొలిరోజున ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. కొన్నాళ్లుగా ఉప్పు, నిప్పులా ఉంటున్న మంత్రి కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆలింగనం చేసుకొని నవ్వుతూ మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. సభ ప్రారంభానికి ముందు అసెంబ్లీ సమావేశ మందిరంలోకి వెళ్లిన మంత్రి కేటీఆర్ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌లతో మాట్లాడుతూ నిల్చున్నారు. అప్పుడే సమావేశ మందిరంలోకి వచ్చిన బీజేపీ ఎమ్మెల్యేలు ఈటల, రఘునందన్‌రావు, రాజాసింగ్ తమ స్థానాల్లో కూర్చొనేందుకు వెళ్తూ కేటీఆర్‌కు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఈటలను కేటీఆర్ ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ 5 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. అయితే ఈ భేటీకి ప్రత్యేకత లేదని, ఇద్దరి నడుమ సాధారణ సంభాషణే జరిగిందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

వర్షాలు, వరదల్లో దెబ్బతిన్న ఇళ్లకు 'గృహలక్ష్మి'

- శాసనమండలిలో లఘు చర్చకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమాధానం
- పూర్తిగా ధ్వంసమైన 419 ఇళ్లకు వర్తింపజేయాలని కేసీఆర్ ఆదేశించారు
- పాక్షికంగా దెబ్బతిన్న 7,505 ఇళ్లకు తగిన విధంగా పరిహారం
- మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున అందిస్తాం
- వరదల సమయంలో కేంద్రం తెలంగాణను ఏమాత్రం ఆదుకోలేదు
- అయినా రూ.500 కోట్ల తక్షణ సాయం ప్రకటించిన సీఎం కేసీఆర్
- నష్టంపై పక్కా సమాచారం అందాక వరద సాయంపై సీఎం ప్రకటన ఉంటుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో పూర్తిగా ధ్వంసమైన 419 ఇళ్లకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న 7,505 ఇళ్లకు తగిన విధంగా పరిహారం ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు, రోడ్లు–భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలతో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గురువారం శాసనమండలిలో 'భారీ వర్షాల పర్యవసానాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యల'పై నిర్వహించిన లఘు చర్చకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. వరదల సమయంలో ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కేంద్రం ఆదుకోకున్నా..


2020లో, తర్వాత రాష్ట్రం వరదలతో నష్టపోతే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోలేదని.. అయినా సీఎం కేసీఆర్ ధైర్యం కోల్పోకుండా పకడ్బందీగా సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టారని వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఇళ్లు నీట మునిగిన వారికి రూ.10 వేల చొప్పున రాష్ట్ర సర్కారే ఆర్థిక సాయం చేసిందని చెప్పారు. గతంలో భారీ వర్షాలకు నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లితే.. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. అందులో ఇప్పటివరకు రూ.150 కోట్లు చెల్లించిందని, త్వరలోనే మిగతా రూ.300 కోట్లను చెల్లించనున్నామని తెలిపారు. ప్రస్తుత వరదల నేపథ్యంలోనూ సీఎం కేసీఆర్ ప్రజలకు భరోసానిచ్చేలా రూ.500 కోట్ల తక్షణ సాయాన్ని ప్రకటించారని చెప్పారు.

సీఎం కేసీఆర్ నిరంతర సమీక్ష

తెలంగాణలో ఎన్నడూ లేనంత భారీ వర్షాలు నమోదయ్యాయని, ఈ వానలు, వరదలపై సీఎం కేసీఆర్ నిరంతరం సమీక్షించారని వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో అర్ధరాత్రి దాకా గంటలకొద్దీ సమీక్షలు, ప్రాజెక్టుల వారీగా పరిశీలనలతో ఆస్తి, ప్రాణనష్టం తగ్గించగలిగామని వివరించారు. వరద ప్రాంతాలకు సీఎం రాలేదన్న విమర్శలు సరికాదని.. సీఎం కేసీఆర్ ఫొటోల కవరేజీ కోసం ఫోజులిచ్చే నాయకుడు కాదని, ఆయన ప్రజల కోసం పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక బృందాలను పురమాయించి.. మంత్రులు, కలెక్టర్లు, అధికారులను సహాయ, పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నం చేయడంలో కేసీఆర్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. వరదలతో కోతకు గురైన భూములపై సర్వే చేయాలని ఆదేశించారని తెలిపారు. నష్టంపై పూర్తి అంచనాలు అందాక ఆర్థిక సాయంపై సీఎం తగిన నిర్ణయం ప్రకటిస్తారని వివరించారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన మిషన్ కాకతీయ పనులతో చెరువుల అలుగులు పటిష్టమై, కాలువల కట్టలు బలపడటంతో ఎక్కువ నష్టం జరగలేదని పేర్కొన్నారు.

వరదలు, వానల నష్టం ఇదీ..

- రాష్ట్రంలో వరంగల్ కార్పొరేషన్, నిర్మల్, పరకాల, కోరుట్ల, భూపాలపల్లి, జమ్మికుంట, ఖమ్మం కార్పొరేషన్, మహబూబాబాద్, భైంసా, నిజామాబాద్ కార్పొరేషన్, పెద్దపల్లి, నర్సంపేటలలో అధిక నష్టం సంభవించిందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శాసన మండలిలో చెప్పారు.
- 141 పురపాలికల్లో ముందస్తు, సహాయ చర్యలు చేపట్టామని, తాత్కాలిక మరమ్మతులకు రూ.76 కోట్లు అవసరమని అంచనా వేశామని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, వీధి దీపాల శాశ్వత పునరుద్ధరణకు మొత్తం రూ.304 కోట్లు, యూఎల్‌బీల పునరుద్ధరణ పనులకు రూ.380 కోట్లు అవసరమన్నారు.
- ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోడ్ల పునరుద్ధరణ కోసం రూ.255.66 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, అవి మంజూరు దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు.
- సహాయ చర్యల్లో భాగంగా 1,500 మందిని కాపాడామని మంత్రి చెప్పారు. 139 గ్రామాలకు చెందిన 27,062 మందికి 157 సహాయ శిబిరాల్లో ఆశ్రయం కల్పించామని.. తాగునీరు, ఆహారం, దుప్పట్లు, మందులు సరఫరా చేశామని వివరించారు.
- ములుగు జిల్లా కొండాయి గ్రామానికి హెలికాప్టర్ ద్వారా ఆహారం, మందులు పంపామన్నారు.
- 64 గ్రామాలు/ప్రదేశాలలో నీటిపైపులు దెబ్బతిని.. 1,199 జనావాసాలు 25,418 కుటుంబాలపై ప్రభావం పడగా.. వంద శాతం తాగునీటి పునరుద్ధరణ జరిగిందని చెప్పారు.
- 773 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా.. 769 గ్రామాల్లో పునరుద్ధరించామని మంత్రి తెలిపారు. 23,075 స్తంభాలు, 3,405 డీటీఆర్‌లు దెబ్బతిని దాదాపు రూ.62.98 కోట్ల నష్టం జరిగిందని వివరించారు.





కేసీఆర్‌కు క్యారికేచర్‌ను బహూకరిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

రైతు రుణమాఫీపై కేసీఆర్‌కు కృతజ్ఞతలు

- సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- రైతుబాంధవుడు అంటూ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీతోపాటు ఇటీవల కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలపై కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం కేసీఆర్‌ను పలువురు మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. గురువారం శాసనసభకు వచ్చిన కేసీఆర్‌ను కలిసేందుకు సీఎం చాంబర్ వద్ద ఎమ్మెల్యేలు బారులు తీరడంతో సందడి నెలకొంది. రూ.19 వేల కోట్ల మేర రైతు రుణమాఫీ చేస్తూ, సీఎం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ధన్యవాదాలు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో మెట్రోరైలు విస్తరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ సిబ్బంది విలీనంతోపాటు నోటరీ ఆస్తుల క్రమబద్ధీకరణ వంటి నిర్ణయాలపట్ల కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్‌ను రైతుబాంధవుడిగా పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా రైతుల కుటుంబాలు సంబురాలు చేసుకుంటున్నాయని పలువురు ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్, ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, కొప్పుల, గంగుల, ఇంద్రకరణ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని, సబితా ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలవారీగా సంబంధిత జిల్లా మంత్రులతో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి రైతు రుణమాఫీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు వేణుగోపాలాచారి, ఆంజనేయ గౌడ్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్, రైతన్నల మధ్య వాత్సల్యానికి అద్దంపట్టే క్యారికేచర్‌ను ఈ సందర్భంగా సీఎంకు అందజేశారు.

ఎకరానికి రూ. 50 వేల పరిహారమివ్వాలి

- మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి డిమాండ్
- భారీ వర్షాలు, వరదలపై లఘు చర్చల్లో పాల్గొన్న సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో రైతాంగానికి వాటిల్లిన తీవ్ర నష్టానికిగాను ఎకరానికి రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసనమండలిలో ఈ అంశంపై చర్చ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. పొలాల్లో భూమి ఆనవాళ్లు కోల్పోయే విధంగా ఇసుకమేటలు వేసినందున రూ. 15–16 వేల నష్టం సరిపోదని, సహాయ చర్యల నిమిత్తం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో 10–15 లక్షల ఎకరాల్లో రైతాంగం పంట నష్టపోయిందని చెప్పారు. దాదాపు రూ. 10 వేల కోట్ల నష్టం వాటిల్లినందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం ప్రకటించి సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. గతేడాది ప్రకటించిన వరద సహాయం కూడా పూర్తిగా అందించాలన్నారు. సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం కేంద్రం నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదని, పీఎం ఆవాస్ యోజన కింద సహాయం ఏమైందని ప్రశ్నించారు.

తెలంగాణకు కేంద్రం మొండిచేయి: బండ ప్రకాశ్

తుపాను బారినపడిన గుజరాత్‌కు రూ. వెయ్యి కోట్ల తక్షణ సాయం ప్రకటించిన ప్రధాని మోదీ... తెలంగాణకు మాత్రం కనీస సహాయం అందించలేదని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ విమర్శించారు. ఎస్డీఆర్‌ఎఫ్ నిధులు ఖర్చు చేయొచ్చునని చెబుతున్నా కేంద్ర విధివిధానాలు మాత్రం అందుకు అనుమతించడం లేదని గుర్తుచేశారు. కాగా, రాష్ట్ర బీజేపీ నేతలు ఢిల్లీ వెళ్లి విషప్రచారం చేస్తున్నారని తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మండిపడగా తెలంగాణపై కేంద్రం వివక్ష, నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తాతా మధు విమర్శించారు.

కేంద్ర నిధులను రాష్ట్రం ఖర్చు చేయట్లేదు: ఏవీఎన్ రెడ్డి

కేంద్రం గతంలో కేటాయించిన విపత్తు సహాయ నిధులను రాష్ట్రం ఖర్చు చేయట్లేదని బీజేపీ సభ్యుడు ఏవీఎన్‌రెడ్డి ఆరోపించారు. కడెం ప్రాజెక్టు పరిరక్షణకు కేంద్రం పంపిన నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం వాడుకోలేదన్నారు. మెరుపు వరదలను రాజకీయం చేయడం తగదని, బీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రజలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కడియం శ్రీహరి సూచించారు. బాలానగర్ నుంచి మూసీ వరకు పెద్ద నాలాలు ఏర్పాటు చేయాలని టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు.



జీఏసీ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

అసెంబ్లీ 3 రోజులే

▶ మొదటి పేజీ తరువాయి

గంగుల కమలాకర్, చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ పాల్గొన్నారు. ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. సభ్యులు కోరినన్ని రోజులు సభ నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఈసందర్భంగా తెలిపారు. 20రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని భట్టి, వరదలపై స్వల్పకాలిక చర్చ జరపాలని అక్బరుద్దీన్ ప్రతిపాదించారు. చివరకు మూడురోజుల పాటు సభ నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది.

వరదలు, విద్య, వైద్యంపై స్వల్పకాలిక చర్చ

శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశంలో తొలుత ప్రశ్నోత్తరాలను చేపడతారు. అనంతరం రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలు, విద్య, వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు– ఫలితాలు అనే అంశాలపై స్వల్పకాలిక చర్చ జరుగుతుంది. వివిధ అంశాలపై మొత్తం 10 బిల్లులు ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. శనివారం కూడా ఏదేని ఒక అంశంపై స్వల్పకాలిక చర్చతో పాటు బిల్లులపై చర్చ జరుగుతుంది. ఇక శాసన మండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఏసీ భేటీలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, చీఫ్ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎంఐఎం సభ్యులు అఫెందీ, మీర్జా రహమత్ బేగ్ పాల్గొన్నారు. శాసనసభలో ప్రవేశ పెట్టే బిల్లులకు అనుగుణంగా ఎజెండాను రూపొందించారు.

ఉభయసభల్లో ప్రశ్నోత్తరాలు ఇలా..

ప్రశ్నోత్తరాల్లో భాగంగా శుక్రవారం శాసనసభలో ఐటీ ఎగుమతులు, రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు, చార్మినార్ పాదచారుల రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టు, ఆరోగ్య లక్ష్మి పథకం, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎస్‌ఆర్‌డీపీపై మంత్రులు సమాధానాలు ఇస్తారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం, గొర్రెల సంఖ్య పెరుగుదల, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లు, జాతీయ విద్యా సంస్థల్లో బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లింపు అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. శాసనమండలిలో హరితహారం, కొత్త మెడికల్ కాలేజీల మంజూరు, పంటల బీమా పథకం, పల్లె ప్రగతి, ఆసరా పింఛన్లు, హైదరాబాద్ పాత బస్తీలో విద్యుత్ కోతలపై ప్రశ్నలు ఉంటాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి, గురుకులాలకు భవనాలు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు, బీరప్పఆలయాలకు సాయం అంశాలపై కూడా ప్రశ్నోత్తరాలు ఉంటాయి.

నాలుగేళ్లుగా చేయనిది.. ఈ రెండు నెలల్లో చేస్తారా?

- రైతుల రుణమాఫీపై సర్కారుకు ఈటల సూటి ప్రశ్న
- ఆర్టీసీ ఆస్తులు అమ్ముకునేందుకు కుట్ర
- ఏ మంత్రికీ దమ్ము లేదు.. అన్నింటికీ ముఖ్యమంత్రే
- మూడు నెలలైతే ఈ ప్రభుత్వం ఉండదన్న ఈటల



మీడియాతో మాట్లాడుతున్న ఈటల

సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లలో చేయని రైతుల రుణమాఫీ ఈ రెండు నెలల్లో చేస్తుందా? అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులు అమ్ముకునేందుకు కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుతామని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులు క్రమంగా ప్రైవేటుపరం చేస్తున్నారని, 56 వేల మంది ఉన్న ఆర్టీసీ కార్మికుల సంఖ్య 43 వేలకు చేరిందని, బస్సుల సంఖ్య 12 వేల నుంచి మూడు వేలకు పడిపోయిందన్నారు. ఆర్టీసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తాత్కాలిక కార్మికుల పరిస్థితేంటని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలు మూడు రోజులకు పరిమితం చేస్తున్నారని, ఆరు నెలలకు ఒకసారి సభ జరగాలి కాబట్టి మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయని. వాటిపై సభలో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. భారీ వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్న బాధితులకు తక్షణ సాయంగా రూ.25 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా.. ముఖ్యమంత్రి నుంచి కనీస స్పందన లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తరువాతే పంట పొలాలు బ్యాక్ వాటర్ కారణంగా నష్టపోతున్నాయని ఈటల ఆరోపించారు. రాష్ట్రంలో ఏ మంత్రికి కూడా సమస్య పరిష్కరించే దమ్ము లేదని, అన్నింటికీ ముఖ్యమంత్రే అని ఎద్దేవా చేశారు. మూడు నెలలైతే ఈ ప్రభుత్వం ఉండదన్నారు.

కక్షపూరితంగానే బీఏసీకి పిలువలేదు

ఉమ్మడి ఏపీలో సైతం ఒక్క సభ్యుడు ఉన్నా బీఏసీకి పిలిచేవారని, బీజేపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నా పిలవకపోవడం కక్షపూరిత చర్య అని ఈటల మండిపడ్డారు. సమైక్య పాలకులకు ఉన్న సోయి తెలంగాణ పాలకులకు లేదన్నారు. అసెంబ్లీలో చాలా రూములు ఖాళీగా ఉన్నా.. బీజేపీ సభ్యులకు కేటాయించలేదని విమర్శించారు.

దమ్ముంటే 20 రోజులు అసెంబ్లీ నడపాలి

- కాంగ్రెస్‌ను ఎదుర్కోలేకనే ఆర్నెల్లుగా సభ పెట్టలేదు
- ఆ భూములు గుంజుకుంటామన్న కేసీఆర్ ఇప్పుడేం చేస్తున్నారు?: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దమ్ముంటే అసెంబ్లీని 20 రోజులు నిర్వహించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. దేశంలోనే అతి తక్కువ రోజులు అసెంబ్లీ నడిపిన చరిత్ర తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఎదుర్కోలేకనే ఆరు నెలలుగా సభ పెట్టలేదన్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా సీఎల్పీ కార్యాలయంలో ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులు, పోడు భూములు, ధరణి, సింగరేణి , బీసీ సబ్ ప్లాన్ తదితర అంశాలపై శాసన సభలో చర్చించాలన్నారు. మైనారిటీ, ఎస్సీ సబ్‌ప్లాన్‌పై చర్చకు డిమాండ్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం చేస్తామంటున్న రైతు రుణ మాఫీని వడ్డీతో సహా చెల్లించాలని భట్టి డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల అమ్మకాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూములు అమ్ముతున్నారనే కాంగ్రెస్ పార్టీ ఆ నాడు తెలంగాణను ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత అప్పట్లో అమ్మిన భూములను గుంజుకుంటామన్న కేసీఆరే.. ఇప్పుడు విచ్చలవిడిగా భూములు అమ్ముతున్నారని విమర్శించారు. శాసనసభను 20 రోజుల పాటు నిర్వహించాలని కోరుతూ సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణగా జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు ధరణి, పోడు సమస్యలు, నిరుద్యోగం తదితర ప్రాధాన్య అంశాలపై చర్చించాల్సి ఉందని పేర్కొన్నారు. స్వల్పకాలిక చర్చల కింద ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని సభ్యులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ఎవరిని కలిస్తే పనవుతుందో తెలుసు!

కేటీఆర్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి భేటీ



తొలిరోజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. శాసనసభ వాయిదా పడిన తర్వాత లాబీలోకి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కలిశారు. టీఎన్జీఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ కూడా అదే సమయంలో కేటీఆర్‌ను కలిశారు. ముగ్గురూ కలసి కేటీఆర్ చాంబర్ వైపు వెళ్తూ.. మాట్లాడుకున్నారు. టీషర్ట్‌లో ఉన్న జగ్గారెడ్డిని ఉద్దేశిస్తూ 'పిల్లలతో కలసి తిరిగితే ఎట్లా?'అని కేటీఆర్ సరదాగా వ్యాఖ్యానించగా.. 'టీషర్ట్‌తో అసెంబ్లీకి వస్తే తప్పేమీలేదులే..'అంటూ జగ్గారెడ్డి సమాధానమిచ్చారు. ఇక మామిండ్ల రాజేందర్‌ను ఉద్దేశిస్తూ 'మీ ఇద్దరి దోస్తానా ఎక్కడ కుదిరింది?'అని కేటీఆర్ ప్రశ్నించగా.. 'మా ఇద్దరిదీ ఒకే కంచం, ఒకే మంచం. చిన్నప్పటి నుంచే దోస్తులం (మామిండ్ల రాజేందర్ స్వస్థలం సంగారెడ్డి)'అని జగ్గారెడ్డి చెప్పగా.. గతంలో తాము జగ్గారెడ్డి గెలుపు కోసం పనిచేశామని రాజేందర్ చెప్పారు. తర్వాత వారంతా కేటీఆర్ చాంబర్‌లోకి వెళ్లి మాట్లాడుకున్నారు. కాసేపటికి బయటికి వచ్చిన జగ్గారెడ్డిని 'పార్టీ మారుతున్నారా?'అని మీడియా ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని, అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుగురు ఏఆర్ కానిస్టేబుళ్ల బదిలీ గురించి హోంమంత్రికి ఓ మాట చెప్పాల్సిందిగా కేటీఆర్‌కు లేఖ ఇచ్చానని జగ్గారెడ్డి వివరించారు. తాను ప్రతిపక్ష సభ్యుడినని, నేరుగా హోంమంత్రిని కలసినా పని కాదనే ఉద్దేశంతో కేటీఆర్‌ను కలిశానని.. ఎవరిని కలిస్తే పని జరుగుతుందో తనకు తెలుసని వ్యాఖ్యానించారు.

'మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించేది నేనే!'



మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిని తానే నిర్ణయిస్తానని, గత ఎన్నికల్లో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి టికెట్ ఇప్పించింది తానేనని మంత్రి మల్లారెడ్డి సరదాగా వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించడంలో తనదే నిర్ణయాత్మక పాత్ర అని... మేడ్చల్ కాంగ్రెస్‌లో గ్రూపు గొడవల వెనుక తామే ఉన్నామని చెప్పుకొచ్చారు. గతంలో తనపై జరిగిన ఐటీ దాడుల అంశాన్ని మీడియా ప్రస్తావించగా.. ''ఐటీ అధికారులు నా ఇంట్లో డబ్బులు ఉన్న గదిని చూడలేదు. ఆ డబ్బులు ఇప్పుడు ఎన్నికలకు ఖర్చు చేస్తా..'' అని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానా, మరొకరు పోటీ చేస్తారా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ అని పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనం

- దీనిపై కేంద్రం నిర్ణయానికి వస్తుండటం మంచి పరిణామం
- కంటోన్మెంట్ విలీనం కోసం దివంగత ఎమ్మెల్యే సాయన్న చాలా తపించారు
- ఇప్పుడు ఆయన కోరిక నెరవేరనుంది.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్
- గురువారం ఉదయం 11.30కు ప్రారంభమైన సమావేశాలు
- సాయన్న మృతిపట్ల కేసీఆర్ సంతాప తీర్మానం.. నేటికి అసెంబ్లీ వాయిదా




సాయన్న మృతికి సంతాపంగా అసెంబ్లీలో మౌనం పాటిస్తున్న స్పీకర్, సీఎం, సభ్యులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర రక్షణశాఖ, ఆర్మీ పరిధిలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేసేందుకు రంగం సిద్ధమవుతోందని.. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వస్తుండటం మంచి పరిణామమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. కంటోన్మెంట్‌ను హైదరాబాద్‌లో కలపాలన్నది ఆ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే సాయన్న కల అని, ఇప్పుడు అది నెరవేరే సమయం వచ్చిందని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు గురువారం ఉదయం 11.30కు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. జాతీయ గీతాలాపన అనంతరం స్పీకర్ సూచన మేరకు కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ''సాయన్న నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు. ఎమ్మెల్యేగా, వివిధ హోదాల్లో పనిచేశారు. ఎలాంటి సమయంలో అయినా చిరునవ్వుతో, అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి. ఏదైనా ప్రయత్నం చేసి కంటోన్మెంట్‌ను హైదరాబాద్‌లో కలిపితే బాగుంటుందని ఆయన ఎన్నోసార్లు చెప్పారు. ఆర్మీ నిబంధనలు కఠినంగా ఉండటంతో బలహీన వర్గాలకు కాలనీ కట్టాలన్నా ఇబ్బందిగా ఉండేవారు. ఆయన విజ్ఞప్తి మేరకు పలుమార్లు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించాం. కేంద్ర ప్రభుత్వం కూడా కంటోన్మెంట్లను నగర పాలకవర్గాల్లో కలపాలని నిర్ణయానికి వస్తున్నట్టు కబురు అందింది. ఆ రకంగా సాయన్న కోరిక నెరవేరుతోంది. ఆయన లేని లోటు తీర్చలేనిది..''అని కేసీఆర్ పేర్కొన్నారు. అనంతరం సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సంతాపం తీర్మానంపై మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, తలసాని, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంఐఎం ఎమ్మెల్యే పాషా ఖాద్రి తదితరులు మాట్లాడారు. తర్వాత ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే విజయారామారావు మృతి పట్ల కూడా సభ సంతాపం ప్రకటించింది. తర్వాత సమావేశాలను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మొత్తంగా తొలిరోజు 27 నిమిషాల పాటు అసెంబ్లీ కొనసాగింది.

● సక్సెస్ స్టోరీ



● ప్రణయ్ ● అధర్వ

పరీక్షలు వస్తున్నాయంటే పట్టాలపై పరుగులు తీయాల్సిన రైళ్లు మన గుండెల్లో పరుగెత్తిన రోజులు ఇప్పటికీ గుర్తుంటాయి. తరాలు మారినా పరీక్షల సమయంలో ఒత్తిడి, భయం మారలేదు. పరీక్షల మాట ఎలా ఉన్నా పండగ అంటే బోలెడు సంతోషం వస్తుంది. అందుకే 'పరీక్షలను పండగ చేసుకోండి. సంతోషం మీ దగ్గర ఉంటే సక్సెస్ మీ దగ్గర ఉన్నట్లే' అంటున్నారు మధ్యప్రదేశ్‌కు చెందిన అధర్వ, ప్రణయ్ అనే ఇద్దరు మిత్రులు...

పరీక్షలను పండగ చేశారు

ఎంతోమంది విద్యార్థుల్లాగే అధర్వ, ప్రణయ్‌లకు పరీక్షలకు రెండు,మూడు రోజుల ముందు హడావిడిగా పుస్తకాలు పట్టుకోవడం అలవాటు. లాస్ట్-మినిట్ రివిజన్ వల్ల గందరగోళానికి గురైన రోజులు ఎన్నో ఉన్నాయి.

కట్ చేస్తే....

ఇంజనీరింగ్ చదవడం కోసం ప్రణయ్ ముంబై, అధర్వ చెన్నై వెళ్లారు. ఎవరి దారులు వారివి అయిపోయాయి. చాలారోజుల తరువాత కలుసుకున్నప్పుడు వారి మధ్య 'ఎగ్జామ్స్ సమయంలో స్టూడెంట్స్' అనే బరువైన ప్రస్తావన వచ్చింది. పరీక్షల సమయంలో విద్యార్థులకు ధైర్యం ఇవ్వడానికి, ఉత్సాహం అందించడానికి తమ వంతుగా ఏదైనా చేయాలని ఆలోచించారు. ఆ ఆలోచనలో నుంచి పుట్టిందే 'పఢ్‌లే' (చదువు కో) అనే యూట్యూబ్ చానల్, వెబ్‌సైట్.

స్టూడెంట్స్‌కు ఉచితంగా అందుబాటులో ఉండే తమ చానల్, వెబ్‌సైట్‌లు ఎడ్యుకేషనల్ మెటీరియల్‌కు స్టోర్‌హౌజ్‌గా ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులకు ఉపయోగపడే నోట్స్, లెక్చర్స్, స్టడీ టిప్స్...ఇలా ఎన్నో అంశాలకు ఈ 'పఢ్‌లే' వేదికగా మారింది. ప్రకటనలు, డొనేషన్‌లు తమకు ప్రధాన ఆదాయ వనరు.

'ఎన్నో రంగాలలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చినా విద్యావ్యవస్థలో మాత్రం రావడం లేదు. బోధన అనేది యాంత్రికం అయితే విద్యార్థులకు అయోమయమే మిగులుతుంది. అది వారి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుంది. పరీక్షలు అంటే స్టూడెంట్స్ భయపడే రోజులు కాదు, సంతోషంతో గంతులు వేసే రోజులు రావాలి' అంటాడు అధర్వ. ఎంత జటిలమైన విషయాన్ని అయినా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడానికి ఎన్నో దారులు ఉన్నాయి. కొందరు ఆ దారుల గురించి కనీసం ఆలోచించరు. కొందరు ఆ దారుల గురించి వెదుకుతారు. ఈ కోవకు చెందిన వారే అధర్వ, ప్రణయ్‌లు.

'కాన్సెప్ట్‌లను అర్థం చేయించాలంటే విద్యార్థులకు కంఫర్ట్‌గా ఉన్న భాషలో చెప్పాలి. ఇంటర్నెట్‌లో ప్రతి సబ్జెక్ట్ మీద ఎంతో కంటెంట్ అందుబాటులో ఉంది. అయితే స్టూడెంట్స్ చేతితో రాసుకున్న నోట్స్‌కే ప్రాధాన్యత ఇస్తారు' అంటాడు ప్రణయ్.

8,9,10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఇద్దరు మిత్రులు కాన్సెప్ట్‌లకు సంబంధించిన నోట్స్ రాసుకున్నారు. వాటిని స్కానింగ్ చేసి తమ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో పాటు ఫన్నీ వీడియోలతో, మీమ్స్‌తో జటిలమైన కాన్సెప్ట్‌లను అర్థం చేయించడం మొదలుపెట్టారు. ఈ ఫార్మట్ సూపర్ సక్సెస్ అయింది.

'పదవ తరగతి చదివే మా అబ్బాయి ఆదిత్య చదువులో వెనకబడ్డాడు. నేను అతడికి అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలని నిర్ణయించుకున్నప్పటికీ ఆఫీస్ పనుల వల్ల అది ఎప్పుడూ సాధ్యం కాలేదు. ఆదిత్య తరచుగా పఢ్‌లే చానల్ చూసేవాడు. అక్కడ ఎన్నో నేర్చుకున్నాడు. ఇప్పుడు బాగా చదువుతున్నాడు' అంటున్నాడు ఇండోర్‌కు చెందిన కుమార్ అనే పేరెంట్.

'ఇక చదవడం నా వల్ల కాదు' అనుకున్న సమయంలో మీ యూట్యూబ్ చానల్ చూశాను. నేను జటిలం అనుకున్న ఎన్నో విషయాలు చాలా సులభంగా అర్థమయ్యాయి. ఇప్పుడు నాకు ఎంతో ధైర్యంగా ఉంది' అని ఈ ఇద్దరు మిత్రులను కలిసి చెప్పిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు.

'పఢ్‌లే'గా మొదలైన తమ యూట్యూబ్ చానల్ ఇప్పుడు 'జస్ట్ పఢ్‌లే'గా మారింది. 1.5 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్స్‌తో దూసుకువెళుతోంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఆన్ యువర్ లాస్ట్ లెగ్స్

ఒక వ్యక్తి జీవితం నుంచి వ్యాపారం, వస్తువుల వరకు చివరి దశలో ఉన్నప్పుడు వాడే మాట ఇది.

ఉదా: మై వోల్డ్ ప్రింటర్ ఈజ్ ఆన్ ఇట్స్ లాస్ట్ లెగ్స్. ఇట్స్ టైమ్ ఐ గాట్ ఏ న్యూ వన్

లేబర్ ఆఫ్ లవ్

కేవలం ఇష్టం వల్ల, ఆహ్లాదం, సంతోషం కోసం ప్రతిఫలాపేక్ష లేకుండా, లాభం ఆశించకుండా చేసే పని.

ఉదా: రన్నింగ్ ది మ్యాగజైన్ టుడే ఈజ్ సమ్‌థింగ్ ఆఫ్ ఏ లేబర్ ఆఫ్ లవ్.

● అవును...ఇది నిజమే!



అమెరికాలోని ఫ్లోరిడా కీస్ జలగర్భంలో జరిగే సంగీత కచేరిలో ప్రతి సంవత్సరం ఎంతోమంది డైవర్స్ పాల్గొంటారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా సముద్రంలోని పగడపు దిబ్బల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని జరిగే మ్యూజిక్ ఫెస్టివల్ ఇది. ఈ వినూత్నమైన కచేరిలో పాల్గొనేవారు వాటర్-థీమ్‌డ్ సాంగ్స్‌ను వింటారు.

టెక్.. టాక్

నూబియ రెడ్ మ్యాజిక్ 8ఎస్ ప్రో



డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిజల్యూషన్: 1116×2480 పిక్సెల్స్
బరువు: 228 గ్రా. వోఎస్: ఆండ్రాయిడ్ 13
ఫ్రంట్ కెమెరా: 16ఎంపీ
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబి ర్యామ్ / 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్ / 512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ

లింక్డ్ ఇన్ కోచ్



లింక్డ్ ఇన్ యూజర్ ప్రొఫైల్ ఇన్ఫర్‌మేషన్ ఆధారంగా రెజ్యూమ్ తయారుచేసే రెజ్యూమ్ బిల్డర్ టూల్‌ను గతంలో తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే ఉద్యోగార్థుల కోసం సరికొత్త ఏఐ టూల్‌ను తీసుకురానుంది. 'లింక్డ్ ఇన్ కోచ్' అనే ఈ ఫీచర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడంలో, కొత్త స్కిల్స్, కెరీర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి యూజర్‌లకు సహాయపడుతుంది. ఈ చాట్‌బాట్ ద్వారా ఒక కంపెనీకి సంబంధించిన వర్క్‌కల్చర్‌ని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ పరీక్ష దశలో ఉంది.

హానర్ ప్యాడ్ ఎక్స్9




సైజ్: 11.5 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1200×2000 పిక్సెల్స్
బరువు: 495 గ్రా. ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్
కలర్: స్పేస్ గ్రే ● గ్లాస్ ఫ్రంట్, అల్యూమినియం ఫ్రేమ్, అల్యూమినియం బ్యాక్

ఎల్‌ఈడీ రింగ్ లైట్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కనెక్టివిటీ: యూఎస్‌బీ
పర్‌ఫెక్ట్ ఫర్: వీడియో కాలింగ్, వ్లోగింగ్, యూట్యూబ్ వీడియోలు, ఫొటోగ్రఫీ
● మల్టీపుల్ అడ్జస్ట్‌మెంట్ లెవెల్స్
బరువు: 2కేజీ 70గ్రా.

గూగుల్ అన్‌నోన్ ట్రాకర్ ఫీచర్



గూగుల్ 'అన్‌నోన్ ట్రాకర్ ఎలర్ట్' ఫీచర్‌ని తీసుకువచ్చింది. అన్‌వాంటెడ్ బ్లూటూత్ ట్రాకర్స్ గురించి యూజర్‌లకు తెలియజేసే 'అన్‌వాంటెడ్ బ్లూటూత్ ట్రాకర్స్' ఫీచర్‌పై యాపిల్‌తో కలిసి పని చేస్తున్నట్లు ఈ సంవత్సరం ప్రారంభంలో గూగుల్ ప్రకటించింది. ప్రస్తుతం ఇది యాపిల్ వారి ఎయిర్‌ట్యాగ్‌కు మాత్రమే సపోర్ట్ చేస్తుంది. భవిష్యత్తులో మరిన్ని బ్లూటూత్ ఆధారిత ట్రాకర్స్‌కు దీన్ని విస్తరించే అవకాశం ఉంది.

● మ్యూజిక్ వరల్డ్



తన్మయ గీతం

దిల్లీకి చెందిన తన్మయ భట్నాగర్ సెల్ఫ్-టాట్ సింగర్, సాంగ్ రైటర్, గ్రాఫిక్ డిజైనర్. తన హృదయంలో పుట్టిన సంగీతం ఎన్నో హృదయాలకు దగ్గరవుతుంది. స్వీయ అనుభవాలే ఆమె పాటలకు స్ఫూర్తి, శక్తి...

తన్మయ భట్నాగర్ తండ్రి ఆర్మీలో పనిచేసేవారు. తండ్రి ఉద్యోగరీత్యా తన్మయ రాజస్థాన్, గ్యాంగ్‌టక్, చెన్నై...ఇలా ఎన్నోచోట్ల చదువుకుంది. ఎక్కడికి వెళ్లినా తనతో పాటు పాట వచ్చేది. దీంతో పాటు ఇంటినిండా సంగీతమే. తల్లి గిటార్ వాయించేది. పాటలు రాసేది. మరి ఆ స్ఫూర్తి ఎక్కడికి పోతుంది!

'క్యా తుమ్ నారాజ్ హో!' డెబ్యూ సింగిల్‌తో మ్యూజిక్ వరల్డ్‌లోకి అడుగు పెట్టింది తన్మయ. అన్‌కంఫర్ట్ ఫీలింగ్‌ను పట్టించే పాట ఇది.

తనకు సంగీతంలో స్ఫూర్తి అయిన తల్లి కోసం 'రాత్ అధూరి' అనే పాట రాసింది తన్మయ.

గిటార్, ఉకులేలే ప్లే చేసే తన్మయ ఇంగ్లిష్, హిందీ భాషలలో పాటలు రాస్తుంది. ఆమె ట్యూన్స్ గ్రౌండ్-బ్రేకింగ్ ఫీలింగ్స్ నుంచి పుట్టినవి అంటారు విశ్లేషకులు.

తన్మయకు సంగీతం అంటేనే కాదు కొత్త భాష నేర్చుకోవడం అంటే కూడా ఇష్టం. అలా నేర్చుకున్నదే జర్మన్. జర్మనీ వెళ్లి మరీ నేర్చుకుంది. తన్మయ రిలీజ్ చేసిన తాజా పాట...ఇజ్‌హర్.

ఇంతకీ తన్మయకు సంగీతం ఏం ఇచ్చింది? ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'నేను తప్పనిసరిగా చెప్పాల్సిన విషయాన్ని భయం లేకుండా చెప్పడానికి సంగీతం అనేది ఒక వేదికలా ఉపయోగపడింది'

● గేమింగ్

ఆ చూపుల్లో క్షిపణులు ఉన్నాయి!

యాక్షన్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'అట్లాస్ ఫాలెన్' ఈ నెల 10న విడుదల కానుంది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ తమ సొంత ప్లేయర్ అవతార్‌ని సృష్టించవచ్చు. గంట్లెట్ అనే ప్రాచీన ఆయుధం ప్లేయర్‌కు రక్షణగా ఉపయోగపడుతుంది. ఈ ఆయుధంతో ఎయిర్ డ్యాషింగ్‌లాంటి ఫీట్స్ చేయవచ్చు. రహస్య ప్రదేశాలతో పాటు కొత్త దారులను కనిపెట్టవచ్చు. ఈ ట్రెడిషన్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్స్ మూడు రకాల ఆయుధాలను ఉపయోగించవచ్చు.ప్లేయర్స్ ఎక్స్‌ప్లోర్ చేయడానికి ఈ గేమ్‌లో ఎన్నో బహిరంగ ప్రదేశాలు ఉంటాయి.నాన్-ప్లేబుల్ క్యారెక్టర్స్‌ను కూడా కలవవచ్చు. ఈ గేమ్‌లో టు-ప్లేయర్ కోఆపరేటివ్ మోడ్ కూడా ఉంది.



జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్


సినిమా


● రామ్, శ్రీలీల

రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్కంద'. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న రిలీజ్ కానుంది. గురువారం ఈ సినిమాలోని 'నీ చుట్టు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తమన్ స్వరకల్పనలో రఘురామ్ సాహిత్యం అందించిన ఈ పాటను సిద్ శ్రీరామ్, కె. సంజన పాడారు.

భోళా..లో నా పాత్ర ఓ చిన్న బ్రీజ్

\- సుశాంత్



''హీరో, అతిథి, సపోర్టింగ్ రోల్.. ఇలా నచ్చిన పాత్రలన్నీ చేస్తున్నాను. ఏదీ ప్లాన్ చేసింది కాదు. 'అల.. వైకుంఠపురములో' చిత్రంలో నన్ను కొత్తగా చూపించారు. 'రావణాసుర'లోనూ కొత్తగా కనిపించాను. ఇప్పుడు చిరంజీవిగారి 'భోళా శంకర్' సినిమా చేశాను. మెగాస్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. నేను సోలో హీరోగా చేసినా ఈ సినిమాకు వచ్చినంత హైప్ రాదేమో!'' అన్నారు సుశాంత్. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో సుశాంత్ మాట్లాడుతూ– ''చిన్నప్పట్నుంచి చిరంజీవిగారి సినిమాలు చూస్తూ, ఆయన అభిమానులుగా పెరిగాం. ఆయన పాటలకు నేను చిన్నతనంలో డ్యాన్స్‌లు కూడా వేశాను. అందుకే 'భోళా శంకర్' చిత్రం గురించి మెహర్ రమేష్‌గారు చెప్పగానే ఎగ్జైటింగ్‌గా అనిపించింది. అలాగే ఈ చిత్రంలో ఓ పాట కూడా ఉందని చెప్పారు. చిరంజీవి గారితో డ్యాన్స్ చేసే చాన్స్ ఎంతమందికి వస్తుంది. మెహర్ గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడే చిరంజీవిగారితో డ్యాన్స్ స్టెప్పులు ఉండాలని ఆయన దగ్గర మాట తీసుకున్నాను. చిరంజీవిగారు, తమన్నా, కీర్తీ సురేష్, నేను.. ఇలా మా కాంబినేషన్‌లో ఓ పాట కోసం చాలా ప్రాక్టీస్ చేశాను. తమిళ 'వేదాలం'ని చూడలేదు. అయితే 'భోళా శంకర్' చిత్రంలో నా క్యారెక్టరైజేషన్, నిడివిలో చాలా మార్పులు చేశామని మెహర్‌గారు చెప్పారు. భోళా మానియాలో నా పాత్ర చిన్న బ్రీజ్‌లా వుంటుంది. చిరంజీవిగారు సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారు. 'ఇది మీ తాతగారి స్టెప్' అంటూ సెట్స్‌లో ఓ స్టెప్ వేసి చూపించారు (నవ్వుతూ). ఇక నేను సోలో హీరోగా రెండు కథల వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫీమేల్

క్యారెక్టర్ డిమాండ్‌ని బట్టి గెటప్ మారుతుంది. ఒక్కోసారి మేల్ 'ఫీమేల్'గా మారాల్సి వస్తుంది. ఫీమేల్ 'మేల్'గా మారాల్సి వస్తుంది. అలా క్యారెక్టర్ డిమాండ్ మేరకు ఇద్దరు హిందీ హీరోలు ఫీమేల్ గెటప్‌లోకి మారారు. ఇటు సౌత్‌లో ఇద్దరు హీరోలు లేడీ గెటప్స్‌లోకి మారనున్నారు. ఆ ఫీ'మేల్' విశేషాలు...


● ఆయుష్మాన్


● నవాజుద్దీన్


● కమల్‌హాసన్


● విశ్వక్ సేన్

ఆయుష్‌ఉమన్

''అయ్య బాబోయ్.. స్త్రీ పాత్ర చేయడం అంత ఈజీ కాదండోయ్'' అంటున్నారు ఆయుష్మాన్ ఖురానా. 'డ్రీమ్ గర్ల్ 2'లో తను చేసిన పూజ పాత్ర గురించే ఆయన అలా అన్నారు. 'అంధాధున్'లో అంధుడిగా, 'బాలా'లో బట్టతల ఉన్న యువకుడిగా.. ఇలా వైవిధ్యమైన పాత్రల్లో మెప్పించిన ఆయుష్మాన్ 'డ్రీమ్ గర్ల్ 2' చిత్రంలో కరణ్‌వీర్ అనే యువకుడిగా, పూజ అనే యువతిగా కనిపించనున్నారు. 2019లో ఆయుష్మాన్ హీరోగా నటించిన 'డ్రీమ్ గర్ల్'కి ఇది సీక్వెల్. తొలి భాగాన్ని తెరకెక్కించిన రాజ్ షాండిల్యానే మలి భాగానికి కూడా దర్శకత్వం వహించారు. ఫస్ట్ పార్ట్‌లోనూ పూజ పాత్రలో కనిపించిన ఆయుష్మాన్ సెకండ్ పార్ట్‌లోనూ ఆ పాత్ర చేశారు. ఓ చిన్న పట్టణానికి చెందిన కరణ్ తన తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి కష్టాలు పడుతుంటాడు. అతని ప్రేయసి పరీ (అనన్యా పాండే). అయితే ఆమెను పెళ్లాడటానికి పరీ తండ్రి కరణ్‌కి కొన్ని నిబంధనలు పెడతాడు. తన ముందున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి పూజాగా మారతాడు కరణ్. ఇలా కష్టాల కరణ్‌గా, నవ్వులు పూయించే పూజాగా ఆయుష్మాన్ నటించిన 'డ్రీమ్ గర్ల్ 2' ఈ నెల 25న విడుదల కానుంది. కాగా.. ''స్త్రీ వేషం చాలా సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా ఎండల్లో విగ్ పెట్టుకుని నటించడం కష్టంగా అనిపించింది. ఈ ఆయుష్'మాన్' చేసిన ఆయుష్'ఉమన్'ని ఇష్టపడతారని ఆశిస్తున్నాను'' అన్నారు ఆయుష్.

అమ్మాయిగా ఆలోచించాలి

''ఫీమేల్ ఆర్టిస్టులు వ్యానిటీ వేన్ నుంచి బయటకు రావడానికి అన్నేసి గంటలు ఎందుకు పడుతుందో నాకిప్పుడు అర్థమైంది. మేల్ ఆర్టిస్ట్‌ల మేకప్‌తో పోల్చితే ఫీమేల్‌కి చాలా ఎక్కువ టైమ్ పడుతుంది. నేను చేసిన స్త్రీ పాత్ర మేకప్‌కి మూడు గంటలు పట్టేది'' అని నవాజుద్దీన్ సిద్ధిఖీ అంటున్నారు. 'హడ్డీ' చిత్రంలో తాను చేసిన లేడీ క్యారెక్టర్ గురించే నవాజుద్దీన్ ఈ విధంగా అన్నారు. అక్షయ్ అజయ్ శర్మ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఓ చిన్న పట్టణానికి చెందిన హరి అనే యువకుడికి అమ్మాయిగా మారాలనే ఆకాంక్ష ఉంటుంది. లింగ మార్పిడి గురించి ఈ చిత్రంలో చూపించారు. ''అమ్మాయి పాత్ర చేయడానికి అమ్మాయిలా మేకప్ వేసుకుంటే చాలదు.. అమ్మాయిలానే ఆలోచించాలి. నేను అలానే చేశాను'' అంటూ ఈ పాత్రలో తానెంతగా లీనమయ్యారో చెప్పారు నవాజుద్దీన్. ఇదిలా ఉంటే... వెంకటేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'లో ఆయన విలన్‌గా నటిస్తున్నారు. తెలుగులో నవాజుద్దీన్‌కి ఇది తొలి చిత్రం.

పదిహేనేళ్ల తర్వాత...

వైవిధ్యమైన పాత్రలకు చిరునామా కమల్‌హాసన్. ఫిజికల్లీ చాలెంజ్డ్, చిన్న వయసులో వృద్ధుడిగా, ఎత్తు పళ్లు, వృద్ధురాలిగా.. ఇలా క్యారెక్టర్ డిమాండ్ మేరకు మౌల్డ్ అవుతారు కమల్‌హాసన్. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2'లో నటిస్తున్నారు. గతంలో ఈ ఇద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన 'ఇండియన్' (1996) చిత్రానికి ఇది సీక్వెల్. ఇందులో కమల్ యువకుడిగా, వృద్ధుడిగా కనిపించనున్నారని తెలిసిందే. కొన్ని సన్నివేశాల్లో స్త్రీగానూ కనిపించనున్నారన్నది తాజా సమాచారం. ఇదే నిజమైతే పదిహేనేళ్ల తర్వాత కమల్ స్త్రీ వేషంలో కనిపించినట్లు అవుతుంది. గతంలో కమల్‌హాసన్ 'భామనే సత్యభామనే' (1996), 'దశావతారం' (2008)లో లేడీ గెటప్‌లో కనిపించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక 'ఇండియన్ 2' విషయానికి వస్తే.. ఓ సమస్య పరిష్కారానికి కమల్ స్త్రీ వేషంలోకి మారతారని టాక్.

లేడీ గెటప్ పై ఫోకస్

విశ్వక్ సేన్‌లో మంచి నటుడు–దర్శకుడు ఉన్న విషయాన్ని నిరూపించిన చిత్రం 'ఫలక్‌నుమా దాస్'. ఆ తర్వాత 'హిట్', 'పాగల్'... ఇలా హీరోగా ఒకదానికి ఒకటి పోలిక లేని చిత్రాలు చేస్తున్న విశ్వక్ ఆ మధ్య ఓ సినిమా ప్రమోషన్ సమయంలో తాను ఒక సినిమాలో లేడీ గెటప్‌లో కనిపించనున్నట్లు పేర్కొన్నారు. అయితే జస్ట్ కొన్ని సన్నివేశాల్లో అలా కనిపించి మాయం కాకుండా సినిమా సెకండాఫ్ మొత్తం ఆ గెటప్‌లోనే కనిపించనున్నారని సమాచారం. అందుకే ఈ చిత్రానికి 'లీల' అనే టైటిల్ పెట్టాలనుకుంటున్నారని భోగట్టా. ఈ చిత్రం గురించి, ఈ పాత్ర గురించి అధికారిక ప్రకటన అయితే రాలేదు. ప్రస్తుతం విశ్వక్ 'గాంగ్స్ ఆఫ్ గోదావరి', 'గామి'తో పాటు మరికొన్ని చిత్రాలు చేస్తున్నారు. మరి.. వీటిలో ఏదైనా సినిమాలో లేడీ గెటప్ ఉంటుందా? లేక వార్తల్లో ఉన్న ప్రకారం 'లీల' అనే సినిమా ఉంటుందా? అనే క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

సినిమాలో స్పార్క్ ఉందనిపిస్తోంది

\- మంత్రి జగదీశ్వర్ రెడ్డి

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ– ''ఏ సినిమానైనా విమర్శనాత్మక కోణంలో చూసే వ్యక్తిని నేను. 'స్పార్క్' టీజర్ ప్రారంభం చూడగానే నాకు 'శివ' సినిమా గుర్తొచ్చింది. విక్రాంత్‌లో, ఈ సినిమాలో స్పార్క్ ఉందనిపిస్తోంది. ఈ సినిమా కొత్త ట్రెండ్‌ని క్రియేట్ చేయడంతో పాటు విజయం సాధించాలి'' అన్నారు. ''యూఎస్‌లో చదువుకుని, అక్కడే జాబ్ చేసినా సినిమాలపై ప్రేమ పెరిగిందే కానీ తగ్గలేదు. ఆ ప్రేమతోనే 'స్పార్క్' కథ రెడీ చేసుకున్నాను. నేను ప్రేమతో చేసిన ఈ సినిమాను ప్రేక్షకులు ప్రేమతో హిట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు విక్రాంత్. తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్, రచయిత అనంత శ్రీరామ్, ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్ మాట్లాడారు.


● జగదీశ్వర్ రెడ్డి, విక్రాంత్, మెహరీన్, లీలా రెడ్డి, రుక్సార్

విభిన్నం.. వినోదం


● అనన్య

రవితేజ మహదాస్య, అనన్యా నాగళ్ల జంటగా, 'వెన్నెల' కిశోర్ ఓ ప్రధాన పాత్రధారిగా రచయిత మోహన్ దర్శకుడిగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వెన్నెపూస రమణా రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ''ఓ డిఫరెంట్ స్టోరీతో మంచి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. ఈ సినిమా ప్రేక్షకులను తప్పక అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్.

సరికొత్త వూల్ఫ్

ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రల్లో వినూ వెంకటేష్ దర్శకత్వంలో సందేశ్ నాగరాజు, ఎన్. సందేశ్ నిర్మిస్తున్న చిత్రం 'వూల్ఫ్'. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ సినిమా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ప్రభుదేవా యాక్షన్ సీక్వెన్స్‌లు, అనసూయ గెటప్ కొత్తగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● 'వూల్ఫ్'లో ఓ దృశ్యం

అందరొక్కటే..

'లోకం లోన ఏ చోటైనా అందరొక్కటే.. ఎవడుకాడూ ఎర్రి బాగులోడూ.. నిజమిదే..' అంటూ మొదలవుతుంది 'బెదురులంక 2012' చిత్రంలోని 'దొంగోడే దొరగాడు' పాట. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ఇది. క్లాక్స్ దర్శకత్వంలో ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'దొంగోడే దొరగాడు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో కిట్టు విస్సాప్రగడ రాసిన ఈ పాటను సాహితి చాగంటి ఆలపించారు. ''ఓ ఊరి ప్రజలకు దేవుని మీద ఉన్న భక్తిని గమనించిన కొందరు మోసగాళ్లు ఎలా దోచుకుంటారనేది ఈ పాటలో చూపించాం'' అన్నారు క్లాక్స్.


● 'దొంగోడే..' పాటలో ఓ దృశ్యం

సాక్షి బిజినెస్

శుక్రవారం
4-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	542	65,241
నిఫ్టీ ▽	145	19,382

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాజా రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,004	△	30
డోజోన్స్	35,301	△	18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,529	▽	32
డాక్స్	15,893	▽	127
షాంఘై	3,280	△	19
నికాయ్	32,159	▽	548

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర		మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	59,310	▽	306
బంగారం (99.5 స్వచ్ఛత)	59,073	▽	304
వెండి (కిలో)	72,197	▽	2076

జూలైలో సేవలు సూపర్

పదమూడేళ్ల గరిష్ట స్థాయిలో 62.3కు పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం జూలైలో అద్భుత పనితీరు కనబరిచింది. ఇందుకు సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ పదమూడేళ్ల గరిష్ట స్థాయి 62.3కు ఎగసింది. జూన్‌లో సూచీ 58.5 వద్ద ఉంది. అయితే సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల పీఎంఐ గడచిన 24 నెలలుగా అప్‌ట్రెండ్‌లోనే కొనసాగుతోంది.

సేవలు–తయారీ కలిపినా స్పీడే...

కాగా, సేవలు, తయారీ రంగంతో కూడిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూలైలో 61.9కు ఎగసింది. జూన్‌లో ఇది 59.4 వద్ద ఉంది. కాగా, భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగాన్ని చూస్తే, జూలైలో వరుసగా 25వ నెల వృద్ధి బాటన నిలిచింది. జూలైలో సూచీ 57.7 వద్ద పటిష్టంగా ఉంది. అయితే జూన్‌కన్నా (57.8) స్వల్పంగా తగ్గింది.

విస్తరణ బాటలో ఇరస్వ ఫైన్ జ్యువెలరీ



హైదరాబాద్: ఇరస్వ ఫైన్ జ్యువెలరీ హైదరాబాద్‌లో కొత్త స్టోర్ ప్రారంభం ద్వారా తన రిటైల్ వ్యాపార నెట్‌వర్క్‌ను మరింత విస్తరించుకుంది. ఎల్లే ఇండియా భాగస్వామ్యంతో ముంబై, అహ్మదాబాద్ తర్వాత తన మూడో స్టోర్‌ను బంజారా హిల్స్‌లో ఆవిష్కరించింది. ''ఇరస్వ బ్రాండ్ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఆభరణాల కొనుగోలుతో మీరు కూడా ఇరస్వ కుటుంబ సభ్యులు అవుతారు'' అని కంపెనీ సీఈవో కేతన్ పటేల్ తెలిపారు.

కంప్యూటర్ల దిగుమతిపై నియంత్రణ

- భద్రతాపరమైన అంశాలే కారణం
- దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా కేంద్రం నిర్ణయం
- తక్షణమే అమల్లోకి

న్యూఢిల్లీ: దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకు, భద్రతాపరమైన కారణాల రీత్యా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు అలాగే కొన్ని రకాల కంప్యూటర్ల దిగుమతులపై కేంద్రం గురువారం నియంత్రణలు విధించింది. చైనా, కొరియా వంటి దేశాల నుంచి దిగుమతులను కట్టడి చేసేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. నియంత్రణలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. ఇకపై ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు దిగుమతిదారులు ప్రభుత్వం నుంచి అనుమతి, లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నియంత్రణల విధింపునకు పలు కారణాలు ఉన్నప్పటికీ పౌరుల భద్రతను పరిరక్షించడం అన్నింటికన్నా ప్రధానమైనదని ఆయన వివరించారు. ఆంక్షలు విధించడమనేది దిగుమతులను పూర్తిగా నిషేధించే ఉద్దేశంతో తీసుకున్నది కాదని, వాటిని నియంత్రించడం మాత్రమే లక్ష్యమని చెప్పారు. దీనివల్ల దేశీయంగా ధరలేమీ పెరగబోవని తెలిపారు.



కొన్ని మినహాయింపులు ఉంటాయి..

'ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఆల్–ఇన్–వన్ పర్సనల్ కంప్యూటర్లు, అల్ట్రా చిన్న స్థాయి కంప్యూటర్లు, సర్వర్ల దిగుమతులపై తక్షణమే నియంత్రణలు అమల్లోకి వస్తాయి' అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. అయితే, కొన్ని సందర్భాల్లో మినహాయింపులు ఉంటాయని పేర్కొంది. ఆగస్టు 3 కన్నా ముందుగానే లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేసిన కన్సైన్‌మెంట్లను దిగుమతి చేసుకోవచ్చని వివరించింది. ఆగస్టు 4 నుంచి దిగుమతిదారు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే ఆర్‌అండ్‌డీ, టెస్టింగ్, రిపేర్ అండ్ రిటర్న్ తదితర అవసరాల కోసం కన్సైన్‌మెంట్‌కు 20 ఐటమ్‌ల వరకు దిగుమతి చేసుకునేందుకు లైసెన్సు తీసుకోనక్కర్లేదని వివరించింది. ఈ–కామర్స్ పోర్టల్స్ ద్వారా కొనుగోలు చేసే ఒక ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, పీసీ, లేదా అల్ట్రా స్మాల్ ఫారం ఫ్యాక్టర్ కంప్యూటర్లకు కూడా మినహాయింపులు వర్తిస్తాయి. అయితే, వాటికి వర్తించే సుంకాలను చెల్లించాల్సి ఉంటుంది. దిగుమతులపై ఆంక్షల వల్ల దేశీయంగా ఆయా ఉత్పత్తుల రేట్లు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

బిలియన్ డాలర్ల కొద్దీ దిగుమతులు..

2022–23లో భారత్ 5.33 బిలియన్ డాలర్ల విలువ చేసే పర్సనల్ కంప్యూటర్లు .. ల్యాప్‌టాప్‌లను, 553 మిలియన్ డాలర్ల విలువ చేసే ప్రత్యేక డేటా ప్రాసెసింగ్ మెషీన్లను దిగుమతి చేసుకుంది. భారత్‌లో ఎక్కువగా హెచ్‌సీఎల్, డెల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, లెనొవొ, యాపిల్, హెచ్‌పీ, శాంసంగ్ తదితర ఎలక్ట్రానిక్ దిగ్గజాల ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి. భారత్ ఈ తరహా ఉత్పత్తులను ఏటా 7–8 బిలియన్ డాలర్ల మేర దిగుమతి చేసుకుంటోంది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) నివేదిక ప్రకారం భారత్ చైనా నుంచి దిగుమతి చేసుకునే వాటిల్లో 65 శాతం వాటా ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, ఆర్గానిక్ రసాయనాలు ఉంటున్నాయి. రోజువారీ ఉపయోగించే మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు, సోలార్ సెల్ మాడ్యూల్స్ మొదలైన వాటి కోసం ఎక్కువగా చైనాపైనే ఆధారపడాల్సి ఉంటోంది. దీన్ని తగ్గించుకునే దిశగా దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది.

ఎయిర్‌టెల్ లాభం ఫ్లాట్

- క్యూ1లో రూ. 1,612 కోట్లు
- ఏఆర్‌పీయూ @ రూ. 200

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 1,612 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,607 కోట్లు ఆర్జించింది. అయితే సర్దుబాటుకు ముందు నికర లాభం 91 శాతం జంప్‌చేసి రూ. 2,902 కోట్లుగా నమోదైంది. ఇక మొత్తం ఆదాయం 14 శాతం ఎగసి రూ. 37,440 కోట్లకు చేరింది. దేశీ మొబైల్ సర్వీసుల ఆదాయం 13 శాతంపైగా పుంజుకుని రూ. 26,375 కోట్లను తాకినట్లు కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 183 నుంచి రూ. 200కు బలపడింది. రూ. 19,746 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించగా.. 52.7 శాతం ఇబిటా మార్జిన్లను సాధించింది.



4జీ యూజర్లు అప్

తాజా సమీక్షా కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 56 లక్షల మంది 4జీ వినియోగదారులను జత చేసుకున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ పేర్కొన్నారు. నాణ్యమైన కస్టమర్లపై దృష్టి సారించడం ద్వారా 0.8 మిలియన్ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులను జత కలుపుకున్నట్లు తెలియజేశారు. దీంతో వీరి సంఖ్య దాదాపు 2.05 కోట్లకు చేరినట్లు వెల్లడించారు. ఇక మొబైల్ డేటా వినియోగం 22 శాతం ఎగసి ఒక్కో కస్టమర్‌పై నెలకు 21.1 జీబీకి చేరినట్లు వివరించారు.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 872 వద్ద ముగిసింది.

అన్ని సర్కిళ్లకు జియో 5జీ విస్తరణ పూర్తి

న్యూఢిల్లీ: అన్ని సర్కిళ్లలోనూ 5జీ విస్తరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు టెలికం సంస్థ రిలయన్స్ జియో వెల్లడించింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. తదుపరి టెస్టింగ్ కోసం 10% సైట్లను టర్మ్ సెల్ ఎంపిక చేయనున్నట్లు టెలికం శాఖ (డాట్) వివరించాయి. వీటి ఫలితాలు వచ్చిన తర్వాత సేవల విస్తరణ నిబంధనలను పూర్తి చేసినట్లుగా సర్టిఫికెట్ జారీ అవుతుందని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా జూలై 7 నాటికి టెల్కోలు 2.81 లక్షల పైచిలుకు 5జీ టవర్లను (బీటీఎస్) ఏర్పాటు చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ ఇటీవల తెలిపారు.

అంబుజా చేతికి సంఘీ సిమెంట్స్

- 56.74 శాతం వాటా కొనుగోలు
- మరో 26% వాటాకు ఓపెన్ ఆఫర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ అయిన అంబుజా సిమెంట్స్ తాజాగా హైదరాబాద్‌కు చెందిన సంఘీ ఇండస్ట్రీస్‌లో 56.74 శాతం వాటా కొనుగోలు చేసింది. సంఘీ ప్రమోటర్లు అయిన రవి సంఘీ, కుటుంబం నుంచి ఈ వాటా దక్కించుకుంది. ఇందుకోసం అంబుజా సిమెంట్స్ రూ.1,674 కోట్లు వెచ్చిస్తోంది. మరో 26 శాతం వాటా కోసం అంబుజా సిమెంట్ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. 6.71 కోట్ల ఈక్విటీ షేర్లకుగాను 13.8 శాతం ప్రీమియంతో ఒక్కొక్కటి రూ.114.22 చొప్పున రూ.767 కోట్లను ఖర్చు చేయనుంది. ఓపెన్ ఆఫర్ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయితే సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్‌కు 82.74 శాతం వాటా దక్కుతుంది. ఈ డీల్‌లో భాగంగా సంఘీ ఇండస్ట్రీస్‌ను రూ.5,000 కోట్లుగా విలువ కట్టారు. 3–4 నెలల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది. సంఘీ ఇండస్ట్రీస్ కొనుగోలుతో అంబుజా సిమెంట్స్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.36 కోట్ల టన్నులకు చేరనుంది.

ఉత్పత్తి సామర్థ్యం పెంపు..

సంఘీ సిమెంట్స్‌కు గుజరాత్‌లోని కచ్ వద్ద ఉన్న సంఘీపురంలో 61 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యం గల సిమెంట్ ప్లాంటుతోపాటు 66 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో క్లింకర్ ప్లాంట్ ఉంది. 'సంఘీ ఇండస్ట్రీస్‌తో చేతులు కలపడం ద్వారా అంబుజా తన మార్కెట్ ఉనికిని విస్తరించడానికి, ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడానికి.. నిర్మాణ సామగ్రి రంగంలో అగ్రగామిగా తన స్థానాన్ని బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉంది. సంఘీ ఇండస్ట్రీస్‌కు ఉన్న 100 కోట్ల టన్నుల సున్నపురాయి నిల్వలతో అంబుజా సిమెంట్స్ వచ్చే రెండేళ్లలో సంఘీపురంలో సిమెంట్ సామర్థ్యాన్ని 1.5 కోట్ల టన్నులకు చేర్చనుంది. అదానీ గ్రూప్ 2028 నాటికి 14 కోట్ల మెట్రిక్ టన్నుల సిమెంట్ తయారీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉంది' అని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ సందర్భంగా తెలిపారు.



ఒప్పంద కార్యక్రమంలో రవి సంఘీ, గౌతమ్ అదానీ

పెద్ద నౌకలకు వీలుగా..

8,000 డెడ్ వెయిట్ టన్నేజ్ సామర్థ్యం గల పెద్ద నౌకలు వచ్చేందుకు వీలుగా అక్కడే ఉన్న పోర్టును విస్తరించడానికి పెట్టుబడి చేయనున్నట్టు అదానీ పోర్ట్స్, స్పెషల్ ఎకనమిక్ జోన్ సీఈవో కరణ్ అదానీ వెల్లడించారు. దేశంలో అతి తక్కువ ఖర్చుతో క్లింకర్‌ను ఉత్పత్తి చేసే ప్లాంటుగా సంఘీ ఇండస్ట్రీస్‌ను తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని చెప్పారు.

గురువారం అంబుజా షేరు ధర 2.87% పెరిగి రూ.474.20 వద్ద, సంఘీ ఇండస్ట్రీస్ షేరు ధర 4.99% ఎగసి రూ.105.76 వద్ద స్థిరపడింది.

నెల కనిష్టానికి సూచీలు

- సెన్సెక్స్ 542 పాయింట్లు క్రాష్
- 19,400 దిగువకు నిఫ్టీ

ముంబై: ఫిచ్ రేటింగ్స్ ఏజెన్సీ అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించిన ప్రభావం ఈక్విటీ మార్కెట్లపై కొనసాగింది. బాండ్లపై రాబడులు పెరగడం, డాలర్ ఇండెక్స్ బలపడటం తదితర అంశాలూ ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. ఫలితంగా మూడో రోజూ అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు నాలుగు వారాల కనిష్ట స్థాయి వద్ద ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 232 పాయింట్ల నష్టంతో 65,551 వద్ద, నిఫ్టీ 63 పాయింట్లు పతనమై 19,464 వద్ద మొదలయ్యాయి. ప్రపంచ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో సూచీలు రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 820 పాయింట్లు క్షీణించి 64,963 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు పతనమై 19,296 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే వారాంతపు ఎఫ్‌అండ్‌ఓ ముగింపు సందర్భంగా ట్రేడర్లు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చేపట్టడంతో సూచీలు స్వల్పంగా నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. చివరికి సెన్సెక్స్ చివరికి 542 పాయింట్ల నష్టంతో 65,241 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 145 పాయింట్లు దిగివచ్చి 19,382 వద్ద ముగిసింది. బ్యాంకులు, ఫైనాన్స్, మెటల్, ఇంధన, రియల్టీ షేర్లలో భారీ అమ్మకాలు నెలకొన్నాయి. జూన్ క్వార్టర్ మెరుగైన ఫలితాల దన్నుతో ఫార్మా షేర్లు నష్టాల మార్కెట్లోనూ ఎదురీదాయి.



సాక్షి స్పోర్ట్స్



దేవధర్ ట్రోఫీ విజేత సౌత్‌జోన్

దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీ దేవధర్ ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని సౌత్‌జోన్ జట్టు అజేయ విజేతగా నిలిచింది. పుదుచ్చేరిలో గురువారం జరిగిన ఫైనల్లో సౌత్‌జోన్ 45 పరుగుల తేడాతో ఈస్ట్‌జోన్ జట్టును ఓడించి తొమ్మిదోసారి దేవధర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 328 పరుగులు చేసింది. రోహన్ (75 బంతుల్లో 107 : 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. మయాంక్ (63 : 4 ఫోర్లు), జగదీశన్ (54 : 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం 329 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఈస్ట్‌జోన్ 46.1 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌటైంది. రియాన్ పరాగ్ (95 : 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించాడు. సౌత్‌జోన్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు తీయగా... వైశాఖ్, కౌశిక్, విద్వత్ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు.

భారత్ శుభారంభం



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7–2 గోల్స్‌తో చైనాపై గెలిచింది. ఆట ఆరంభమైనప్పటి నుంచే భారత్ ఆధిపత్యం కూడా మొదలైంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (5వ, 8వ ని.లో), వరుణ్ కుమార్ (19వ, 30వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ (15వ ని.లో), ఆకాశ్‌దీప్ సింగ్ (16వ ని.లో), మన్‌దీప్ సింగ్ (40వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా తరఫున వెన్ హుయ్ (18వ ని.), జిషెంగ్ గావ్ (25వ ని.) చెరో గోల్ సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా 2–1తో జపాన్‌పై, మలేసియా 3–1తో పాకిస్తాన్‌పై గెలిచారు. నేడు జరిగే పోటీలో జపాన్‌తో భారత్ ఆడుతుంది.

మూడో రౌండ్‌లో హంపి, హారిక





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలతోపాటు మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) దివ్య దేశ్‌ముఖ్, అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్‌లో హంపి 1.5–0.5తో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంకపై నెగ్గగా... హారిక 2–0తో మిచలినా (పోలాండ్)ను ఓడించింది. ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఎస్ఎల్ నారాయణన్, దొమ్మరాజు గుకేశ్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానంద మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టగా... ఇరిగేశి అర్జున్, కార్తీక్ వెంకటరామన్, విదిత్ మూడో రౌండ్‌లో బెర్త్ కోసం టైబ్రేక్ గేమ్‌లు ఆడతారు.

తొలి టి20 చేజారె...

4 పరుగులతో ఓడిన భారత్ • విండీస్ సమష్టి విజయం • రాణించిన తిలక్ వర్మ

తరూబా (ట్రినిడాడ్): వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌ను భారత్ తడబడుతూ ఆరంభించింది. సులువైన లక్ష్యాన్ని కూడా ఛేదించలేక జట్టు ఓటమిని ఆహ్వానించింది. గురువారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ 4 పరుగుల తేడాతో విండీస్ చేతిలో ఓటమి పాలైంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (32 బంతుల్లో 48; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (34 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లతో రాణించగా, బ్రెండన్ కింగ్ (19 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో చహల్, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులు చేసింది. తిలక్ వర్మ (22 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ ఆదివారం ప్రావిడెన్స్‌లో జరుగుతుంది.

రాణించిన పూరన్...

విండీస్ ఇన్నింగ్స్‌ను కింగ్ దూకుడుగా మొదలుపెట్టాడు. మేయర్స్ (1)తో తొలి వికెట్ భాగస్వామ్యంలో 4 ఓవర్లలో 29 పరుగులు రాగా, ఇందులో కింగ్ ఒక్కడే 28 పరుగులు సాధించాడు. అయితే తర్వాతి ఓవర్ వేసిన చహల్ తొలి మూడు బంతుల్లోనే ఓపెనర్లు ఇద్దరినీ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపించాడు. పూరన్ తాను ఆడిన తొలి 6 బంతుల్లోనే 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 54 పరుగులకు చేరింది. కొత్త ఆటగాడు తిలక్ వర్మ వరుసగా రెండు క్యాచ్‌లు పట్టడంతో చార్లెస్ (3), పూరన్ వెనుదిరిగారు. మరో ఎండ్‌లో పావెల్ ధాటిగా ఆడిన కొన్ని షాట్లు విండీస్‌కు కాస్త మెరుగైన స్కోరు అందించాయి.

తిలక్ వర్మ మినహా...

ఓపెనర్లిద్దరూ విఫలం కావడంతో ఛేదనలో భారత్‌కు శుభారంభం లభించకపోగా... సూర్యకుమార్ యాదవ్ (21 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ కలిసి స్కోరును పెంచారు. తాను ఎదుర్కొన్న రెండో బంతిని సిక్సర్‌గా మలచి ఖాతా తెరిచిన తిలక్, తర్వాతి బంతిని కూడా సిక్సర్ బాదాడు. పవర్‌ప్లేలో భారత్ 45 పరుగులు చేసింది. ఆ తర్వాత షెఫర్డ్ ఓవర్లోనూ అతను వరుసగా 6, 4 కొట్టాడు. అయితే తక్కువ వ్యవధిలో సూర్య, తిలక్ వెనుదిరిగారు. హార్దిక్ పాండ్యా (19), సంజు సామ్సన్ (12) క్రీజ్‌లో ఉన్నంతసేపు భారత్ గెలుపుపై ధీమా ఉన్నా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హోల్డర్ ఒకే ఓవర్లో వీరిద్దరిని అవుట్ చేయడంతో ఆశలు సన్నగిల్లాయి. చివర్లో అర్ష్‌దీప్ (12) కొంత ప్రయత్నించినా లాభం లేకపోయింది.



హోల్డర్



తిలక్ వర్మ

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (ఎల్బీ) (బి) చహల్ 28; మేయర్స్ (ఎల్బీ) (బి) చహల్ 1; చార్లెస్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 3; పూరన్ (సి) తిలక్ (బి) పాండ్యా 41; పావెల్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 48; హెట్‌మైర్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 10; షెఫర్డ్ (నాటౌట్) 4; హోల్డర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 149. **వికెట్ల పతనం:** 1–29, 2–30, 3–58, 4–96, 5–134, 6–138. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–31–2, ముకేశ్ 3–0–24–0, అక్షర్ 2–0–22–0, చహల్ 3–0–24–2, పాండ్యా 4–0–27–1, కుల్దీప్ 4–0–20–1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) పావెల్ (బి) మెకాయ్ 6; గిల్ (స్టంప్డ్) చార్లెస్ (బి) హొసీన్ 3; సూర్యకుమార్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 21; తిలక్ (సి) హెట్‌మైర్ (బి) షెఫర్డ్ 39; పాండ్యా (బి) హోల్డర్ 19; సామ్సన్ (రనౌట్) 12; అక్షర్ (సి) హెట్‌మైర్ (బి) మెకాయ్ 13; కుల్దీప్ (బి) షెఫర్డ్ 3; అర్ష్‌దీప్ (రనౌట్) 12; చహల్ (నాటౌట్) 1; ముకేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 145. **వికెట్ల పతనం:** 1–5, 2–28, 3–67, 4–77, 5–113, 6–113, 7–129, 8–140, 9–144. **బౌలింగ్:** హొసీన్ 4–0–17–1, మెకాయ్ 4–0–28–2, జోసెఫ్ 4–0–39–0, హోల్డర్ 4–1–19–2, షెఫర్డ్ 4–0–33–2.

తిలక్ వర్మ అరంగేట్రం

హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున రెండు సీజన్లలో ఆకట్టుకున్న ఈ ఎడంచేతి వాటం బ్యాటర్ గురువారం తన తొలి మ్యాచ్ ఆడాడు. ఈ పర్యటనలో ఇప్పటికే టెస్టులు, వన్డేల్లో అరంగేట్రం చేసిన పేసర్ ముకేశ్ కుమార్‌కు కూడా ఇది తొలి టి20 మ్యాచ్. భారత్ తరఫున టి20లు ఆడిన 103, 104వ ఆటగాళ్లుగా వీరిద్దరు నిలిచారు.

200 అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా భారత్ గుర్తింపు పొందింది. ఈ జాబితాలో పాకిస్తాన్ (223 మ్యాచ్‌లు) అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (193), శ్రీలంక (179), ఆస్ట్రేలియా (174) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.

జ్యోతి సురేఖ ముందంజ

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్

బెర్లిన్ (జర్మనీ): గురి తప్పని ప్రదర్శనతో భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. క్వాలిఫయింగ్‌లో రెండో ర్యాంక్‌లో నిలిచిన జ్యోతి సురేఖకు నేరుగా మూడో రౌండ్‌కు 'బై' కేటాయించారు. మూడో రౌండ్ మ్యాచ్‌లో జ్యోతి సురేఖ 139–136తో లికోఅరెలో (అమెరికా)పై, నాలుగో రౌండ్‌లో 148–145తో ఓ యూహున్ (దక్షిణ కొరియా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.



ధీరజ్ పరాజయం

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–6తో రికార్డో సాటో (చిలీ) చేతిలో పరాజయం చవిచూశాడు.

క్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్

ప్రణయ్, ప్రియాన్షు కూడా • మిథున్, కిరణ్ పరాజయం

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు... పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–14, 21–10తో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21–10, 21–17తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ)పై, ప్రణయ్ 19–21, 21–19, 21–13తో చి యు జెన్ (చైనీస్ తైపీ)పై, ప్రియాన్షు 21–8, 13–21, 21–19తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. మిథున్ 13–21, 21–12, 19–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో, కిరణ్ 15–21, 18–21తో ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) 10–21, 20–22తో వకానా నాగహార–మాయు మత్సుమోతో (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.



క్రికెట్‌కు మనోజ్ తివారీ వీడ్కోలు

కోల్‌కతా: భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పాడు. ఈ బెంగాలీ క్రికెటర్ 2008 నుంచి 2015 వరకు అంతర్జాతీయ కెరీర్‌లో 12 వన్డేలు, మూడు టి20లు ఆడాడు. వన్డేల్లో ఒక సెంచరీ, అర్ధసెంచరీ ఉన్నాయి. కానీ మూడు టి20ల్లో ఒకసారి మాత్రమే బ్యాటింగ్ అవకాశం దక్కగా 15 పరుగులే చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో 141 మ్యాచ్‌ల్లో 48.56 సగటుతో 9908 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా, పంజాబ్, రైజింగ్ పుణేలకు ఆడాడు. 2012లో మనోజ్ తివారీ విన్నింగ్ షాట్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచింది. 37 ఏళ్ల తివారీ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ కేబినెట్‌లో రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నాడు.



క్లుప్తంగా...

కొత్తగా 17 మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ కాలేజీలు

సాక్షి, హైదరాబాద్: 2023–24 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా 17 మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీలను ప్రారంభిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని కేటాయించాలని పేర్కొంది.

ఈ జిల్లాల్లో కొత్త కాలేజీలు...

జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్ కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, యాద్రాద్రి భువనగిరి.

రెండు ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు ప్రైవేటు యూనివర్సిటీలు రాబోతున్నాయి. ఇప్పటికే కాలేజీలుగా ఉన్న శ్రీ ఇందు, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి యూనివర్సిటీ హోదాకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ రెండు కాలేజీలు గురువారం సమగ్ర నివేదికతో విద్యాశాఖ కార్యదర్శికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాయి. యూనివర్సిటీగా మార్పు చెందడానికి గల అర్హతలు, మౌలిక వసతులు నివేదించాయి. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కంగ్రాట్స్ తెలంగాణ పోలీస్

ఆపరేషన్ ముస్కాన్ చర్యలను అభినందించిన కైలాశ్ సత్యార్థి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 2617 మంది చిన్నారుల జాడను గుర్తించడంపై తెలంగాణ పోలీస్ శాఖకు నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి గురువారం ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో తప్పిపోయిన, బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారుల జాడను గుర్తించడం హర్షనీయమన్నారు. చిన్నారులను అక్రమ నిర్బంధంలో ఉంచిన మొత్తం 436 మందిపై 400 కేసులు నమోదు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ సీఎంవో అధికారులతో పాటు రాష్ట్ర పోలీసులను తన ట్వీట్‌లో అభినందించారు.

పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్!

వైద్యుల అధ్యయనంలో వెలుగులోకి..

కాలేయంలో అధిక మొత్తంలో పేరుకుపోతున్న కొవ్వు

- భవిష్యత్తులో ప్రమాదకర వ్యాధిగా మారే అవకాశం
- హైదరాబాద్‌లో 1,100 మంది పిల్లలను పరిశీలించిన వైద్యుల బృందం
- 50% నుంచి 60% మందికి ఎన్ఏఎఫ్ఎల్‌డీ ఉన్నట్లు నిర్ధారణ
- ఎక్కువగా సంపన్న వర్గాలు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల్లో సమస్య
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో తక్కువేనని వెల్లడి
- చాక్లెట్లు నూడుల్స్, బిస్కెట్లు వంటి జంక్ ఫుడ్ కారణమని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఫ్యాటీ లివర్..చిన్నారుల్లో సైతం ప్రబలుతున్న ఓ వ్యాధి. పిల్లల కాలేయాలను కమ్ముకుంటున్న ఫ్యాటీ లివర్ వ్యాధిపై నిర్లక్ష్యం వహిస్తే వారి భవిష్యత్తును చేజేతులా రోగాలకు అప్పగించినట్లు అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బొద్దుగా ముద్దుగా మెరిసిపోతూ మడత నలగని దుస్తుల్లో పాఠశాలలకెళ్లొచ్చే చిన్నారుల్ని చూసి మురిసిపోవడం మాత్రమే కాదు వారి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండటం ముఖ్యమని అంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించిన ఓ అధ్యయనం చిన్నారుల్లో ఫ్యాటీ లివర్ సమస్య పెరుగుతోందని వెల్లడించడం ఆందోళన కలిగించే అంశం.

పెద్దల్లోనే కాదు..

హైదరాబాద్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల బృందం నగరంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో అధ్యయనం నిర్వహించింది. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. నాన్ ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్‌డీ)తో బాధపడుతున్న పిల్లల సంఖ్య గణనీయంగా ఉన్నట్లు ఈ అధ్యయనంలో బయటపడింది. సాధారణంగా పెద్దలే ఈ వ్యాధి బాధితులుగా ఉంటారని ఇప్పటిదాకా ఉన్న అభిప్రాయం తప్పని ఈ అధ్యయనం తేల్చి చెప్పింది.



ఏమిటీ ఫ్యాటీ లివర్?

కాలేయం (లివర్)లో అధిక మొత్తంలో కొవ్వు (ఫ్యాట్) పేరుకుపోవడాన్ని ఫ్యాటీ లివర్ అంటారు. ఈ వ్యాధి (స్టీటోసిస్) చాలావరకు పెద్దల్లో ఉంటుంది. అయితే ఆరోగ్యవంతమైన లివర్‌లోనూ స్వల్పంగా కొవ్వు ఉంటుంది. కానీ ఎప్పుడైతే మన లివర్ బరువులో 5 నుంచి 10 శాతం మధ్యకు కొవ్వు పెరుగుతుందో అప్పుడది సమస్యగా మారుతుంది.

ఆహారం.. వ్యాధుల భారం

సోడా, చాక్లెట్లు నూడుల్స్, బిస్కెట్లు వంటి ప్రాసెస్ చేసిన ఆహారాలు వీరు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 'గతంలో ఈ పరిస్థితి ఎక్కువగా యూరప్‌లో కనిపించేది. కానీ ఇప్పుడు ఇక్కడ కూడా ఏర్పడింది. పిల్లలు తినే జంక్ ఫుడ్ చాలావరకు దీనికి కారణమవుతోంది..'అని వైద్యులు అంటున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ అధ్యయనం కూడా చిన్నారులతో సహా 30 శాతం మందిలో ఈ వ్యాధి విస్తృతి ఉన్నట్లు తాజాగా గుర్తించింది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఇది తక్కువగా ఉన్నట్లు తేల్చింది. 'ఆట స్థలాలు లేక పాఠశాలల పిల్లల్లో ఊబకాయం, ఫ్యాటీ లివర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి.రవాణా సౌకర్యాలు కూడా నడకను తగ్గించి వారిలో ఊబకాయానికి ఊతమిస్తున్నాయి..'అని ఉస్మానియా ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం అధిపతి డాక్టర్ సీహెచ్ మధుసూదన్ అంటున్నారు. 'సంపన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని అధ్యయనాల్లో కనుగొన్నాం. అయితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇది తక్కువ..'అని ఏఐజీ బృందంలోని ఓ వైద్యుడు చెప్పారు.

ఏం అవుతుంది?


ఎన్ఏఎఫ్ఎల్‌డీ కొందరిలో నాన్ ఆల్కహాలిక్ స్టీటో హెపటైటిస్ (నాష్)గా మారుతుంది. ఈ పరిస్థితిలో కాలేయం ఎర్రబడి క్రమేణా ఈ వ్యాధికి సంబంధించిన అత్యంత తీవ్రమైన స్థితికి చేరుతుంది. నాష్ బారిన పడిన చిన్నారులు కాలేయ వ్యాధితోనే పెరుగుతారని, భవిష్యత్తులో వీరిలో ఎక్కువ శాతం సిర్రోసిస్ (లివర్ కణజాలం పాడయ్యే క్రమంలో ఏర్పడే మచ్చలు)కు గురయ్యే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది. చివరకు ఇది లివర్ పని చేయకుండా పోవడానికి, కాలేయ క్యాన్సర్‌కు కూడా దారి తీయవచ్చని హెచ్చరించింది. ఇది అతిగా మద్యం తాగడం వల్ల జరిగే నష్టం లాంటిదేనని వైద్యులు చెబుతున్నారు

8 ఏళ్ల పిల్లల్లో కూడా..

ఏఐజీ ఆధ్వర్యంలో అంతర్గత అవసరాల కోసం గత ఆరు నెలల్లో నిర్వహించిన ఈ అధ్యయనంలో భాగంగా 1,100 మంది పిల్లలను పరిశీలించారు. వీరిలో 50% నుంచి 60% మందికి ఎన్ఏఎఫ్ఎల్‌డీ ఉందని తేలింది. వీరిలో ఎనిమిదేళ్ల వయస్సులోపు వారూ ఉన్నారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే..ఈ చిన్నారుల్లో చాలా మందికి ఎటువంటి వ్యాధి లక్షణాలు లేవు. కామెర్లు కూడా కనపడలేదు. కాకపోతే పిల్లలు మాత్రం కొంచెం ఊబకాయంతో ఉన్నారు. వీరు ఆటలు ఆడటానికి ఇష్టపడడం లేదు. అలాగే తక్కువ చురుకుదనంతో ఉన్నారు. లక్షణాలేమీ బయటకు కనపడనప్పటికీ అల్ట్రాసౌండ్ పరీక్షల ద్వారా సమస్యను గుర్తించారు

జంక్ ఫుడ్‌పై అవగాహన పెంచాలి

చిన్నపిల్లల ఆహారంలో చిప్స్, బర్గర్స్, పేస్ట్రీలు, కూల్ డ్రింక్స్ వంటివి భాగం కాకుండా చూడాలి. వీటివల్ల శరీరంలోని బాక్టీరియా మారిపోయి ఫ్యాటీ లివర్‌కు కారణమవుతుంది. అందువల్ల జంక్ ఫుడ్ చేసే చేటుపై కూడా చిన్నారుల్లో అవగాహన పెంచాలి. కూరగాయలు, పెరుగు మంచివనే చిన్న చిన్న విషయాలు తరచు చెబుతుండాలి. సన్నగా ఉండే చిన్నారుల్లోనూ ఫ్యాటీ లివర్ ఉండొచ్చు. కాబట్టి సన్నగా ఉన్నంత మాత్రాన జంక్ ఫుడ్ తినమని చెప్పకూడదు. – డా.నాగేశ్వర్‌రెడ్డి, చైర్మన్, ఏఐజీ ఆసుపత్రి



అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగింది?

- సంతకాల్లో తేడాపై ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదు?
- టీఎస్‌పీఎస్సీ తీరుపై హైకోర్టు ఆగ్రహం
- 'గ్రూప్–1పై పిటిషన్‌లో వాదనలు పూర్తి
- తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారిక వెబ్‌సైట్‌లో గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థుల సంఖ్యను జూన్ 11న 2,33,248గా, తర్వాత 2,33,506గా పేర్కొనడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అభ్యర్థుల సంఖ్య అలా ఎలా పెరిగిందని, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంతకాల్లో భారీగా మార్పు ఉన్నా ఇన్విజిలేటర్ ఎందుకు అభ్యంతరం తెలుపలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఒకసారి ప్రశ్నపత్రం లీకై మరలా పరీక్ష నిర్వహిస్తున్నప్పుడు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కమిషన్‌పై ఉందని, అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌కు సంబంధించి ఇరు పక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి తీర్పు రిజర్వు చేశారు.

తప్పిదాలు పట్టించుకోలేదు: పిటిషనర్ల తరఫు న్యాయవాది

జూన్ 11న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోలేదని, ఇది అక్రమాలకు తావిచ్చేలా ఉందని, ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు బి.ప్రశాంత్, బండి ప్రశాంత్, జి.హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు వాదనలు వినిపించారు. 'బయోమెట్రిక్ తీసుకోని కారణంగా పలు తప్పిదాలకు చోటిచ్చినట్లు అయ్యింది. హాల్ టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎంఆర్ షీట్లు ఇచ్చారు. ఓఎంఆర్ షీట్‌ను మ్యానిప్యులేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని పిటిషనర్లు వినతిపత్రం ఇచ్చినా కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఒకసారి లీకేజీ జరిగి మళ్లీ నిర్వహిస్తున్నారు. పైగా అత్యంత కీలక పోస్టులు భర్తీ చేసే గ్రూప్–1 విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కీలకమైన గ్రూప్–1 పరీక్షలో వేలిముద్రలు తీసుకోని టీఎస్‌పీఎస్సీ..గ్రూప్–4 పరీక్షకు మాత్రం వేలిముద్రలు తీసుకుంది. ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించేలా ఆదేశించాలి..'అని కోరారు.

పకడ్బందీగా ప్రిలిమ్స్: ఏజీ

టీఎస్‌పీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. 'గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణకు కమిషన్ అన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా ఏర్పాట్లు చేసింది. బయోమెట్రిక్ తీసుకోలేదన్న ఆరోపణ సరికాదు. ఆధార్, పాన్, ఎన్నికల కార్డు లాంటి ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో హాల్ టికెట్లను సరిపోల్చి చూశారు. ఆ తర్వాతే అభ్యర్థులను పరీక్ష రాసేందుకు ఇన్విజిలేటర్లు అనుమతించారు. ప్రిలిమ్స్‌ను కమిషన్ సమర్థవంతంగా నిర్వహించింది. ఓ అమ్మాయి సంతకంపై పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరం సరికాదు. పెళ్లి అయిన తర్వాత పెళ్లికి ముందు ఉన్న ఇంటి పేరు మారడంతో సంతకంలో తేడా వచ్చింది. ఈ ముగ్గురు అభ్యర్థులు తప్ప ఎవరూ ప్రిలిమ్స్ రద్దు కోరలేదు..'అని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. వీరి కోసం లక్షల మందిని ఇబ్బంది పెట్టడం సముచితం కాదని, టీఎస్‌పీఎస్సీ ఫలితాలు వెల్లడించేందుకు, మెయిన్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'ఈడబ్ల్యూఎస్' కటాఫ్ మార్కు ఎంత?

పోలీస్ నియామక బోర్డుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కానిస్టేబుల్, ఎస్ఐ నియామకాలకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కటాఫ్ మార్కు ఎంతో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు చైర్మన్‌తో పాటు హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 17వ తేదీకి వాయిదా వేసింది. కానిస్టేబుల్, ఎస్ఐ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం జీఓ 57, 58 విడుదల చేసిందని, ఇందులో తొలుత బీసీ, ఎస్సీ, ఎస్టీ కటాఫ్ మార్కును పేర్కొనలేదని, పరీక్షల తర్వాత కటాఫ్ మార్కు పేర్కొంటూ జీఓలో మార్పు చేసిందని.. ఇందులో ఈడబ్ల్యూఎస్ ఎంతో చెప్పలేదంటూ నల్లగొండ జిల్లా అన్నెపర్తికి చెందిన అంబటి ప్రవీణ్‌కుమార్‌తోపాటు 13 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం, నియామక బోర్డు తీరు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కటాఫ్ మార్కు పేర్కొనని కారణంగా చాలా మంది అభ్యర్థులు నష్టపోతారని, ప్రభుత్వం కటాఫ్ ప్రకటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.